
శాక్రమెంటో తెలుగు సంఘం (టాగ్స్) సంచిక #32 డిసెంబర్ 2022




శాక్రమెంటో తెలుగు సంఘం
శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక

# టాగ్స్ కార్యవర్గం 2021 - 2023

| | | |
|---|---|---|
| "టాగ్స్ సంఘ" శాశ్వత సభ్యులు (Foundation Board Members – Premanent) | | |
| శ్రీ భాస్కర్ దాచేపల్లి | శ్రీ. వాసు కూడిపూడి | శ్రీ మల్లిక్ సజ్జనగాండ్ల |
| శ్రీ ప్రసాద్ కేతిరెడ్డి | శ్రీ. డా. రాంబాబు బావిరిశెట్టి | శ్రీ డా. సంజయ్ యడ్లపల్లి |
| శ్రీ డా. శ్రీధర్ రెడ్డి జక్కిడి | శ్రీ. సుధాకర్ వట్టి | శ్రీమతి స్వర్ణ కంభంపాటి |
| శ్రీ అనిల్ మండవ | శ్రీ. వెంకట్ నాగం | |
| ఛైర్మన్, వైస్-ఛైర్మన్ (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| ఛైర్మన్ | శ్రీ అశ్విన్ తిరునాహరి | |
| వైస్-ఛైర్మన్ | శ్రీ మోహన్ కాట్రగడ్డ | |
| | | |
| కార్యనిర్వాహక సభ్యులు (Executive Committee) – (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| అధ్యక్షుడు | శ్రీ రాఘవ్ చివుకుల | |
| ఉప-అధ్యక్షుడు | శ్రీ ప్రేంచంద్ జొన్నల | |
| కార్యదర్శి | శ్రీమతి శంకరి చీదల్ల | |
| ఉప-కార్యదర్శి | శ్రీమతి భానుదీప్తి ఉదయగిరి | |
| కోశాధికారి | శ్రీ సత్యవీర్ సురభి | |
| సమాచార అధికారి | శ్రీ శ్రీనివాస్ ఈర్పిన | |
| "ధర్మకర్త" సంఘం సభ్యులు (Trustee Board Members) – (జూలై 2021 నుండి జూన్ 2026) | | |
| శ్రీ అశ్విన్ తిరునాహరి | శ్రీ మోహన్ కాట్రగడ్డ | శ్రీ నాగ్ దొండపాటి |
| శ్రీ సందీప్ గుడిపెల్లి | శ్రీ సతీష్ కాంచి | శ్రీ సురేంద్రనాథ్ కొప్పారపు |

| “ధర్మకర్త” సంఘం సభ్యులు (Trustee Board Members) – (జూలై 2018 నుండి జూన్ 2023) | | |
|---|---|---|
| శ్రీ మనోహర్ మండడి | శ్రీమతి శ్రీదేవి మాగంటి | |
| కార్యనిర్వాహక సంఘం సభ్యులు (Executive Board Members) – (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| శ్రీమతి భానుదీప్తి ఉదయగిరి | శ్రీమతి హరిత తాడి | శ్రీ ప్రేంచంద్ జొన్నల |
| శ్రీ రాఘవ్ చివుకుల | శ్రీ సత్యవీర్ సురభి | శ్రీమతి శంకరి చీదెళ్ళ |
| శ్రీమతి శ్రీదేవి ఆళ్ళ | శ్రీ శ్రీనివాస్ ఈర్పిన | శ్రీ సుబ్రమణ్యం రెడ్డి కుమ్మిటి |
| శ్రీ శ్యాం యేలేటి | | |
| | | |
| సలహా సంఘం సభ్యులు (Advisory Board Members) – (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| శ్రీ జితేంద్ర బైని | శ్రీ మహిపాల్ లక్కిడి | శ్రీ నాగి పగడాల |
| శ్రీ రాజేష్ యెక్కలి | శ్రీ రంగ తాటిపర్తి | శ్రీమతి శ్రీ శేష కల్యాణి గుండమరాజు |
| శ్రీ సూరిబాబు జెట్టి | శ్రీ శ్యాం అరిబింది | |
| | | |
| “యువ” సలహా సంఘం సభ్యులు (Youth Advisory Board Members) – (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| చి. ఆదిత్య బొల్లు | చి. అనూహ రెడ్డి | చి. ప్రణవి కొండూరు |
| చి. జిష్ణు దొండపాటి | చి. కీర్తన వంక | చి. భవిత్ జాస్తి |
| చి. రోహిత్ చివుకుల | | |

Below mentioned TAGS Trustee Board Members' term ends on June 30th, 2023:

Sri Manohar Mandadi

Smt Sridevi Maganti



# గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

## TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

## విషయ సూచిక

**టాగ్స్ సంపాదక వర్గం**

**సంపాదకీయం**

**ముఖచిత్రం వెనుక ముచ్చట్లు**

**టాగ్స్ కార్యక్రమాలు : టాగ్స్ జనవరి 2023 సంక్రాంతి  సంబరాలు**

**విరాళాలకు విజ్ఞప్తి**

**రచనలకు ఆహ్వానం!**

**ధారావాహికలు**

స్ఫూర్తి ప్రదాత – సూపర్ స్టార్ కృష్ణ

అన్నాచెల్లెలి గట్టు

అశోక మౌర్య

యోగ సాధన

ఆధ్యాత్మికం

మన ఆరోగ్యం మన చేతుల్లో

**కథాకదంబం**

మనోనిబ్బరం

**కవితాకదంబం**

ఊహలలో రారాజు

చేయెత్తి "జై" కొట్టి చెప్పు తెలుగువాడా! - వచన కవిత

జాగ్రత్త వహించాలి

**బాలకదంబం**

పిల్లల కోసం ఒక పుస్తకం

ప్రతిభావంతులైన స్థానిక పిల్లలు 2023

శాక్రమెంటోలో మనబడి తరగతులు

పిల్లల నవల : జ్ఞానానందమయం – 10

**చిత్రకదంబం**

నీలి సంద్రం లా కనిపిస్తున్న సరస్సు చిత్రం

పుడమికి శిశిర ఋతువు నుండి వచ్చిన బహుమతి చిత్రం

చెట్టు కొమ్మల్లో దాగున్న భానుడి చిత్రం

**ప్రత్యేక శీర్షికలు**

ఆవధాని శిరోమణి – కాశీ కృష్ణాచార్యులు

ఆధ్యాత్మికం – త్రిమూర్తి రూపుడు శ్రీ గురు దత్తుడు

సరదాగా కాసేపు

జాతిని మేల్కొల్పిన తెలుగు పాట – తెలుగువీర లేవరా

పోషకులు/స్పాన్సర్స్ కు విజ్ఞప్తి

**స్పందన**

# గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

## "శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక" సంపాదక బృందం

వెంకట్ నాగం – ప్రధాన సంపాదకుడు

డా. శివాజీ రావు వల్లూరుపల్లి

డా. మధు బుడమగుంట

మనోహర్ మందడి

విజయ గొల్లపూడి

ఆదూరి హైమావతి

# గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

## TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840



## సంపాదకీయం

పాఠకులారా! డిసెంబర్ అంటే ప్రవాస తెలుగువారికి ముందు గుర్తుకువచ్చేది క్రిస్మస్ సెలవులు, ఆపై నూతన సంవత్సరం వేడుకలు, మిత్రులతో సమావేశాలు, విందులు వగైరా... ఇది గతం మాట, ఇప్పుడు డిసెంబర్ అంటే ప్రవాస తెలుగువారికి గుండెలు కాస్తంత కిందకు జారుతున్నాయి, ఎందుకంటే ఈ మధ్య కరోనా మహమ్మారి మూలంగా నవంబర్, ముఖ్యంగా డిసెంబర్ నెలలలో జరుగుతున్న వేడుకలు, విందు సమావేశాల పిదప సందట్లో సడేమియా లాగా కోవిడ్ కేసులు విజృంభిస్తున్నాయి. ఇదేదో నేను ఊహించి చెప్పడంలేదు సుమండి, ముందు జాగ్రత్తగా అమెరికాలో ఉన్న పాఠశాలలో విద్యార్థులకు డిసెంబర్ లో ఉచిత కోవిడ్ పరీక్ష కిట్లు యాజమాన్యంవారు అందజేయడమే ఇందుకు ఉదాహరణ. ఎందుకన్నా మంచిది అని కోవిడ్ టీకాతో పాటూ, ఫ్లూ టీకాను కూడా నేను గతవారమే స్థానిక ఫార్మసీ కి వెళ్లి వేయించుకున్నాను. ఊరికినే పడి ఉంటుంది కదా అని! నిజానికి 2022 సంవత్సరంలో మానవాళికి కోవిడ్ మహమ్మారి నుండి దాదాపు ఉపశమనం కలిగింది అని చెప్పాలి. కోవిడ్ కొత్త వేరియంట్లు అంత ప్రమాదకరం కాకపోవడం నిజంగా మన అదృష్టం. అయితే అమెరికా లో ఆర్థిక మాంద్యం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా కొంత స్తబ్దత నెలకొనే అవకాశముంది, అయితే ఇది తాత్కాలికం అని కొందరు భావిస్తున్నారు.

నెల రోజుల సమయం లో ఇంగ్లీషు కొత్త సంవత్సరం ప్రారంభం అవుతుంది కనుక, ఈ సందర్భంగా గత జనవరి 1న వ్యక్తిగతంగా చేసుకున్న లక్ష్యాలు ఎంతవరకు నెరవేరాయా బేరీజు వేసుకునే సమయం ఇది, దానితో పాటే కొత్త లక్ష్యాలు లేదా సవరించిన లక్ష్యాలు కొత్త సంవత్సరంలో పెట్టుకునే సమయం కూడా, బహుశా డిసెంబర్ నెలను సంధికాలం అనుకోవచ్చునేమో. కొంతమందికి ఇంగ్లీషు కొత్త సంవత్సరం అసలు విషయమే కాదు, వారికి మిగతారోజులకు డిసెంబర్

31, జనవరి 1 కి తేడా ఉండదు. మరికొంతమందికి ఇదో పండుగ లెక్క. సరే క్రిస్మస్ సెలవులు, ఇంగ్లీషు కొత్త సంవత్సరం హడావుడిలో మనమందరం దాదాపు మరచిపోయిన విషయం ఒకటుంది, అది మరేదో కాదు "గీతా జయంతి" - హిందూ పవిత్ర గ్రంధం భగవద్గీత పుట్టినరోజు. మనం పుట్టిన రోజు లేదా కుటుంబ సభ్యుల, స్నేహితుల పుట్టిన రోజుకు హడావుడి చేస్తాం. అయితే ఇంగ్లీషు కొత్త సంవత్సరం పెద్దగా పట్టించుకోనట్లుగా, పుట్టిన రోజును పెద్ద విషయంగా చూడనివాళ్లకు కొదవలేదు. అయితే గీతా జయంతిని మనం భక్తితో స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. అది ఎందుకో మనం క్లుప్తంగా తెలుసుకుందాం. హిందూ పవిత్ర గ్రంధం భగవద్గీత పుట్టినరోజు - ప్రతి ఏడాది మార్గశిర శుద్ధ ఏకాదశి రోజు జరుపుకొంటారు. ఇంగ్లీషు సంవత్సరం ప్రకారం 2022 డిసెంబర్ 3 న "గీతా జయంతి" జరుపుకోవాలి. గీత సాక్షాత్తు భగవానునిచేత పలకబడినది . కాబట్టి ఏ సందేహానికి తావులేకుండా భగవద్గీత పరమ ప్రామాణికమైన మానవజాతికి దివ్యమార్గాన్ని చూపే పవిత్రగ్రంథం.

"గీకారం త్యాగరూపం స్యాత్

తకారమ్ తత్వబోధకమ్

గీతా వాక్య మిదమ్ తత్వం

జ్ఞేయమ్ సర్వ ముముక్షుభి:"

గీత అను రెండక్షరముల తాత్పర్యమును ఈ శ్లోకం తెలుపు చున్నది. “గీ” అనే అక్షరం త్యాగాన్ని బోధించుచున్నది. “త” అనే అక్షరం తత్వాన్ని అంటే ఆత్మస్వరూపాన్ని ఉపదేశించుచున్నది. అటువంటి పరమ పావనమైన గీత భగవానుని నోట వెలువడిన మహాపుణ్యదినము మార్గశిర శుద్ధ ఏకాదశి. ఆ రోజు ఆపవిత్రగ్రంథాన్ని స్పృజించినా మహాపుణ్యము వస్తుంది. ఇక పఠన ప్రభావాన్ని వర్ణించనలవికాదు. మానవాళికి సర్వ సమస్యలకు పరిష్కారాన్ని సూచించే జగద్గురువైన ఈ గ్రంథరాజాన్ని ఈ రోజునుంచైనా పఠించటం ప్రారంభించండి. మీకు భగవద్గీత అందుబాటులో లేకపోతే గూగుల్ వాడి సాయం కోరండి. గీత గూర్చి పలువురు ప్రముఖులు, మహానుభావులు ప్రస్తావించారు, వారేమన్నారో వారి మాటల్లో తెలుసుకుందాం. భూదానోద్యమ ప్రారంభకుడు వినోబా భావే "నా శరీర వృద్ధికి తల్లిపాలు ఎంతగా ఉపయోగపడినవో, నా బుద్ధి వికాసమునకు భగవద్గీత అంతకంటే ఎక్కువ ఉపయోగపడినది" అని అన్నాడు .

“సంశయాలు, సంకటాలు, నిరాశా నిస్పృహలు చుట్టుముట్టినప్పుడు నేను భగవద్గీత తెరచి చూస్తాను, అందులో ఏదో ఒక శ్లోకము నన్నూరడిస్తుంది ” అని చెప్పాడు మహాత్మా గాంధీ. అంతేకాదు, "నా తల్లి మరణించినప్పటి నుండి భగవద్గీత నా తల్లి స్థానమును ఆక్రమించి, నా పక్కనే వుండి నన్ను కాపాడుచున్నది.” అనికూడా ఆయన చెప్పాడు. గీతలో పలు జంతుజాలాలలో, నదుల్లో, పర్వతాలలో, ఋషులలో ఇంకా తదితర విషయాలలో తానెవరో శ్రీకృష్ణ భగవానుడు మనకు చెబుతాడు.

మాసములలో తాను "మార్గశిరము" మాసమునని, విద్యల్లో తాను "ఆధ్యాత్మిక" విద్యనని, ఇంద్రియములలో తాను "మనస్సు" నని, ఇంకా చెప్పుకుంటే చాలా వాటిల్లో తాను ఉన్నానని శ్రీకృష్ణుడు చెప్పాడు. వీటిల్లో కొన్ని ఇక్కడ నేను

ప్రస్తావిస్తాను. లెక్కపెట్టువారిలో తాను కాలము నని, వాక్కులలో తాను ఓంకారము నని, అంతేకాదు అక్షరములలో తాను "అ"-కారము నని శ్రీకృష్ణుడు చెప్పాడు. మన అక్షరమాల కూడా "అ"-కారము తో కదా ప్రారంభమయ్యేది.

ఘంటసాల వ్యాఖ్యానంతో సహా ఆయన ఆలపించిన భగవద్గీత తెలుగు నాట అత్యంత ప్రజాదరణ పొందినది మరియు వారి దివ్యమైన స్వరాన్ని ప్రతిబింబిస్తుంది, ఇది భారతదేశంలో అత్యధికంగా వినబడే రికార్డింగ్‌లలో ఎప్పటికీ ఒకటి. 'భగవద్గీత'లోని 700 శ్లోకాలలో ఎంపిక చేసిన 106 శ్లోకాలను ప్రముఖ రికార్డింగ్ కంపెనీ హెచ్.ఎమ్.వి. సంస్థ ఘంటసాల చేత స్వరబద్ధం చేయించి, తాత్పర్య సహితంగా గానం చేయించి, రికార్డు చేసింది. ఆయన పరమపదించిన రెండు నెలల తరువాత ,1974 ఏప్రిల్ 21న విజయవాడలో దివంగత మహానటుడు 'పద్మశ్రీ' ఎన్.టి.రామారావు చేతుల మీదుగా ఈ 'భగవద్గీత' జంట రికార్డులుగా విడుదలై శాశ్వతమైన కీర్తిని ఆర్జించుకుంది. ఆ మహా గాయకుడి స్ఫూర్తితో 'భగవద్గీత ఫౌండేషన్' వ్యవస్థాపకులు, గాయకుడు గంగాధరశాస్త్రి 'సంపూర్ణ భగవద్గీత' గానం చేశారు. దివంగత ఘంటశాల కొంతమేర గానం చేసిన భగవద్గీతను, సంపూర్ణంగా (700 శ్లోకాలు) గానం చేసి, తెలుగు తాత్పర్య సహితంగా భక్తులకు ఆయన అందజేశారు. ఈ బృహత్ యజ్ఞం పూర్తి కావడానికి 7 సంవత్సరాల సమయం పట్టింది. సుమారు 100 మందికి పైగా పండితులు, టెక్నీషియన్లు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భగవత్బంధువులు ఈ కార్యక్రమం కోసం ఎంతో సహాయసహకారాలు అందజేశారు. అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిన ఈ ఆడియోను వింటే, ప్రత్యక్షంగా దర్శిస్తున్న అనుభూతి కలుగుతుందని గంగాధర శాస్త్రి తెలిపారు. దేశ చరిత్రలో భగవద్గీతను సంపూర్ణంగా అందించడం ఇదే ప్రథమమని గంగాధర శాస్త్రి అన్నారు. గీత జయంతి సందర్భంగా యూట్యూబ్ లో గంగాధరశాస్త్రి 'సంపూర్ణ భగవద్గీత' గానం విని మీరందరూ ఆనందిస్తారని ఆశిస్తున్నాను.

ఇదిలా ఉండగా నాలుగే నాలుగు సమయాలలో మనం భగవద్గీతను చదవకూడదు అని పెద్దలు చెబుతారు.

1). మనం గాఢ నిద్రలో ఉన్న సమయంలో భగవద్గీతను చదవకూడదు. 2). మనం ఊపిరి పీల్చని సమయంలో కూడా భగవద్గీతను చదవకూడదు. 3). మనలో ఉన్న ఆత్మ, ఈ చరాచర విశ్వంలో ప్రతీ జీవిలో ఉన్న ఆత్మ ఒక్కటే అని తెలిసిపోయిన సమయంలోను భగవద్గీతను చదవకూడదు. 4). మన ముందు భగవంతుడు ప్రత్యక్షమైన సమయంలో కూడా భగవద్గీతను చదవకూడదు. కానీ మన తెలుగువారు ఎందులోనైనా మినహాయింపులు కోరుతారు కదా? ఈమధ్య మరణ సమయాలలో అంటే అంత్యక్రియలు చేసేటప్పుడు తదితర సమయాలలో ఘంటసాల భగవద్గీత రికార్డింగు పెట్టి చెవుల్లో ఉన్న తుప్పు వదిలేంతవరకు వినిపిస్తున్నారు, అదే సమయాన దైనందిక జీవితంలో గీతను పఠించడం పూర్తిగా మరుస్తున్నారు. సత్యాన్ని, ధర్మాన్ని పరిరక్షిస్తూ...అందరి శ్రేయస్సును కోరుకోమని చెబుతోంది గీత. ఆ మార్గాన్ని అనుసరిస్తే జీవితం సాఫల్యమైనట్టే, కాబట్టి ఈ డిసెంబర్ 3 న పాఠకమిత్రులు ఎంతో కొంత గీతను పఠించి లేదా విని "గీతా జయంతి" ని ఆధ్యాత్మిక చింతన తో జరుపుకోవాలి అని నేను మనసారా కోరుకుంటున్నాను.

ఈ డిసెంబర్ మాస పత్రికతో 2022 సంవత్సరానికి ప్రయోగాత్మకంగా జనవరి నుండి డిసెంబర్ వరకు మొత్తం 12 సంచికలు వెలువరించాలి అన్న మా ప్రయత్నం సఫలం అయ్యింది. ఈ ఏడాది క్రతువులో మా సంపాదకీయ బృందం,

రచయితలు, అక్షర దోషాల పని పట్టే బృందం ఇంకా కార్యకర్తలు, మరెందరో ఈ 12 సంచికలకు మూల స్తంభంగా నిలిచారు. వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

కరోనా కారణంగా మరి ఇతరత్రా కారణాల చేత శాక్రమెంటో తెలుగు సంఘం కార్యక్రమాలు ప్రతి నెలా జరపడం అసాధ్యంగా మారింది. దానికి తోడు అనివార్యమైన కారణాల చేత "UAN మూర్తి 5వ కథ - కవితల పోటీ" నిర్వహణ ప్రస్తుతానికి వాయిదా వేయబడినది. అంతేకాక వనరుల లేమి, తదితర కారణాలతో 2023 సంవత్సరానికి శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రికను మాస పత్రికగా కొనసాగించడం కష్టసాధ్యంగా మారింది. అయితే శాక్రమెంటో తెలుగు వెలుగు పాఠకులను నిరాశపరచకుండా శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రికను "వార్షిక సంచిక" రూపంలో తీసుకురావాలని సంకల్పించాం. ఇకపై ప్రతి సంవత్సరం జనవరి నెలలో శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రికను "వార్షిక సంచిక" రూపంలో సంక్రాంతి కానుకగా పాఠకులకు అందించాలని నిర్ణయించడం జరిగింది. పాఠకమిత్రులు ఎప్పటివలె శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రికను ఆదరించి, మనసారా ఆశీర్వదించాలని కోరుకుంటున్నాము.

*వెంకట్ నాగం*

**(సంపాదకుడు - శాక్రమెంటో తెలుగు వెలుగు)**


## ముఖచిత్రం వెనుక ముచ్చట్లు! – దివికెగసిన సూపర్ స్టార్ కృష్ణ :.. ఉమా




ఘట్టమనేని కృష్ణ (1942 మే 31 – 2022 నవంబరు 15) తెలుగు సినిమా నటుడు, దర్శకుడు, నిర్మాత. కృష్ణ 1970లు, 80ల్లో తెలుగు సినిమా హీరోగా ప్రజాదరణ సాధించి సూపర్ స్టార్‌గా ప్రఖ్యాతి పొందారు. ఆయన పూర్తిపేరు ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి. 1964కు ముందు పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసిన కృష్ణకు 1964-65లో హీరోగా నటించిన తొలి సినిమా తేనెమనసులు, మూడవ సినిమా గూఢచారి 116 పరిశ్రమలో నిలదొక్కుకునేందుకు ఉపకరించాయి. ఆపైన నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్‌లో 340 పైచిలుకు సినిమాల్లో ప్రధాన పాత్రలో ఆయన నటించారు. 1970లో నిర్మాణ సంస్థను ప్రారంభించి పద్మాలయా సంస్థ ద్వారా పలు విజయవంతమైన చలన చిత్రాలు తీశారు. 1983లో ప్రభుత్వ సహకారంతో స్వంత స్టూడియో పద్మాలయా స్టూడియోను హైదరాబాద్‌లో నెలకొల్పాడు. దర్శకుడిగానూ 16 సినిమాలు తీశారు ఆయన.

తెలుగు సినిమా చరిత్రలో మొట్టమొదటి కౌబాయ్, వివాదరహితుడు కృష్ణ గారి మరణంతో తెలుగు సినిమా ఒక పూర్తి తరం కోల్పోయింది. ఎన్నో అద్భుతమైన చిత్రాలు తెరకెక్కించిన కృష్ణ గారు హఠాత్తుగా గుండెపోటుతో మరణించడం బాధాకరం. ఎంత మంది హీరోలు వచ్చిన కృష్ణ లాంటి హీరో రారు, ఎందుకంటే ఆయనంటే సాహసం, ఆయనంటే నిర్మాతలకు

మిత్రుడు. తరతరాల తెలుగు జాతి, దేశం మొత్తం చెప్పుకునే విధంగా అల్లూరి సీతారామరాజు సినిమా ద్వారా మమ్మల్ని, మీకు దగ్గర చేసిన కృష్ణ గారు మీరెక్కడున్నా మీకు మా వందనాలు.




తనతో పాటూ చుట్టూ ఉండే నలుగురు బాగుండాలి అనే తరహాలో కొనసాగిన కృష్ణ జీవితం తరతరాలకు ఆదర్శప్రాయం. అభినవ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు(సూపర్ స్టార్ కృష్ణ) గారు, 2022 నవంబరు 15 తేదీ ఉదయం తీవ్రమైన గుండెపోటుతో మరణించడం ఎంతో బాధాకరం. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని మనమంతా ఆ భగవంతుడిని కోరుకుందాం. ఆయన వ్యక్తిగత జీవితం ఆదర్శప్రాయం. జోహార్లు, జోహార్లు సూపర్ స్టార్ కృష్ణ గారికి జోహార్లు.

(ఈ వ్యాసానికి మూలం: అంతర్జాలంలో లభించిన సమాచారం)


★★★★★

# శాక్రమెంటో తెలుగు సంఘం కార్యక్రమాలు

2023 సంక్రాంతి సంబరాలలో ముందస్తు భాగంగా, శాక్రమెంటో తెలుగు సంఘం (టాగ్స్) వారు నవంబర్ - డిసెంబర్ మనలో నిర్వహించ తలపెట్టిన ఆటల కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నవంబర్ లో జరిగిన క్రికెట్, టేబుల్ టెన్నిస్, చెస్ తదితర పోటీలలో టాగ్స్ సభ్యులు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శాక్రమెంటో నగరంలోని ఫాల్సం నగరంలో నవంబర్ ఆటల పోటీలు ఘనంగా జరిగాయి. డిసెంబర్ నెలలో బాడ్మింటన్, టెన్నిస్ పోటీల నిర్వహణకు టాగ్స్ ఏర్పాట్లు చేస్తుంది. ఈ పోటీలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని సభ్యులకు టాగ్స్ కార్యవర్గం విజ్ఞప్తి చేస్తుంది. ఈ క్రింది లంకె నొక్కి ఈ పోటీలలో పేరు నమోదు చేసుకోవలసిందిగా టాగ్స్ సూచించింది.

https://sactelugu.us10.list-manage.com/track/click?u=085fcbb01414baeb2fa522fd5&id=bd303eca51&e=657ba2324c

**శాక్రమెంటో తెలుగు సంఘం (టాగ్స్) నవంబర్ నెల ఆటల పోటీల చిత్ర మాలిక**








గ్రేటర్ శాక్రమెంటో
తెలుగు సంఘం
TELUGU ASSOCIATION OF
GREATER SACRAMENTO
TAGS
WELCOMES YOU
సుస్వాగతం
WWW.SACTELUGU.ORG
TAX ID: 92-0189840


TELUGU ASSOCIATION OF
GREATER SACRAMENTO
TAGS
WELCOMES


గ్రేటర్ శాక్రమెంటో
తెలుగు సంఘం
TELUGU ASSOCIATION OF
GREATER SACRAMENTO


గ్రేటర్ శాక్రమెంటో
తెలుగు సంఘం
TELUGU ASSOCIATION OF
GREATER SACRAMENTO
TAGS
సుస్వాగతం


BGMC


I Praise YOU because I AM Fearfully AND wonderfully Made



I Praise YOU because I AM Fearfully AND Wonderfully Made



EXIT


GAP
GAP




Fall For JESUS
He Will Never LEAF You




chinmayee




గ్రేటర్ శాక్రమెంటో
తెలుగు సంఘం
TELUGU ASSOCIATION OF
GREATER SACRAMENTO
TAGS
WELCOMES YOU
సుస్వాగతం
WWW.SACTELUGU.ORG
TAX ID: 92-0189840




గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం
TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO
A 501(C)(3) Certified Non-Profit Organization: Federal Tax ID: 92-0189840
www.sactelugu.org
TAGS 20th Anniversary & Sankranti Sambaralu -2023
టాగ్స్ ౨౦వ వార్షికోత్సవం మరియు సంక్రాంతి సంబరాలు -౨౦౨౩
సంక్రాంతి సంబరాలు-2023
TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO
TAGS
౨౦వ వార్షికోత్సవం
Sri Srinivasa Kalyanam: 7th Jan 2023, 8 am.
Sankranthi Celebrations : 14th Jan 2023, 12 pm - 9 pm.
Details and registration link:
https://sactelugu.org/registration
Venue:
Folsom High School, 1655 Iron Point Rd Folsom 95630.
SHREYUS
INDIAN SUPERMARKET
DevRabbit
Smart IT Delivered
Shankar Reddy Pathi
Realtor & Loan Officer
916 390 2169
Ram Busam
214-597-8346
916-888-1579
"Walk the Talk" is our motto
Realtor® & Loan Officer
SunshineRealtyMortgage@gmail.com
Contact: sactags@gmail.com
https:/sactelugu.org/
https://facebook.com/sactelugu


గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం
TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO
A 501(C)(3) Certified Non-Profit Organization: Federal Tax ID: 92-0189840
www.sactelugu.org
TAGS SPORTS EVENTS
సంక్రాంతి సంబరాలు-2023
TAGS
20వ వార్షికోత్సవం
BADMINTON
3rd Dec 2022
TABLE TENNIS
4th Dec 2022
VENUE:
2421 MERCANTILE DR SUITE D,
RANCHO CORDOVA, CA
GRAND SPONSORS
SHREYUS
INDIAN SUPERMARKET
DevRabbit
Smart IT Delivered
Shankar Reddy Pathi
Realtor & Loan Officer
916 390 2169
Ram Busam
214-597-8346
916-888-1579
Realtor® & Loan Officer
SunshineRealtyMortgage@gmail.com
Details and registration link:
https://sactelugu.org/registration
Contact: sactags@gmail.com
https:/sactelugu.org/
https://facebook.com/sactelugu

# TAGS November Month : Chess, Carroms and Painting - Winners

Please follow our fb and Instagram for latest pictures.
https://www.facebook.com/SacTelugu
https://www.instagram.com/tags.sacramento/

| Chess | 1st Place | 2nd Place |
|---|---|---|
| 11 & UNDER | • Varad Korde | • Gautam Aetukuri<br>• Mahaswin Vikkurthi<br>• Anish Maddukuri<br>• Atharv Surpur<br>• Srinadh Yenamandra |
| YOUTH (12-18) - BOYS | • Koushik Sheshala | • Samarna Suresh |

| Carroms | 1st Place | 2nd Place |
|---|---|---|
| 11 & UNDER - Singles | • Bhuvanesh Yeleti | • Aarnav Vijay |
| ADULT - Singles | • Aruna Busam | • Surya Rao |
| ADULT - Doubles | • Aruna Busam<br>• Sujatha Busam | • Surya Rao<br>• Krishna |

| Painting | 1st Place | 2nd Place |
|---|---|---|
| 4-11 | • Vidula Sakti | • Avatar Peddi |
| 12-18 | 1. Sameekha Murthy | • Lakshmi Meyyappan |

# TAGS Indoor Games – Badminton and Table Tennis – Upcoming Weekend, Dec 3 and Dec 4.

**Please register asap and help us plan better.**

## Badminton

Date: Dec-03-2022 Saturday 8 AM onwards

Place: 2421 Mercantile Dr, Rancho Cordova, CA 95742

## Table Tennis

Date: Dec-04-2022 Sunday 8 AM onwards

Place: 2421 Mercantile Dr, Rancho Cordova, CA 95742

Registration: https://sactelugu.us10.list-manage.com/track/click?u=085fcbb01414baeb2fa522fd5&id=f3658b7c27&e=657ba2324c

OR

https://sactelugu.org/registration/

Note: Prizes (Trophies) distribution is going to be on the spot.

# టాగ్స్ జనవరి 2022 సంక్రాంతి  సంబరాలు

టాగ్స్ జనవరి 2023 సంక్రాంతి  సంబరాల సన్నాహాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా టాగ్స్ క్రికెట్ టోర్నమెంట్ మరియు పెద్దలు పిల్లలకు నవంబర్, డిసెంబర్ నెలలలో అనేక ఆటల పోటీలు తలపెట్టింది. టాగ్స్ జనవరి 2023 కు గాను సంక్రాంతి  సంబరాలు కు వేదిక శాక్రమెంటో శివారు నగరమైన ఫాల్సం లో ఉన్న ఫాల్సం హై స్కూలు థియేటర్ ను ఎంపిక చేయడమైనది. ఈ సందర్భంగా వేదికపై ప్రదర్శనకు పిల్లలు పెద్దల నుండి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడానికి నమోదు చేయించుకోవలసినదిగా టాగ్స్ చేసిన విజ్ఞప్తి కి స్పందించి రెండు వందలమందికి పైగా స్థానిక కళాకారులు తమ పేరు నమోదు చేయించుకున్నారు. ఇంతమంది కళాకారులు శాక్రమెంటో వేదికపై ప్రదర్శన నిమిత్తం పేర్లు నమోదు చేయించుకోవడం ఒక రికార్డు అని టాగ్స్ కార్యవర్గం ప్రకటించింది.

**టాగ్స్ జనవరి 2023 సంక్రాంతి  సంబరాలలో కార్యకర్త గా సేవ అందించడానికి నమోదు చేసుకోవాల్సిన లంకె :**

https://form. jotform. com/sactags/Volunteerregistration

# టాగ్స్ కమిటీలలో పాలు పంచుకునే సదవకాశం

# Opportunities in TAGS Committees

Since TAGS' inception in the year 2003, TAGS has been dedicated to promoting Telugu Language and Culture in Greater Sacramento. There are many opportunities in TAGS for those who are interested in serving the Telugu community in and around Greater Sacramento. Please contact TAGS President or Chairman at sactags@gmail. com to find out about upcoming opportunities in TAGS Committees. TAGS welcomes Youth Volunteers from Middle Schools & High Schools across greater Sacramento.

We sincerely thank all TAGS Volunteers for all their hard work & extraordinary services. TAGS looks forward to their continued help & support in all our future events and projects.

Please join us in congratulating all the TAGS Volunteers and request TAGS members & Friends to extend your support and cooperation to the TAGS team for the better management of the organization and service to our community in Greater Sacramento.

Let's all work together and build a strong Telugu community!!



# టాగ్స్ 2022 కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు

**టాగ్స్ 2022 కార్యక్రమాల ఫోటోలు, వీడియోల వీక్షణకు ఈ క్రింది లంకెలను ఉపయోగించండి:**

https://www. facebook. com/SacTelugu/photos_stream

https://www. facebook. com/SacTelugu

https://www.instagram.com/tags.sacramento/



# టాగ్స్ కార్యకర్తల నియామకం




కార్యకర్తలు లేని స్వచ్ఛంద సంస్థ ఊహించడం కష్టం, టాగ్స్ అందుకు మినహాయింపు కాదు. సంక్రాంతి 2020 పండుగ సంబరాల సందర్భం గా ఫాల్సం హై స్కూల్ థియేటర్ కు విచ్చేసిన 1500 కి పైగా అతిధులకు స్వాగత సత్కారాలు, బ్యాక్ స్టేజి మరియు భోజన తదితర కార్యక్రమాలను సమన్వయం చెయ్యడానికి వంద మందికి పైగా టాగ్స్ కార్యకర్తలు సేవలు అందించారు. జనవరి 2021 న శ్రీనివాస కళ్యాణ కార్యక్రమంలో అనేకమంది కార్యకర్తలు చేయి చేయి కలిపారు. పూర్తి సమయ కార్యకర్తల నియామకం ద్వారా 2023 లో తలపెట్టిన కార్యక్రమాల సన్నాహాల పని వేగాన్ని పెంచేందుకు టాగ్స్ విశేషంగా కృషి చేస్తోంది. టాగ్స్ కార్యకర్త గా బాధ్యతలు స్వీకరించడానికి ఆసక్తి ఉన్న హైస్కూల్ విద్యార్థులు, పెద్దలు sactags@gmail. com ఈమెయిల్ లో సంప్రదించాలని కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేసారు. మీరు లేదా మీ పిల్లలు టాగ్స్ కు కార్యకర్తగా (లేదా యువ కార్యకర్తగా) సహాయ సహకారాలు అందించాలంటే ఈరోజే మాకు ఈమెయిలు చెయ్యండి.



# టాగ్స్ కార్యక్రమాల సమాచారం నమోదు కొరకు..

2023 వ సంవత్సరానికి టాగ్స్ చేపట్టబోయే సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి మరిన్ని వివరాలను తెలుసుకోవాలనుకునేవారు http://www. sactelugu. org లేదా https://www. facebook. com/SacTelugu ను సందర్శించాలని లేదా sactags@gmail. com కు ఈమెయిలు లో సంప్రదించాలని TAGS కార్యనిర్వాహక సభ్యులు కోరారు. టాగ్స్ చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించి మరిన్ని వివరాలు మీ ఈమెయిలు కు అందాలంటే ఈరోజే టాగ్స్ న్యూస్ లెటర్ కు మీపేరు ఈ లంకె ద్వారా నమోదు చేసుకోవలసినదిగా మనవి: https://tinyurl. com/jointags.



# విరాళాలకు విజ్ఞప్తి



## TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO (TAGS)

A 501(c)(3) Non-Profit Organization – Federal Tax Id: 92-0189840

### Donor Pledge Form

*Please complete your contact information below check all that applies:*

Donor(s) Name: ______________________________

Address: ______________________________

Phone: ____________________ Email: ____________________

Signature: ____________________ Date: ____________________

**A GIFT OF SUPPORT**

☐ I enclose a check for $____________, payable to TAGS

☐ I Pledge a gift of $______________, payable on or before __________

**Please put my gift toward:**

☐ General Support of TAGS Mission

☐ Education Fund

☐ TAGS Katha Kavita Contest

☐ Other or Split between:
____________ &
____________________

**Other Directions:**

☐ My employer participates in the matching gift program
Name of Employer:
____________________

☐ I would like this donation to be anonymous.

☐ (Optional) My donation is in memory of: ____________
Please send an acknowledgement to
Name: ____________________
Address: ____________________

**A GIFT OF YOUR TALENTS & TIME**

I would like to volunteer my time to help by offering the following skills:

☐ Organizing ☐ Fundraising ☐ Marketing ☐ Other: ______

**Please write check on the name of TAGS and mail to:**

**TAGS, Post Box: 1666, Folsom, California 95763**

Now you can donate to TAGS online here: **https://tinyurl.com/donatetags**

*** Thank you ***

---

**Website:** http://www.sactelugu.org
**Facebook:** https://www.facebook.com/SacTelugu

గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

# రచనలకు ఆహ్వానం!

టాగ్స్ ప్రచురించే శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక – 2023 నుండి వార్షిక పత్రిక గా వెలువడుతుంది. మీ కథలు, కవితలు, మీరు సందర్శించిన ప్రాంతాల విశేషాలు, చిత్రాలు, వ్యాసాలు, పుస్తక పరిచయం, జోక్స్, స్థానిక తెలుగు కుటుంబాలు లేదా వారి పిల్లల ప్రతిభా పాటవాల గురించి మాకు తెలియజేయాలనుకొంటే http://lekhini.org ను లేదా ఆన్‌లైన్‌లో Google ఇన్‌పుట్ సాధనంను https://www.google.com/intl/te/inputtools/try/ ఉపయోగించి తెలుగులో, టైపు చేసి మాకు పంపండి. మీ ఆర్టికల్స్ పంపవలసిన ఈమెయిల్: telugusac@yahoo.com . పిల్లలు, పెద్దలు వేసిన బొమ్మలను, తీసిన ఫోటోలను మాకు పంపవచ్చు. ఆపై శాక్రమెంటో తెలుగు వెలుగు వార్షిక సంచిక లో వాటిని పరిశీలించి ప్రచురించే బాధ్యత మాదేనని సవినయంగా మీకు మనవి చేస్తున్నాము. "శాక్రమెంటో తెలుగు వెలుగు" పత్రిక లోని రచనల సర్వహక్కులూ ఆయా రచయితలకూ, రచయిత్రులకూ మాత్రమే చెందుతాయి. రచనలలోని అంశాలకూ, అభిప్రాయాలకూ, అచ్చుతప్పులకూ తత్సంబంధిత రచయిత/రచయిత్రులదే బాధ్యత అని గమనించగలరు.

ఈ సంచిక కాపీ, మరియు పూర్వ సంచికలు ఈ లంకె లో ఉంచబడ్డాయి: http://sactelugu. org/tags-patrika. శాక్రమెంటో తెలుగు వెలుగు సంచిక మీ ఈమెయిలుకు ఠంచనుగా అందాలంటే, ఈరోజే టాగ్స్ న్యూస్ లెటర్ కు ఈ లంకె ద్వారా నమోదు చేసుకోవలసినదిగా మనవి: https://tinyurl. com/jointags.

ధన్యవాదాలు!

"శాక్రమెంటో తెలుగు వెలుగు" పత్రిక సంపాదక బృందం.



గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO


A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

# ధారావాహికలు



# స్ఫూర్తి ప్రదాత – సూపర్ స్టార్ కృష్ణ

.. ఉమా




ఘట్టమనేని కృష్ణ (1942 మే 31 – 2022 నవంబరు 15) తెలుగు సినిమా నటుడు, దర్శకుడు, నిర్మాత. కృష్ణ 1970లు, 80ల్లో తెలుగు సినిమా హీరోగా ప్రజాదరణ సాధించి సూపర్ స్టార్‌గా ప్రఖ్యాతి పొందాడు. ఆయన పూర్తిపేరు ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి. నవంబరు 15, 2022 ఉదయం తీవ్రమైన గుండెపోటుతో ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. కృష్ణ గారికి అశ్రు నివాళి అర్పిస్తూ పలువురు ప్రముఖులు ఏమన్నారో చూద్దాం.

"ఆయన లేకుండా ప్రతి రోజూ భారమే – కృష్ణగారి మృతి మా కుటుంబానికి తీరని లోటు. కేవలం వెండితెరపైనే కాదు, ఆప్యాయత, ప్రేమ పంచడంలోనూ ఆయన సూపర్‌స్టారే. అన్నిటికన్నా మిన్నగా మమ్మల్ని ఎంతగానో ప్రేమించారు. తను చేసిన ఎన్నో మంచి పనుల ద్వారా ఎప్పటికీ మన మధ్యన జీవించే ఉంటారు. కృష్ణగారు ఎంతోమందికి స్ఫూర్తి ప్రదాత. ఆయన్ని కోల్పోయిన భారంతోనే ఇక ప్రతిరోజూ గడుపుతాం." – ఈ మాటలు అన్నది మెగాస్టార్ చిరంజీవి.

"సినీ పరిశ్రమకు కొత్తదనాన్ని పరిచయం చేసిన కృష్ణ స్ఫూర్తి ప్రదాత" -- ఈ మాటలు అన్నది తమిళనాడు సీఎం స్టాలిన్.




నిర్మాతలను చక్కగా చూసుకోవడంలో సినీ హీరోలకు సూపర్ స్టార్ కృష్ణ స్ఫూర్తి ప్రదాత. ఆయన మార్గదర్శనంలో సుదీర్ఘకాలం సన్నిహితంగా పనిచేసే అవకాశం తమకు లభించడం తమకు గర్వకారణం అని పలువురు నిర్మాతలు, నటులు, పద్మాలయ స్టూడియో ఉద్యోగులు వ్యాఖ్యానించారు. ధర్మం, కర్తవ్య నిర్వహణే లక్ష్యంగా ఆయన తన భావితరాలకు మార్గదర్శనం చేశారని వారు ప్రశంసించారు.

అల్లూరి సీతారామరాజు వంటి తన సినిమాల ద్వారా తెలుగు ప్రజానీకాన్ని చైతన్యం చేసిన సూపర్ స్టార్ కృష్ణ నేటి తరం సినీ పక్షులకు స్ఫూర్తి ప్రదాత అని పలువురు సినీ ప్రముఖులు కొనియాడారు. సినిమాకు సాంకేతికంగా కొత్తదనం తీసుకొచ్చే విషయంలో ఆయన ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచారని వారు కొనియాడారు. అనేకమంది సినీ నిర్మాతలకు విజయ రహస్యాన్ని బోధించిన స్ఫూర్తి ప్రదాత ఆయన. ఎందరో విప్లవకారులకు స్ఫూర్తి ప్రదాత అయినటువంటి అల్లూరి సీతారామరాజు ని తన సినిమా ద్వారా పునరావిష్కరణ చేసిన కృష్ణ గారు తెలుగు చిత్ర పరిశ్రమకు ఒక మూల స్తంభం. మనసున్న మంచి మనిషి మన కృష్ణ గారు. బంగారు మనసు బంగారు మనిషికి జోహార్లు. కృష్ణ గారు లేని లోటు తెలుగు సినీ పరిశ్రమ ఎప్పటికీ పూరించలేనిది. అల్లూరి సీతారామరాజు పాత్ర పూర్తి నిడివి సినిమాలో పోషించడం ద్వారా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. మనిషి ఎన్నాళ్ళు బతికాడు అని కాదు ఎంత గొప్పగా బతికాడు అనేదే ముఖ్యం. ఇండస్ట్రీలో పది మంది ఉపాధి కల్పించి, వారు మెరుగైన జీవనం గడపడానికి కారణమైన ఏకైక నాయకుడు సూపర్ స్టార్ కృష్ణ. ఆయన మందీమార్బలం, పరివారం, పద్మాలయ స్టూడియో ఉద్యోగులు, వారి మొత్తం కుటుంబాలను

కలుపుకుంటే దాదాపు 500 నుండి వెయ్యి మందివరకు ఆయన పై పరోక్షంగా బ్రతికేవారు అనడంలో సందేహంలేదు. ఈ ప్రపంచంలో ఉత్తమమైన వాడు ఎవరంటే ఉపాధి కల్పించేవాడు కదా?



సినీ తెరపై కృష్ణ సాహసాలకు కట్ట పెట్టినది "సింహాసనం".

సినిమా నిర్మాత మంచి కోరడంలో కృష్ణ అడుగు ఎప్పుడు "ముందడుగు".

సినీ పరిశ్రమలో కృష్ణ శ్రమ స్థానం " నెంబర్ వన్ ".

ప్రతినాయకుడి  పాత్రధారుల కి కృష్ణ "మోసగాళ్లకు మోసగాడు".

తండ్రి గా హీరోగా కృష్ణ కుటుంబం "మంచి కుటుంబం ".

మా జ్ఞాపకాలలో స్వాతంత్ర సమరయోధుడు అంటే "అల్లూరి సీతారామరాజు".

కృష్ణ తేజస్సు చూడడానికి సరిపోదు "అగ్నిపర్వతం".

కృష్ణ బిరుదులు, ప్రయోగాలు ఎప్పటివో అయినా మాకు ఇప్పటికీ "ఈనాడు".

తెలుగు లో "సూపర్ స్టార్" శీర్షిక ఎప్పటికీ "కృష్ణ" దే.

ఆయన సినిమాలు బ్రహ్మాండంగా ఆడుతున్న రోజుల్లో కూడా ఈనాడు ఆయన తోటి హీరోల్లాగా నిర్మాత ముక్కు పిండి తన పారితోషికం వసూలుచేసింది లేదు. ఇస్తే పుచ్చుకునేవాడు, ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇవ్వవలసిన సొమ్ము నిర్మాత ఇవ్వలేకపోతే ఇచ్చినంత పుచ్చుకునేవాడు, ఒకవేళ తన సినిమా మూలంగా నిర్మాత నష్టపోతే తరువాతి సినిమాకు నిర్మాత "ఎదురు డబ్బు" సర్దేవాడు, ఆ సినిమా రిలీజు అయ్యేంతవరకు నిర్మాతకు అండగా ఉండేవాడు కృష్ణ. తద్వారా "నిర్మాతల హీరో" గా తరగని పేరు సంపాదించుకున్నాడు. తెలుగు సినిమా హీరోలలో మరణము లేని వ్యక్తి సూపర్ స్టార్ కృష్ణ. మన అభిమాన నటుడు, స్ఫూర్తి ప్రదాత సూపర్ స్టార్ కృష్ణ గారికి అశ్రు నివాళి!



# అన్నాచెల్లెలి గట్టు – 9వ బిట్టు

**కలికి (వెంపటి హేమ – భారత్)**

ఎల్లమ్మ వెంటనే ధర్మయ్యకి ఈ శుభవార్త చెప్పాలని బయలుదేరింది. దారిలో కనిపించిన ప్రతి ఒక్కరినీ ఆపి మరీ చెప్పింది శుభవార్త. ఒక నోటినుండి పదినోళ్ళకు చేరి క్షణంలో సగంలో బెస్తవాడ మొత్తం "రాదమ్మ, కన్నయ్యలు పెళ్ళిచేసుకోబోతున్నా" రన్నది తెలిసిపోయింది. అందరూ ఎల్లమ్మ అదృష్టాన్ని కొనియాడారు. ఎల్లమ్మ ప్రార్ధనల్ని మన్నించి, కడలమ్మ తన బిడ్డను ఆమెకు కోడలుగమ్మని అలల పల్లకీమీద పంపి ఉంటుంది – అన్నారు భావుకులైన మరికొందరు. ఎల్లమ్మకు సంతోషం తలమునకలౌతోంది.

శుభవార్త విని ధర్మయ్య చాలా సంతోషించాడు. చుక్కపెళ్ళితో చెదిరిన మనసును సరిపెట్టుకొని, కన్నయ్య ఒక ఇంటివా డౌతున్నందుకు మనసారా ఆనందించాడు. వెంటనే కొడుకును, పెళ్ళికి ముహూర్తం పెట్టించుకుని రమ్మని పంతులుగారింటికి పంపించాడు. సైకిల్ తీసుకుని ఆఘమేఘాలమీద బయలుదేరాడు వానరాజు.

వధూవరుల నామనక్షత్రాలనుబట్టి ముహూర్త నిర్ణయం జరిగింది. కొద్దిసేపట్లోనే తిరిగివచ్చిన వానరాజు – ఈ సాయంకాలమే ఒక మంచి ముహూర్తం ఉందనీ, ఆ తరవాతమళ్ళీ చాలా రోజులదాకా పెళ్ళికి ముహూర్తాలు లేవని పంతులుగారు చెప్పారని చెప్పాడు. వెంటనే, "శుభస్య శీఘ్రం" అన్నాడు ధర్మయ్య.

అసలే కన్నయ్య అలసి ఉన్నాడు. ఒకసారి కన్నయ్య పెళ్ళికి ఔనన్నాక ఇక ఆలస్యం చెయ్యడం మంచిదికాదు – అనుకున్నాడు. ఆపై యుద్ధప్రాతిపదికమీద పెళ్ళి ఏర్పాట్లు మొదలయ్యాయి. వెంటనే మళ్ళీ వెళ్ళి పురోహితునికి, ఈ రాత్రి ముహూర్తానికే పెళ్ళి చేయించడానికి రమ్మని కబురు చెప్పి, ఆపై ఆయనచేత కావలసిన వస్తువుల లిస్టు రాయించుకుని, పనిలో పనిగా తిరిగివస్తూ వాటిని కొనుక్కు రమ్మనీ కొడుకుకి పురమాయించాడు ధర్మయ్య. కొడుకుని పంపించాక ఈ రాత్రికే కన్నయ్యకు, రాధమ్మకు పెళ్ళని నలుగురికీ తెలియజేశాడు.

సముద్రం మీద వేటకు వెళ్ళే పనిలేక బెస్తవాడలోని జనానికి పొద్దు గడవడం కష్టంగా ఉంది. తోచనితనంతో కొట్టుకుంటున్న వాళ్ళకి ఈ పెళ్ళి ఒక ఆటవిడుపులా, సరదాగా అనిపించింది. ఒక్కసారి ఒళ్ళువిరుచుకుని బద్ధకాన్ని తరిమికొట్టి, వాళ్ళు పెళ్ళిపనుల్లో పాల్గొన్నారు. శ్రీరామ కళ్యాణానికిలాగే కన్నయ్యా రాధమ్మల కళ్యాణానికి కూడా అందరూ పెద్దలే – అని ఎవరికి వారే బుజాలు చరుచుకుని, చురుకుగా పనులు చెయ్యడం మొదలుపెట్టారు. మగవారు, కావలసిన సామగ్రితెచ్చి, ఎల్లమ్మ ఇంటిముందు పందిరవేసి, పెళ్ళరుగుకడితే, ఆడవాళ్ళు ఆ పందిరలో ఒత్తుగా కళాపి జల్లి, పెళ్ళరుగు ఆలికి, అంతటా అందంగా ముగ్గులు పెట్టారు. అందరూ కలసి పందిరికి మామిడాకుల తోరణాలు కట్టారు. కొందరు కుమ్మరి దగ్గరకు వెళ్ళి, తెల్లని రంగువేసిన కుండలపైన, ఇంద్రధనస్సు వర్ణాలతో వేసిన చక్కని డిజైన్లున్న అఱిమెనకుండలు తీసుకువస్తే, కొందరాడవాళ్ళు వెళ్ళి తియ్యని మంచినీరుతెచ్చి ఆ కుండల్ని నింపారు. మధుపర్కాలకు, తాళిబొట్టుకు, రాత్రి

జరిగే విందుకు కావలసిన సరుకులు కొని తేవడం కోసం ధర్మయ్య తానే స్వయంగా బయలుదేరాడు మరో ఇద్దరిని వెంటబీసుకుని.

“కన్నయ్యకు పెళ్ళి” అన్నమాట అచ్చమ్మకు చాలా సంతోషాన్నిచ్చింది. రాత్రి వంటపని మొత్తం తనే చూసుకుంటానంటూ ముందుకువచ్చింది. వెంటనే పెద్దపెద్ద గిన్నెలు, గరిటెలు వగైరా కావలసిన పాత్రసామగ్రిని సమకూర్చుకోడం మొదలుపెట్టింది. తను పెళ్ళిచూడాలంటే ముహూర్తం వేళకు వంటపని పూర్తైపోవాలని, తొందరగా వచ్చి, పందిరలో ఒకపక్కగా ఇటుకలు పేర్చి రెండు పొయ్యిలు ఏర్పరచి, పెందరాళే వంట ప్రయత్నాలు మొదలెట్టేసింది అచ్చమ్మ.

సంతోషం ఎక్కువై ఎల్లమ్మకు కాళ్ళూ చేతులూ కదలడం మానేశాయి. కళ్ళు పత్తికాయల్లా చేసుకుని, జరుగుతున్న పెళ్లి పనులనుచూసి మురిసిపోతూ అరుగుమీద ఒక వారగా కూర్చుండిపోయింది ఆమె. పొద్దు పడమరకు వాలేసరికి పనులన్నీ పూర్తైపోయాయి. చీకటిపడగానే వెలిగించి పందిరలో పెట్టడానికి రెండు పెట్రోమాక్సు లైట్లు కూడా తెచ్చారు. తరవాత లెక్క చూసుకోవచ్చు లెమ్మని కన్నయ్యకు చెప్పి, ధర్మయ్య ఖర్చుమొత్తం తన చేతిదే ఖర్చు పెట్టాడు.

సాయంకాలం అయిదయ్యేసరికి బెస్తవాడలోని జనం యావత్తు ఎల్లమ్మ ఇంటిముందు పోగుబడ్డారు. పెళ్ళికొడుకు తరపునగాని, పెళ్ళికూతురి తరపునగాని బంధువులెవరూ లేకపోడంతో ఆ వాడనున్న జనం రెండుగా చీలి, ఒక గుంపు మగపెళ్ళివారుగా, రెండోగుంపు ఆడపెళ్ళివారుగా చెప్పుకుని, ఒకరితో ఒకరు పరాచికా లాడుకుంటూ అందరూ సరదాగా ఊన్నారు. ఆసుపత్రిలో ఆపద్ధర్మంగా అమ్మనని చెప్పుకున్న రాగమ్మ, ఇప్పుడుకూడా తానే రాధమ్మ తల్లిగా ఉంటానని చెప్పింది. తనూ తన భర్త పోలయ్యా తల్లితండ్రులుగా కన్యాదానం చేస్తామంటూ ముందుకు వచ్చింది రాగమ్మ. ధర్మయ్య కన్నయ్య పక్షాన పెద్దరికం వహించాడు. ముహూర్త సమయం దగ్గరపడింది .

కన్నయ్యకు రాధమ్మకు మంగళ స్నానాలు చేయించి ముస్తాబు చెయ్యడం మొదలు పెట్టారు అమ్మలక్కలు. ఇద్దరికీ నుదుట బాసికాలు కట్టి, కళ్ళకు కాటుక పెట్టి, ముఖాన కళ్యాణతిలకం దిద్ది, బుగ్గను చుక్కపెట్టి, పసుపుబట్టలు కట్టించారు. రాధమ్మకు జుట్టు ఆరబెట్టి, చిక్కుదీసి, జడల్లి తలలో పూలుపెట్టి ముస్తాబు చేశారు. ఒకసారి కొడుకుని కోడల్ని చూసుకోమని చెప్పి ఎల్లమ్మను వెం ట ఉండి వాళ్ళ దగ్గరకి తీసుకువచ్చింది నీలమ్మ. పట్టలేని సంతోషంతో తడబడిపోతూ ఎల్లమ్మ వాళ్ళ చెంపలంటి, వాళ్ళకు దిష్టి తగలకుండా ఉండాలని తన చెంపలపై మెటికలు విరిచింది, ఆపై వాళ్ళని ఆశీర్వదించింది ఎల్లమ్మ.

పెళ్ళికూతురి ముస్తాబులో రాధమ్మ , అక్కడున్న జనం మధ్య చక్కని కనుముక్కుతీరుతో, సుకుమారమైన శరీర లావణ్యంతో చుక్కల నడుమ చంద్రుడిలా ప్రత్యేకంగా అందంగా ఉంది. అందరూ కన్నయ్య అదృష్టాన్ని కొనియాడారు. చక్కని జోడీ అంటూ మురిసిపోయారు. అనాధగా తమ రేవుకి కొట్టుకొ చ్చిన రాధమ్మ తమలో ఒకతెగా మారడం వాళ్ళందరికీ సంతోషానిచ్చిమ్ది . అక్కడకు వచ్చినవారిలో పెద్దామె ఒకతె నెమ్మదిగా రాధమ్మ పక్కనజేరి కబుర్లు మొదలెట్టింది, “ఇదిగో అమ్మయా! ఇయ్యాల నువ్వు మా కన్నయ్యను పెళ్లాడి, మాలో ఒకతె వౌతున్నావు. నువ్వేడ బుట్టావో మరి! నీ పద్దతులేంటో

అయన్నీ ఒగ్గేసి, ఇకనుండి నువ్వు మా పద్ధతిలోకి రావాల! ఈ రోజు కాడినుండి మా శాత్తరాలే నీ శాత్తరాలు గావాలి. మేం చేసినట్లే నువ్వూ సెయ్యాల్సొత్తాది, ఎరికేనా? ఆనక నీవల్ల ఏ తప్పుజరిగినా, నీకు తెలియసెప్పని దోసమ్ మాదవుద్ది" అంది.

చిన్నగా నవ్వి అంది రాధమ్మ. "మీరు చెప్పినవన్నీ మర్చిపోను మామ్మగారూ. అన్నీ గుర్తుంచుకుంటా. గడచిన జీవితం నాకేమీ గుర్తులేదు. ఇప్పుడు నేనూ మీలో ఒకతెను. మన కట్టుబాట్లన్నింటినీ నేనూ గౌరవిస్తా. వాటిని తప్పకుండా పాటిస్తా. సందేహం వద్దు" అంది. రాధమ్మ మాటలువిని అంతా సంతోషించారు.

ఆ తరవాత, కూతుర్ని అత్తవారింటికి పంపుతూ తల్లి చెప్పవలసిన మంచిమాటలు నాలుగూ చెపుతాను — అంటూ రాగమ్మ అందుకుంది, "అమ్మ నా కూతురో! ఇయ్యాల మొదలు నువ్వు నా కూతురివి కాదు, ఎల్లమ్మ కోడలివి! ఈ కాడనుండీ ఆ యింటి బారమంతా నువ్వే మొయ్యాల. నోటిలో నాలుక లేని మంచి మణిసి ఎల్లమ్మ. పాపం! వయసైపోయినాది. ఎట్టా కనిపెట్టి సూసుకుంటావో నీదే పూసీ. ఆ ఇయ్యేళ సల్లని అరిమెన కుండలసాచ్చిగా కన్నయ్యా నువ్వూ సెయ్యీ సెయ్యీ కలుపుకుంటారు. మీ కొంగులు ముడిపడ్డ కాడినుండీ ఆ యబ్బి పూసీ కూడా నీదే. ఏటకెల్లీ ఏళలో సద్దిముంత కట్టియ్యడంతో సరిపోతుందనుకోకు, సముద్దరం మీదికెల్లిన పెనిమిటి రేవుకి తిరిగొచ్చేదాకా ఆ యబ్బి ఛేమమ్ కోరి దేవున్ని ప్రేర్థన సేస్తూ ఉండాల. భారియా చేసే ప్రేర్ధనే ఆయబ్బిని గండాలనుండి కాపాడుద్ది. ఎప్పుడూ దుడుగ్గా ఉండే సముద్దరమ్ మీన కెరటాలతో తలపడి, పెద్దపెద్ద నోళ్ళుతెరిసి మింగాలని సూసే రాచ్చసి చేపలనీ, తిమింగలాల్నీ తప్పించుకుంటూ సేపలనుపట్టి, పడవలో ఏసుకుని తెవాలంటే ఎంత దన్ను కావాల! ఒడ్డుమీన, పెనిమిటి రాకకోసం ఎదురుచూస్తూ ఉండే పెల్లామే ఆ దన్ను! గురుతెట్టుకో రాదమ్మా!" "అలాగే అమ్మా! తప్పకుండా" అంది రాధమ్మ చిరునవ్వుతో.

పచ్చిబాలెంతరాలు లక్ష్మీకూడా, పసిబిడ్డని పక్కింటి ముసలమ్మకు అప్పగించి, పెద్దపిల్లల్ని ఆమెకు తోడుగా ఉంచి, ఎడపిల్లాడిని వెంట తీసుకుని కన్నయ్య పెళ్ళి చూడాలని వచ్చింది. తన అనారోగ్యాన్ని మర్చిపోయి, మూడుకాళ్ళ ముదుసలియైన పెద్దయ్యకూడా మనుమణ్ణి తోడు తీసుకుని కన్నయ్యారాధమ్మల పెళ్ళిచూడాలని వచ్చాడు. పంతులుగారి రాకతో పెళ్ళితంతు మొదలయ్యింది. పెద్దవాళ్ళ ఆశీర్వచనం తీసుకుని కన్నయ్య పెళ్ళిపీటదగ్గరకు వచ్చాడు. కొబ్బరిబొండం చేతిలో ఉంచి ముత్తైదువలు రాధమ్మను తీసుకొచ్చి పెళ్ళిపీటలమీద కూర్చోబెట్టారు. రాగమ్మా, పోలయ్యలు ఆసరికే కన్యాదాన కార్యక్రమంకోసం అక్కడ సిద్ధంగా ఉన్నారు. రాధమ్మను తమ కూతురుగా భావించి, మంగళవాయిద్యాలు మోగుతూండగా రాగమ్మా పోలయ్యా కన్యాదానం చేశారు. పంతులుగారు చెప్పుతుండగా వధూవరులు అయిరేని కుండలకు మ్రొక్కి "యావజ్జీవమూ భార్యాభర్తలుగా ఉంటా"మని ప్రమాణం చేశారు. అటు పిమ్మట రాధమ్మ మెడలో తాళిబొట్టు, నల్లపూసలకుత్తికంటు కట్టాడు కన్నయ్య. ఆ తరవాత వధూవరులు తలంబ్రాలు పోసుకున్నారు. అక్కడితో పెళ్ళితంతు ముగిసింది.

ధర్మయ్య వధూవరులకు కొత్తబట్టలు చదివించాడు. మిగిలిన వాళ్ళుకూడా ఎవరికి తోచినది వాళ్ళు వధూవరులకు కానుకలుగా ఇచ్చారు. పెద్దలకు నమస్కరించడానికి లేచారు వధూవరులు. ముందుగా కులపెద్దయిన పెద్దయ్యకు ముడుపు

చెల్లించి, నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు. ఆ తరువాత ఎల్లమ్మకి, ధర్మయ్యకి, ఇంకా తక్కిన పెద్దలకి కూడా ఒంగి కాళ్ళంటి నమస్కరించారు. తనకు రావలసిన డబ్బుతీసుకుని, వధూవరులను ఆశీర్వదించి వెళ్ళిపోయారు పంతులుగారు. పెట్రోమాక్సు లైట్ల కాంతిలో పచ్చని పందిరికింద విందు భోజనాలు మొదలయ్యాయి. భోజనాలయ్యాక సామాను కడిగి ఎవరిసామాను వాళ్ళు తీసుకుని వెళ్ళిపోయారు. వెళ్ళేవాళ్ళను సాగనంపడం కోసం కన్నయ్య భోజనం చెయ్యకుండా ఉండిపోయాడు. ఆడవాళ్ళు వడ్డించుకుంటూ భోజనానికి రమ్మని పిలిస్తే రాధమ్మ– కన్నయ్యకు పెట్టి తను తింటానని చెప్పింది. రాత్రి నిద్రవేళ అవ్వడంతో సెలవు తీసుకుని, పెళ్ళికివచ్చిన వాళ్ళందరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఇంట్లో ఇంక ఎల్లమ్మ, కన్నయ్య, రాధమ్మ మాత్రం మిగిలారు.

తొలిబంతిలోనే భోజనం చేసి, భుక్తాయాసంతో కూచోలేక, ఒక వారగా మంచం వాల్చుకుని పడుకున్న ఎల్లమ్మకు దానంతటదే కళ్ళమీదకు కునుకు వచ్చింది. వద్దు, నిద్రపోకూడదు అనుకుంటూనే నెమ్మదిగా ఆమె నిద్రలోకి జారుకుంది. చిత్రంగా ఆరోజు ఆమెకు నల్లమందు సాయం లేకుండానే మంచి నిద్రపట్టేసింది. అత్తగారికి దోమలు కుట్టకుండా దుప్పటీ కప్పి, ఇంట్లోకివెళ్ళి చిమ్నీబుడ్డి వెలిగించిపెట్టి, పసుపు బట్టలు మార్చుకుని, మామూలు బట్టలు కట్టుకుని, కన్నయ్య రాకకోసం ఎదురుచూస్తూ గుమ్మాల్లో కూచుంది రాధమ్మ, కొత్తపెళ్ళికూతురు. # # #

పెళ్ళికి వచ్చిన పెద్దలందరికీ వీడ్కోలుచెప్పి, సెలవుతీసుకుని తిరిగి వచ్చేసరికి కన్నయ్యకు దాదాపు గంట పట్టింది. గుమ్మంలోకి వచ్చేసరికి అతనికి తల్లి గురక వినిపించి నవ్వుకున్నాడు, "ఇన్నాళ్ళకి అమ్మ బెంగతీరి హాయిగా నిదరోతోంది గావును" అనుకున్నాడు సంతోషంగా. అతనిని చూడగానే, గుమ్మంలోనే కనిపెట్టుకునివున్న రాధమ్మ గమ్మున లేచి నిలబడింది గౌరవ సూచకంగా.

సిగ్గుపడ్డాడు కన్నయ్య. "అందరూ తలకొక ఊసూ సెవుతూంటే ఆలీశమైపోనాది" అంటూ, తన ఆలస్యానికి సంజాయిషీ చెప్పుకున్నాడు.

చిరునవ్వుతో "ఫరవాలేదులే" అంది రాధమ్మ.

చిన్న ముంతతో కుండలోని నీళ్ళుముంచి అతని చేతికి అందించింది. ఆ నీళ్ళతో కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చి, పెళ్ళిబట్టలు మార్చుకుని సాదాబట్టలు కట్టుకున్నాడు. ఈలోగా రాధమ్మ విస్తరి వేసి, భోజనం వడ్డించింది. భోజనానికి కూర్చున్నాడు కన్నయ్య. ఆమెను ఇదివరకులా పలకరించి మాటాడాలంటే ఏదో విచిత్రమైన భావావేశం గొంతు స్వాధీనంకాకుండా అడ్డుకుంటోంది. రాధమ్మ పరిస్థితీ ఆలాగే ఉంది. ఆమె మాటాడకుండా వడ్డిస్తూంటే, అతడు నోరెత్తకుండా భోంచేస్తున్నాడు! ఆ రోజు వాళ్ళ దాంపత్య జీవితంలో తొలిరోజు. వాళ్ళిద్దరి మనసుల్లోనూ ఏదో ఒక బిగువు చోటుచేసుకుని నోట మాట రానీకుండా చేస్తోంది. గ్లాసుతో మంచినీరు తెచ్చి విస్తరి పక్కన ఉంచింది రాధమ్మ. కూరతో తినడం అయ్యాక ధప్పళమ్ వడ్డించింది. విస్తరిలో రెండు పూర్ణంబూరెలు ఉంచింది. అవన్నీ ఇష్టంగా తిన్నాడు కన్నయ్య. మరొక బూరి వడ్డించబోయింది రాధమ్మ. వద్దని వారిస్తూ కన్నయ్య చటుక్కున ఆమె చేతిని ఎడమచేత్తో పట్టుకున్నాడు.

రాధమ్మ నోరు విప్పింది, "ఒక్కటేకదా, తినొచ్చు" అంది. అంటూనే ఆ బూరెని అతని విస్తరిలో జారవిడిచింది, అతనివైపు కొంటెగా చూస్తూ.

ఆమె కళ్లలోకి చూస్తూ తానూ నవ్వాడు కన్నయ్య. "మరి ఇంత తిండి తింటే ఇక కూకున్నసోటినుండి లేగడం ఉత్తిదే" అన్నాడు చిలిపిగా.

అక్కడితో వాళ్ళమధ్యన చోటుచేసుకున్న బిగువు సడలిపోయింది. రాధమ్మ చనువుగానవ్వి అంది, "తినడానికి అంత కష్టమైతే నాకు పెట్టొచ్చుగా" అంటూ నోరు తెరిచింది. అక్కడితో వాళ్ళమధ్యనున్న బెరుకు పోయింది. ఆ భక్ష్యాన్ని ఆమె నోటికి అందించాడు కన్నయ్య. దానిని ఆయిద్దరూ చెరిసహంగా కోరుక్కుతిన్నారు. కన్నయ్య విస్తరి మడిచి, చెయ్యి కడుక్కోడానికి లేవగానే రాధమ్మ విస్తరి పరుచుకుంది. చెయ్యి కడుక్కువచ్చిన కన్నయ్య " నాను వడ్డించేదా" అంటూ గరిట అందుకున్నాడు. గిన్నెలో మిగిలున్న అన్నం మొత్తం వడ్డించబోతూంటే, కన్నయ్య చెయ్యి పట్టుకు ఆపింది రాధమ్మ. "అబ్బో! అంత అన్నమా, సగం చాలు" అంది.

"ఓసోస్! ఇదే ఎక్కువా ఏంటీ? నీకు తినడం సేతకాకపోతే నే తినిపిస్తా సూడు" అంటూ ఆమె విస్తరిపక్కనే కూర్చుని అన్నంలో కూర కలపసాగేడు.

ప్రియమారా కన్నయ్య తినిపిస్తూండగా కడుపుపట్టినంత తిని లేచింది రాధమ్మ. ఆమె ఇల్లు సద్దుకుని వచ్చేసరికి కన్నయ్య ఆ పాకలో ఒక వారగా కొత్త తుంగచాప పరచి, దానిపైన  జంబుకానా వేసి, దానిమీద దుప్పటీ పరిచి తలదిక్కున రెండు దిళ్ళువేసి పడక ఏర్పాటు చేశాడు. పక్కమీద కూర్చుని రాధమ్మ రాకకోసం ఎదురుచూస్తున్నాడు. కానీ అతని మనసులో  ఏదో తెలియని అలజడి చోటుచేసుకుంది.

కన్నయ్యకు హృదయమంతా నిండివుండే వెచ్చని ప్రేమలోని మాధుర్యం తెలుసు. కానీ స్త్రీ సాంగత్యంలో దొరికే సుఖాన్నతడు  ఎంతమాత్రం ఎరుగడు. ఐనా ఏదో అంతఃప్రేరణ  పురిగొల్పగా రాధమ్మ రాకకోసం ఎదురుచూస్తున్నాడు. " ఈరోజు మొదలుగా రాదమ్మ నా బారియ. సల్లని అరిమెనకుండల సాక్షిగా, కులపెద్దలందరి ఎదుట ఆమె మెడలో తాలిగట్టి, నెత్తిమీద తలంబ్రాలుపోసి నా నామెకు పెనిమిటినయ్యాను. పచ్చని పందిరి కింద ఇద్దరమూ బతుకులు కలబోసుకుంటామని ప్రెమానాలు శేసుకున్నాము. ఇక ఇప్పుడు తనువులు ఒకటయ్యే సమయం వచ్చింది" అనుకున్నాడు. అతని శరీరం ఆనందంతో పులకించింది.  ఆలస్యం సహించలేక "రాదమ్మా!" అంటూ వింత ఎలుగుతో పిలిచాడు ఆమెను కన్నయ్య.

ఆగరొత్తులు వెలిగిస్తున్న రాధమ్మ ఆ పిలుపుకోసమే ఎదురుచూస్తున్నదానిలా వెంటనే అతనిదగ్గరకు వచ్చింది. తెల్లని చీరలో, జడలో మల్లెపూలతో ఆమె అతనికి కొత్త అందంతో కనిపించింది. ఇదివరకు ఎప్పుడూ చూడని విధంగా చూస్తూ, లేచి నిలబడి ఆమెను తన కౌగిలిలోకి ఆహ్వానిస్తూ చేతులు ముందుకు చాపాడు కన్నయ్య. గతం గుర్తురాక, ప్రస్తుతంలోనే జీవిస్తున్న రాధమ్మకి ఆ చూపు చక్కిలిగిలిపెట్టగా, కిలారున నవ్వి, చాపిన అతని చేతుల్లో ఇమిడి పోయింది వెంటనే.

రాధమ్మ మనసునిండా కన్నయ్యను గురించిన ఆలోచనలే! తన కన్నయ్య ఉత్తముడు! అతడి నిర్మలహృదయం, పరోపకారబుద్ధి, స్ఫురద్రూపం — ఇన్ని సుగుణాలు కలిసికట్టుగా ఎవరికి ఉన్నాయిట? కన్నయ్య మట్టిలోపుట్టిన మాణిక్యం! తానీనాడు అతన్ని కోరి వరించిందంటే దానికి కారణం అతడు తనకు అన్నివిధాల నచ్చడమే. "హే భగవాన్! బ్రతుకులోనైనా చావులోనైనా మేమిలా ఒకటిగానే ఉండేలా అనుగ్రహించు" అనుకుంది మనసులో. భావావేశంతో ఆమె కళ్ళు చెమర్చాయి. ఆమె కళ్ళను ముద్దిడిన కన్నయ్యకు ఆ కన్నీరుతాలూకు ఉప్పని రుచి తెలిసింది. ఏ దూర తీరాలనుండో తనకోసం సముద్రంలో కొట్టుకునివచ్చి, ఈ వొడ్డుచేరిన అసలు సిసలు ఆణిముత్యం తన రాధమ్మ. ఆమె తనకు గతం గుర్తురానందుకు దిగులుపడతోంది కాబోలు – అనుకున్నాడు కన్నయ్య.

"రాదమ్మా!కన్నీరొద్దు . నామీన నమ్మకమెట్టుకో. నీ కన్నయ్య మాటతప్పే దొంగనాయాలు కాదు. నెమ్మదిమీద నీకే ఎరుకౌతాదిలే" అని చెపుతూ ఆమెను మరింత గాఢంగా హృదయానికి హత్తుకుని, ఆమె కన్నీరును తన పెదవులతో తుడిచాడు. తన జీవిత సర్వస్వం అతడేనని, అతనిని లతలా అల్లుకుపోయింది రాధమ్మ.

ఆ రాత్రి, వాళ్ళ తనువులే కాకుండా వాళ్ళ మనసులుకూడా పెనవేసుకున్న శుభరాత్రి! తన ఒడిలో ఒదిగి తన్మయత్వంతో కళ్ళు మూసుకున్న రాధమ్మను చూస్తూ, "గడిసిపోయిన దినాలను తలుచుకోమోకు రాదమ్మా! అయి మనిద్దరకు కూడా తలుచుకోదగినయిగావు. ఈ రోజే మన కొత్తజీవితానికి మొదలు. ఇక ఈ జలమలో నిన్ను కంట తడి ఎట్టనీను. ఆ గంగమ్మతల్లి మీన ఆన! నేను గంగాపుత్రున్ని, సముద్దరంలోని సంపదకు వోరసుణ్ణి. నాకు ఒంటిరెక్కమీద పడవ నడిపుకుంటూ కెరటాలను దాటుకుని ఒడ్డును చేరగల నేర్పుంది, నీటిలో అడుగడుగునా తగిలే సుడిగుండాలను తప్పింకుంటూ చాకచక్యంగా నావ నడపగలను, ఎంత రాత్తిరికాడైనా సుక్కలను సూసి దారికనుక్కోగల ప్రెగ్నె ఉంది, జబ్బల్లో సత్తువవుంది, ఎదురులేని సాహసముంది – ఎంతెంత ఇబ్బందులున్నా నిన్ను సుకపెట్టడానికే పాటుపడతా. పువ్వులాంటి నా రాదమ్మని పువ్వుల్లో ఎట్టుకుని సూసుకుంటా" అన్నాడు కన్నయ్య.

# # #

మృగశిరా ప్రవేశమయ్యింది. అంతవరకూ "నేనే రేయికి రాజు"నని విర్రవీగి, ఆకాశమంతా తానై ఏలిన నెలరాజుకి వాన మేఘాలు అడ్డురావడం మొదలుపెట్టాయి. దాంతో, మబ్బుల చాటున తలదాచుకోడం చందమామకు తప్పనిసరి అయ్యింది. వినువీధిలో విహరిస్తున్న మేఘాలు ఏకమై కుండపోతగా వర్షాన్ని కురిపించసాగాయి. ఉరుములు మెరుపులుతో దద్దరిల్లుతోంది ప్రకృతి. ఉండుండీ భీకరమైన శబ్దంతో పిడుగులు కూడా పడుతున్నాయి.

వానచినుకులకి పులకించిన ధరణిపై చూస్తూండగా మొలకలు పుట్టాయి. సముద్రపునీటి లో కూడా కొత్త కొత్త జీవరాసులు పుట్టుకొచ్చాయి. చినుకుకొక జీవిగా పుట్టడంతో సముద్రం చిన్నా, పెద్దా చేపజాతులతో బిలబిలలాడిపోయిది. అసంఖ్యాకంగా రకరకాల రొయ్యలు, ఇంకాఎన్నో ఇతరజీవాలు పుంఖానుపుంఖాలుగా పుట్టుకొచ్చాయి సముద్రంనీటిలో. కురిసే వర్షాధారల మధ్య ఎగిరెగిరిపడుతూ ఆటలాడుతున్న చేపపిల్లల పొట్టలు మెరుపుల వెలుగులో తళతళా మెరవసాగాయి. బెస్తవాడలో ఆనందం వెల్లివిరిసింది. జాలర్ల సంతోషానికి అవధుల్లేవు. వాళ్ళ కింక చేతినిండా పని, జేబునిండా డబ్బు! కష్టదినాలు గడిచిపోయాయి. మళ్ళీ వేటపడవలు సముద్రం మీదికి వెళ్ళే రోజు వచ్చింది. తెరచాపలకి,

పడవలకీ, వలలకి వచ్చిన చిన్నచిన్న లోపాల్ని సరిచేసుకుని, వేట పడవల్ని సముద్రం మీదకు దూసుకుపోడానికి సిద్ధం చేసుకున్నారు పల్లెకారులు. ప్రతి ఏడు కంటే ఇబ్బడి ముబ్బడిగా ఎగిరెగిరిపడుతున్న చేపల జోరు చూసి ఈ ఏడాది పంట ఎప్పుడూ లేనంత బాగా ఉంది – అని వాళ్ళలో వాళ్ళు చెప్పుకుని మురిశారు జాలర్లు. మంచి ముహూర్తం చూసుకుని, రేవుకి చేరి గంగమ్మకు పూజ చేసి ఆపై వేటపడవల్ని నీటిమీదకు వదిలారు. సముద్రంలో చేపలు కోకొల్లలుగా ఉండడంతో వేట మంచిగా సాగి, జాలర్లకి మంచిమంచి లాభాలు వస్తున్నాయి. ఆ సంపద బెస్తవాడలోని జనాలకు సంతోషాన్నిచ్చింది. రాధమ్మ బెస్తవాడకు కోడలైన వేళా విశేషం అన్నారు.

వ్యాపారపవనాలు వీచడం మొదలవ్వగానే తెరచాపలెత్తుకుని సముద్రపునీటిపై సర్రున పరుగెత్తే ఓడలా, భవిష్యత్తులోకి దూసుకుపోయింది కాలం. రాధమ్మ బెస్తవాడకు పాతకాపు అయ్యింది. చూస్తూండగా అక్కడి జీవనసరళికి అలవాటుపడిపోయింది. అంతేకాదు ఆ పల్లెకారుల అలవాట్లను పుణికి , పుచ్చుకుని, వాళ్లలాగే కట్టూ, బొట్టూ మార్చుకుని వాళ్ళలో ఒకతెగా కలిసిపోయింది. ఎల్లమ్మ కోడలిగా, కన్నయ్య భార్యగా, మందికి కావలసిన మనిషిగా, ఆ పల్లెకారులలో ఒకతెగా అనతికాలంలోనే వాళ్ళలో చేరిపోయింది రాధమ్మ. అందరికీ తలలో నాలుకగా మసులుతూ ఆమె అందరి ప్రేమకూ పాత్రురాలయ్యింది. ఆ బెస్తవాడలో ఎవరికీ చదవనూ, రాయనూ రాదన్న బాధ రాధమ్మ మూలంగా తీరిపోయింది. ఇప్పుడు వాళ్ళకి ఏ లెక్క తెలియకపోయినా రాధమ్మ దగ్గరకి తెస్తున్నారు. ఏ కాగితం చదవాలన్నా రాధమ్మ వాళ్ళకి చదివి చెపుతోంది. ఎవరికి ఏ సందేహం వచ్చినా, “మనకు రాధమ్మ ఉంది” అన్న భరోసా ఏర్పడింది బెస్తవాడలో. క్రమంగా అక్కడ ఆమెపేరు నిత్యపారాయణంగా మారింది. అది నెమ్మదిగా కొద్దిమందిలో అసూయా బీజాన్ని నాటింది. వాళ్ళు అనాధయైన కన్నయ్యకు పట్టిన అదృష్టానికి లోలోన ఈర్ష్యతో రగిలిపోసాగారు.

బెస్తపడుచులందరిలాగే ముతకచీర కట్టి, మోచేతులవరకు ఉన్న రవికతొడిగి,జుట్టు ముచ్చటముడిలా చుట్టి, నుదుట నయాపైసంత కుంకుమబొట్టు పెట్టుకుని, చేతులనిండుగా మట్టిగాజులు తొడుక్కోడంతో సరిపెట్టలేదు రాధమ్మ, వాళ్ళదగ్గర ఉప్పుచేపల్ని, ఎండురొయ్యల్ని తయారుచేయడం,వలలకు పడ్డ చిరుగుల్ని బాగుచెయ్యడం లాంటి పనులు కూడా ఇట్టే నేర్చుకుంది. వాళ్ళలాగే తనుకూడా చేపల్ని, రొయ్యల్ని తయారుచేసి అమ్మి, వచ్చిన సొమ్ము భర్తకిచ్చేది. పెళ్ళికి ధర్మయ్య దగ్గర చేసిన అప్పు అతి తక్కువ వ్యవధిలో తీర్చేయగలిగారు వాళ్ళు.

రాధమ్మ అలుపుసొలుపులను పక్కనపెట్టి, తనవల్లనయ్యే పనైతే చాలు – ఎవరి కేదికావాలన్నా చేసిపెట్టడానికి సిద్ధంగా ఉండేది. ఇక వ్యాపారంలో ధర్మయ్యకు ఆమె కుడిబుజమయ్యింది. రాధమ్మ వచ్చాక చేపల అమ్మకంలో, వచ్చిన డబ్బు వాటాలు వేయడంలో, వలలు, గాలాలు వగైరా వేటచేసే సామగ్రి కొనడంలో లెక్కల్లో ఏ తభావతూ రానీకుండా చక్కగా సరిజూసి పెడుతోంది. చిక్కుముడులలాంటి సమస్యలు కూడా ఇదివరకులా గిజాటుపడనక్కర లేకుండా క్షణంలో అన్నీ సద్దుబాటు ఔతున్నాయి. రాధమ్మ ప్రోద్భలంతో బెస్తవాడలో జనం క్రమంగా శుచి, శుభ్రాలు కూడా అలావరచ్చుకుంటున్నారు. ఓర్పుతో నేర్పుతో అక్కడి లొసుగులు సరిదిద్దే ప్రయత్నం చేసేది రాధమ్మ.

\# \# \# అఖండ గౌతమి ధవళేశ్వరం దగ్గర పాయలుగా చీలి పల్లపునేలలో దిగువకు ప్రవహించివెళ్ళి తూరుపు దిక్కున బంగాళాఖాతంలో కలిసింది. జీవనది గోదావరినే గౌతమి – అనికూడా అంటారు. చీలిన నదీపాయల్లో ఒకటి వశిష్ట. ఈ వశిష్ట గోదావరి అంతర్వేది దగ్గర సముద్రంలో కలిసింది. సాగర సంగమ క్షేత్రమైన అంతర్వేదిలోని దేవుడు శ్రీ లక్ష్మీసమేత నరసింహ స్వామి. ఇది కోనసీమలోని గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి పొందింది. కోనసీమకు ఈవలి వొడ్డున ఈ వైష్ణవక్షేత్రముంటే,కొంచెం ఎగువగా,ఆవలిఒడ్డున లక్ష్మణేశ్వరం అనబడే ఒక శైవ క్షేత్రం ఉంది. లక్ష్మణేశ్వరంలో లింగ ప్రతిష్ఠ చేసినది, వనవాస సమయంలో సాక్షాత్తు లక్ష్మణుడే – అంటారు. ప్రభుత్వంచే ఈ రెండుచోటుల్లోనూ, ప్రజాహితం కోసం సురక్షితమైన స్నానఘట్టాలు ఏర్పరచబడ్డాయి. జనాకర్షణ ఉన్న చోటుల్లో వ్యాపారం మొదలవ్వడం మామూలేకదా! ఆ సమయంలోఆయా ప్రదేశాల్లో పెద్ద తిరణాల కూడా నడుస్తుంది. తీర్థంలో స్నానంచేసి, దైవదర్శనం చేసుకుని, తిరణాలలో అమ్మే రకరకాల వస్తువులను, ఎవరికి కావలసినవి వారు కొనుక్కుని సంతోషంగా ఇళ్ళకు వెడుతున్నారు భక్తజనం.

బెస్తవాడలో వాళ్ళు కొందరు పుష్కర స్నానం చేసి దైవ దర్శనం చేసుకుని రావాలని కోరుకున్నారు. ఒకరోజు చేపల వేటకు సెలవిచ్చి, ఆ వేటపడవలమీదే ఉదయాన్నే బయలుదేరి వెళ్ళి, రాత్రికి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు వాళ్ళు. ఏ బాదరబందీలు లేనివాళ్ళు రెండు పడవల జనం పోగుబడ్డారు పుష్కర యాత్రకు. వారిలో కన్నయ్య, రాధమ్మ కూడా ఉన్నారు. కీళ్ళనొప్పులవల్ల ఎల్లమ్మ ఇంటిలోనే ఉండిపోయింది. వెలుగు పూర్తిగా రాకముందే అందరూ రేవుకి చేరారు. తెల్లారీసరికల్లా పడవలు యాత్రకు బయలుదేరాయి. వొడ్డు చూసుకుంటూ సముద్రంలో ప్రయాణించి ఆ పడవలు అంతర్వేదిని తొమ్మిదయ్యీసరికల్లా చేరుకున్నాయి. అక్కడ పడవలు దిగి, గోదావరిలో స్నానం చేసి, వెళ్ళి నరసింహస్వామి దర్శనం చేసుకుని, పూజ చేయించి ప్రసాదాలు తీసుకుని తిరిగి పడవలదగ్గరకు వచ్చారు. భోజనం వేళకావడంతో తాము వెంట తెచ్చుకున్న అటుకులూ – బెల్లం, గుడిలో కొబ్బరికాయలు కొట్టాక దేవుని ప్రసాదంగా వచ్చిన కొబ్బరి ముక్కలతో కలుపుకుని తృప్తిగా తిన్నారు. ఆపై మంచి నీరుతాగి, ఆపూటకు భోజనం అయ్యిందనిపించారు. ఆపైన కొంచెం సేపు చెట్ల క్రింద కూచుని విశ్రాంతి తీసుకుని, మళ్ళీ పడవలెక్కారు. ఆ పడవలు గోదావరిలో ప్రవేశించాయి. ప్రవాహానికి ఎదురుగా కొంతదూరం పయనించి, వశిష్ట గోదావరిని అడ్డంగా దాటి ఆ పడవలు అవతలి ఒడ్డునున్న లక్ష్మణేశ్వరం చేరుకున్నాయి. అక్కడ ఒకవారగా పడవల్ని ఆపి, లంగరువేసి ఒడ్డెక్కారు అందరూ.

గుడికివెళ్ళి కనుక్కుంటే సంజపడ్డాక గాని దేవాలయంలో పూజ మొదలవ్వదు – అని చెప్పారు. అక్కడ తిరణాల జరుగుతోంది. సాయంకాలంవరకూ ఆ తిరణాలలో తిరిగి, కావలసినవన్నీ కొనుక్కుని, గుడిగంటలు మ్రోగగానే అందరూ గుడి గుమ్మం దగ్గర కలుసుకోవాలని చెప్పుకుని, వాళ్ళు జట్లు జట్లుగా విడిపోయారు. కన్నయ్యా రాధమ్మలు ఒక జట్టుగా బయలుదేరారు.

గుడి ముందరున్న ఖాళీస్థలంలో షాపులు తెరిచి రకరకాల వస్తువులు అమ్ముతున్నారు. చూసిన వాళ్ళను ఊరించేలా షాపులన్నీ, తాము అమ్ముతున్న వస్తువులతో అలంకరించబడి ఉన్నాయి. అంతవరకూ కలిసి ఉన్నవాళ్ళు, తమకు కావలసిన వస్తువులను వెతుక్కుంటూ తలోవైపుకీ నడిచారు. రాధమ్మ కన్నయ్యను స్టీలుసామాను అమ్ముతున్న చోటికి నడిపించింది.

ఎల్లమ్మ భోజనం చేసే సత్తుకంచం అరిగిపోయి, సొట్టలు పడి ఉండి. ఆమెకోసం ఒక కంచం, ఒక గ్లాసు కొంది. ఇంకా ఏవో రెండు గరిటెలు, నాల్గు చెంచాలూ, కన్నయ్యకోసం ఒక టిఫిన్ బాక్సు కూడా కొంది.

రాధమ్మకి అక్కడకి వచ్చినది లగాయితూమనసులో ఏదో తెలియని అలజడి మొదలయ్యింది. గుడి గుమ్మం మొదలు, అక్కడ కనిపించిన వన్నీ ఇదివరకు తాను చూసినవే అనీ, ఆ ప్రదేశమంతా తనకు పరిచితమైనదే అనీ అనిపించసాగింది ఆమెకు. అప్రయత్నంగా, మానసంతా గింగిరాలు తిరుగుతూ ఏవేవో ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. వింతవింత సంగతులేవేవో తలపుకి వస్తున్నాయి. క్షణక్షణానికీ ఆమె మనసులో ఆందోళన పెరుగుతోంది. రాధమ్మ దేనికో ఇబ్బందిపడుతోందని గ్రహించాడు కన్నయ్య...

“ఏందిది రాదమ్మా! ఆలాగున్నావేంటి? ప్రేణమ్ బాగోలేదా” అని అడిగాడు ఆమె నుదుటిమీద చెయ్యుంచి వేడి చూస్తూ.

భర్త ముఖంలోకి బేలగా చూసింది రాధమ్మ. “నాకేవేవో విషయాలు తలపుకి వస్తున్నాయి. ఈ గుడి, ఈ గుడిగుమ్మం, ఈ వీధులు, ఈ తిరణాల – ఇవన్నీ నేను ఇదివరకు చూసినవే అనిపిస్తోంది. ఇదేమి  మాయో” అనుదకుని ఆలోచనలో పడింది రాధమ్మ.

“రా రాదమ్మా! “టీ” తాగి ఒద్దారి. ఏడేడి “టీ” తాగితే కూంతంత తలబారం తగ్గుద్ది” అంటూ కన్నయ్య టీ కొట్టువైపు దారితీశాడు.

అక్కడున్న బెంచీమీద కూర్చుని వాళ్ళు చెరో రెండు బజ్జీలుతిని “టీ” తాగారు. అంతలో ఎవరో “అనూరాదమ్మగారూ” అని పిలవడం వినిపించి గమ్మున రాధమ్మ వెనక్కితిరిగి, ఆ పిలుపు వచ్చిన వైపుగా చూసి ఆ మనిషిని గుర్తుపట్టింది. “ఈమె ఎవరోకాదు, పనిమనిషి పద్దాలు” అనుకుంది. లేచి ఒకడుగు ముందుకు వేసింది. కానీ, అంతలోనే  తన పరిస్థితి గుర్తొచ్చి గతుక్కుమంది, లేచినది మళ్ళీ కూర్చుండిపోయింది.

అంతలో, “అమ్మాయిగారూ బాగున్నారా” అంటూ పద్దాలు దగ్గరగా వచ్చేసింది. అవధుల్లేని ఆనండంతో ఆమె మొహం విప్పారింది. “ఎన్నాళ్ళకు అవుపించారమ్మా! ఎక్కడుంటున్నారు, ఏంచేస్తున్నారు” అంటూ ప్రశ్నల వర్షం కురిపించడం మొదలుపెట్టింది.

“మీరెవరమ్మా? ఎవరనుకుంటున్నారు నన్ను చూసి? మీరు మీవాళ్ళనుకుని  పొరపాటుపడుతున్నారు, మాదీ ఊరు కాదు. గూడపల్లికి దగ్గరలోఉన్న సముద్రపు  వారనున్న బెస్తవాడ మాది. నేనో మరక్కత్తెను, ఈయబ్బి నా పెనిమిటి. వస్తామమ్మా” అంటూ లేచి, కన్నయ్య చెయ్యిపట్టుకుని మరో వైపుగా వెళ్ళిపోయింది. పద్దాలుని పలకరించి ఏమేమో అడగాలనిపించిన కోరికను బలవంతంగా  చంపుకుంది రాధమ్మ.

ఆశ్చర్యం నుండి తేరుకుని చూసిన పద్దాలుకి రాధమ్మ కనిపించలేదు. “మనిసినిబోలిన మనిసి ఉండొచ్చు, కానీ మరీ అంతచేటు పోలికా! అచ్చంగా అమ్మాయిగారికున్నట్టే గడ్డం మీద పుట్టుమచ్చకూడాఉంది ఈవిడకు కూడా. అమ్మాయిగారు, కాదంటే నేను నమ్మలేకుండా ఉన్నాను. మాటతీరు చూస్తే మరకట్టెకులా లేదు. అమ్మాయిగారే! పేరెట్టి పిలిస్తే పలికి కూడా ఎందుకోగాని మాట మార్చేశారు. ఏదో దాస్తున్నారు — అనిపిస్తోంది. ఈ మాటు నిలదీసి అడగాలి” అనుకుంటూ చుట్టూ వెతికి చూసింది, కానీ జనం విపరీతంగా ఉండడంతో ఆమెను కనుక్కోలేకపోయింది పద్దాలు. ఇక చేయగలిగగిందేమీ లేక నిట్టూర్చి, తనదారిని తాను వెళ్ళిపోయింది.

సాయంకాలంపూజ మొదలవ్వాగానే గుడిలో పూజ చేయించి ప్రసాదాలు తీసుకుని, బెస్తవాడనుండి వచ్చిన జనం తిరుగుప్రయాణమయ్యారు. వాళ్ళలో ఎవరికీ వచ్చినప్పుడున్న ఉషారు ఇప్పుడు లేదు. రాధమ్మకి అసలులేదు. గతం తాలూకు సంఘటనలు మనసుకు నిండుగా బిలబిలలాడుతూ వచ్చిపడి ఆమెను ఆరడి పెడుతూండగా పడవలో ఒక వారగా కూర్చుని కళ్ళు గట్టిగా మూసుకుంది. అలసి వచ్చి నిద్రపోతోందనుకుని ఆమెను ఎవరూ పలకరించలేదు. కన్నయ్య కూడా ఆమె నిద్రపోతోందనే అనుకుని, ఆమెనలా వదలి వెళ్ళి తెడ్డు అందుకున్నాడు. తిరుగుప్రయాణం మొదలయ్యింది.

మూసివున్న కళ్ళవెనుక సినిమారీళ్ళలా గిరగిరా తిరుగుతూ గడచిపోయిన రోజులు ఆమెకు కనిపించసాగాయి. కానీ, గతాన్ని తలుచుకుని మురిసేందుకు ఆమెకు మనోహరమైన విషయాలేమీ లేవు. తనను ప్రేమగా చూసుకునీ తల్లి, తను మనసారా ప్రేమించిన శ్రీను లేరు, చనిపోయారు. ఉన్నదల్లా తన స్వార్ధానికి కన్న కూతుర్ని “బలిపశువును” చెయ్యాలనుకున్న తండ్రి, ఎప్పుడూ “రెసిడెన్షియల్ స్కూళ్ళలోనే ఉండి చదువుకుంటూ - తల్లీ, తోడూ అన్న అనుబంధాలేవీ ఎరుగని తమ్ముడు! వెళ్ళి బావుకోవలసిన ఆత్మీయతలేమీ లేవు గతంలో తనకు. తన అదృష్టం బాగుండి సమయానికి స్ఫురించడం వల్ల పద్దాలుకు మస్కాకొట్టి తప్పించుకురావడం జరిగింది. కానీ ఆమె తన మాట నమ్మినట్లు అనిపించలేదు. "పోనీ, దొరికిపోకుండా తప్పించుకు వచ్చేశాం కదా" అనుకుంది రాధమ్మ.

సముద్రంలోని పోటు - పాటులను చక్కగా ఉపయోగించాయి వాళ్ళకు. అది పాటు సమయం కావడంతో గోదావరి లోని నీరు సముద్రంలోకి వేగంగా వెడుతూ పడవనుకూడా తనతో తీసుకుపోయింది. మొత్తానికి చీకటిపడేసరికి వచ్చి బెస్తవాడను చేరుకున్నాయి పడవలు.

అందరూ పడవలు దిగి ఇళ్ళకు వెళ్ళిపోయారు. రాధమ్మకూడా మైకంలో ఉన్నదానిలా కన్నయ్య చెయ్యిపట్టుకుని నడిచి ఇల్లుచేరింది.

వాళ్ళు ఇంటికి తిరిగివచ్చేసరికే ఎల్లమ్మ వంటచేసి సిద్ధంగా ఉంచింది. రాధమ్మ వస్తూనే ఓ మూలగా చాప పరుచుకుని పడుకుండిపోయింది. అది చూసి, సుకుమారియైన రాధమ్మకు ఏకబిగిని ఎండలో తిరగడం వల్ల తలనెప్పి వచ్చింది కాబోలు - అనుకున్నాడు కన్నయ్య. వెంటనే అమృతాంజనం కొనితేవడం కోసం బయలుదేరాడు.

అమృతాంజనంతో తిరిగివచ్చిన కన్నయ్య ఆమె పక్కన కూర్చుని, ఆమెను తన ఒడిలోకి తీసుకుని మృదువుగా ఆమె నుదుటికి అమృతాంజనం రాయసాగాడు. ఆతని ఒడిలో చేరి సేదదీరిన రాధమ్మ సంతృప్తిగా అనుకుంది, “ఈ జన్మకీ సుఖం చాలు!”

తన ముఖానికి అమృతాంజనం రాసున్న కన్నయ్య చేయిని తన చేతుల్లోకి తీసుకుని, “కన్నయ్యా! నాకు గతమంతా గుర్తొచ్చింది. చెపుతా, వింటావా “ అని అడిగింది.

సరిగా అప్పుడే కేకేసింది ఎల్లమ్మ, “వణ్ణమ్ తిందురుగాని రండల్లా, సప్పగా సల్లారిపోతాది.” అంటూ.

కన్నయ్య రాధమ్మని సున్నితంగా ముద్దుపెట్టుకుని, “ముందు బువ్వ, తరవాత కత” అన్నాడు ఆమెను లేవదీస్తూ.

ఎల్లమ్మకోసం తెచ్చిన గ్లాసూ, కంచం ఆమెకు అందించింది రాధమ్మ. రాధమ్మ వైపు ప్రేమగా చూస్తూ ఆ బహుమతిని అందుకుంది. తనకోడలు తనని గుర్తుపెట్టుకుని తెచ్చినందుకు సంతోషించింది. మురిసిపోతూ తన భోజనాన్ని ఆ కంచంలోనే వడ్డించుకుంది ఎల్లమ్మ. ముగ్గురూ భోజనాలు చేశారు. ముద్ద కడుపులోపడగానే కాళ్ళమీదకు నిద్ర ముంచుకు వచ్చింది ఆమెకు. మంచమెక్కిన ఎల్లమ్మ మరోనిముషం గడిచేసరికి గుఱ్ఱు పెడుతూ నిద్రపోయింది. కన్నయ్య రాధమ్మవైపు చూసి చిన్నగా నవ్వాడు. రాధమ్మ కూడా నవ్వి,”చిటికెలో వచ్చేస్తా”అంది.

రాధమ్మ ఇల్లు సద్దుకుని వచ్చేసరికి కన్నయ్య పక్క దులిపి తిరిగి వేశాడు. రాధమ్మ వచ్చి పక్కమీద కూచుంది. రాధమ్మని ఒడిలోకి లాక్కుని, లాలనగా అడిగాడు కన్నయ్య, “ ఇక సెప్పు రాదమ్మా! మనసులో గుబులుంటే దాన్ని ఐనోళ్ళకాడ సెప్పేత్తే మనోబారం తగ్గుద్దంటారు. సెప్పె రాదమ్మా! నీకు నానున్నా, నీ కట్టాసుకాల్లో నాకూ పాలుందిగందా” అన్నాడు ప్రేమగా. రాధమ్మ తన గతాన్ని కథలా మలిచి కన్నయ్యకు చెప్పసాగింది

(సశేషం)

# అశోక మౌర్య-16

డా. వల్లూరుపల్లి శివాజీరావు

## 10. అశోకుడు

***గత సంచికలో అశోక చక్రవర్తి తన ఆధ్వర్యంలో బీహార్ లో నెలకొల్పిన లారియా-నందన్ గర్హ్, లారియా అరారాజ్ స్థంభాలు మరియు ఆంధ్రదేశంలో కృష్ణా నదీ తీరాన ధాన్యకటకం/ధరణికోట (అమరావతి) స్థూపం గురించిన వివరాలు తెలుసుకోవటం జరిగింది.***

***ఈ సంచికలో బౌద్ధమత వ్యాప్తికి అశోకుడు ప్రారంభించిన, నిర్వహించిన కార్య క్రమాల గురించి, నీతి, న్యాయం విషయాలలో తీసుకున్న నిర్ణయాలు, అయన ప్రర్తించిన తీరు, తదితర సంగతుల గురించి తెలుసుకుందాము.***

## బౌద్ధ ధర్మం పోషణ, అభివృద్ధి, ప్రచారం

క్రీ.పూ. 268 లో చక్రవర్తిగా మౌర్య సింహాసనం అధిష్టించిన తరువాత 8-9 ఏళ్లకు (క్రీ.పూ. 260-259) అశోకుడు బీహార్ లోని 'గయ' వెళ్లి అచ్చట 'మహాబోధి' వృక్షాన్ని దర్శించి, గౌతమ బుద్ధ బోధించిన ధర్మ సూత్రాలను ప్రచారం చేయటంతో పాటు అనేక సంఘ సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టటం జరి గింది. ఈ సంక్షేమ కార్యక్రమాలలో ముఖ్యమైనవి మానవులకు, పశువులకు వైద్య సౌకర్యాలు కల్పించటం; వైద్య మూలిక, ఔషధ మొక్కలు నాటి, వాటిని పెంచి పోషించటం; బావులను త్రవ్విం చటం; రహదారుల ప్రక్కన చెట్లను నాటించటం; తదితరమైనవి. ఈ కార్యక్రమాలను తన రాజ్యంలోనే గాక, ఇరుగు పొరుగు రాజ్యాలలోనూ (చోళ, పాండ్య, సత్యపుత్ర, తామ్రపర్ణి, గ్రీకు) నిర్వహించేటట్లు చేయటం జరిగింది.

తన పాలనలో 10-11 వ ఏట (క్రీ.పూ. 258-257) అశోకుడు బౌద్ధ సంఘంకు దగ్గరగా జరిగి 256 రోజులు పాటు తన రాజ్యం అంతా తిరిగి బౌద్ధ ధర్మ సభలు నిర్వహించటం జరిగింది. 12 వ ఏట
(క్రీ.పూ. 256) ఆయన బౌద్ధ ధర్మం గురించిన శాసనాలను అనేక రూపాలలో చెక్కించి వాటిని ప్రజలలోకి తీసుకువెళ్లే కార్యక్రమాలను నిర్వహించమని తన అధికారులను (రజ్జుకలు, ప్రదేశికారులు) ఆజ్ఞాపించి,
వారిని తమ అధికార పరిమితి ప్రదేశాలలో పర్యటించి ధర్మబోధనలను పరీక్షించి, తగిన చర్యలను తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వటం జరిగింది. అదే ఏట 'ధర్మ మహామాత్ర' ఉద్యోగిని నియమించి బౌద్ధ ధర్మాన్ని ప్రజలలోకి మరింత వ్యాప్తి చేయాలని ఆయనను ఆదేశించాడు. 14 వ ఏట గౌతమ బుద్ధుడి పూర్వ జన్మలో (23 వ జన్మలో) అవతరించిన Koṇāgamana Buddha (కోణాగమన బుద్ధ; బుద్ధ కనక
ముని) (Kanakamuni) విగ్రహాన్ని భారీ పరిమాణంలో నెలకొల్పటం జరిగింది. ఈ కనకముని బుద్ధుడి పేరు మీదనే నేపాల్ లోని 'లుంబిని' కి 20 కి.మీ. దూరంలో వాయువ్య దిశలో ఉన్న నిగాలి సాగర్ లో 'నిగాలి సాగర్' ధర్మ స్థంభం నెలకొల్పబడింది.

## మూడవ బౌద్ధ ప్రతినిధుల సభ (Third Buddhist Council)

అశోకుడి కాలం ముందునుంచి బౌద్ధ సన్యాసులలో విభేదాలు పొడచూపి ఆయన కాలంలో అవి మరింత తీవ్రమైనాయి. నిజమైన సన్యాసులు-నకిలీ సన్యాసుల మధ్య ఈ విభేదాలు తారాస్థాయికి చేరాయి. దీనిని భరించలేక అశోకుడు అందరు గౌరవించే బౌద్ధ సన్యాసి, పాటలీపుత్ర వాసి అయిన 'మొగ్గలిపుత్ర-తిస్స' ను (Moggaliputta-Tissa) ఆహ్వానించి బౌద్ధ మతాన్ని ప్రక్షాళన చేయమని కోరటం జరిగింది. ఈయన వెంటనే వేలాది నకిలీ సన్యాసులను బహిష్కరించి, కొందరిని బౌద్ధ వస్త్ర-రహితు లుగా చేసి, మరి కొందరిని మట్టుబెట్టి, బౌద్ధ ధర్మాన్ని ప్రక్షాళన గావించాడు. ఆతరువాత 'ఉపోసత' వేడుక (Uposatha ceremony) కార్యాన్ని నిర్వహించాడు.

తదుపరి అశోకుడి ఆజ్ఞతో ఆయన అనేక మంది నిజమైన బౌద్ధ సన్యాసులను ఆహ్వానించి మూడవ బౌద్ధ ప్రతినిధుల సభను అశోకుడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సభలో గౌతమ బుద్ధ ఉపదేశాల గురించి వివరంగా చర్చ జరిగింది. వీటిని అనుసరించి బుద్ధుడు ఉపదేశిం చిన 'తెరవాద (స్థవీరవాద) బుద్ధిజం {Theravada/Sthaviravāda Buddhism; (Sect of the Elders)} కు అత్యధిక స్పందన, మద్దతు లభించింది. సన్యాస జీవితానికి అతి ముఖ్యమైన 'ధ్యానం', 'ఏకాగ్రత' అత్యవసరం అని ఆయన బోధించటం జరిగింది. అప్పటికి ఆయన రాజు అయి 17 ఏళ్ళు పూర్తి అయ్యాయి.

## బౌద్ధ ధర్మ వ్యాప్తి

మొగలిపుత్ర-తిస్స సలహా మీద అశోకుడు పొరుగు దేశాలలో బౌద్ధ ధర్మాన్ని వ్యాప్తి చేయటానికి తొమ్మిది బౌద్ధ ప్రతినిధి భృందాలను క్రీ.పూ. 250 లో పంపించటం జరిగింది. ఒక్కొక్క భృందంలో 5 గురు సన్యా సులున్నారు. అనుభవజ్ఞులైన ఉన్న సన్యాసుల ఆధ్వర్యంలో ఈ భృందాలు వెళ్లాయి. శ్రీలంక కు వెళ్లిన భృందంలో అశోకుడు తన జ్యేష్ఠ పుత్రుడు (ప్రధమ భార్య, పట్టపు రాణి 'దేవి' పుత్రుడు) మహీంద్ర (మహింద)తో పాటు మరో నలుగురు సన్యాసులను (ఇత్థియా, ఉత్థియా, శంబాలా, బద్ధశల) పంపిం చాడు. ఈ భృందం శ్రీలంకకు అశోకుడి పాలనలో 18 వ ఏట వెళ్ళింది.

అదే ఏట (క్రీ.పూ. 250 లో) అశోకుడు ఇటువంటి బౌద్ధ ధర్మ భృందాలను కాశ్మీర్, గాంధార (ఆఫ్ఘనిస్తాన్), హిమాలయ, గ్రీకు, సువర్ణభూమి (బర్మా, థాయిలాండ్), వనవాస (ఉత్తర కెనరా ప్రాంతం: కర్ణాటక), అపరాంతక (పశ్చిమ తీరంలోని కొంకణ రాజ్యం) రాజ్యాలకు కూడా పంపించటం జరిగింది.

పాలనలో 19వ ఏట (క్రీ.పూ. 249 లో) శ్రీ లంక రాజు 'దేవనామప్రియ తిస్స" కోరిక మేరకు అశో కుడు తన పుత్రిక 'సంఘమిత్ర (సంఘమిత్త; మహీంద్ర సోదరి) తో ఒక బోధి వృక్షాన్ని శ్రీలంక పంపించి అచ్చట ఆమెతో నాటించాడు. ఈ బౌద్ధ భిక్షుణి అచట అనేక మంది స్త్రీలను బౌద్ధ సన్యాసినులుగా మార్చటం జరిగింది.

అశోకుడి కృషి వల్లనే అంతర్గత వివాదాలవల్ల, కుమ్ములాటలవల్ల క్షిణించిపోతున్న బౌద్ధ ధర్మం ఒక మతంగా నిలబడిందని చరిత్రకారులు ఘంటాపథంగా చెప్పటం జరిగింది.

బౌద్ధ ధర్మం స్వీకరించినప్పటి నుంచి అశోక మౌర్య ప్రజలలో నైతికత పెంపొందించటానికి
ఆనందం, సంతోషం, సుఖం అత్యవసరం కనుక వాటిని పెంచటానికి గట్టి కృషి చేయటం జరిగింది. ఈ సుఖ సంతోషాలు ఉండాలంటే 'నీతి యెడల మక్కువ, విధేయత, అణకువ, పాపభీతి, అత్యధిక శక్తి, ఉత్సాహం, పరిశీలనా నేర్పు' తప్పని సరి. కానీ ఆయన దృష్టిలో అత్యధిక ప్రజలు ఈ కోవలో లేనందువల్ల, వారికి బోధనలు జరిపి, శిక్షణ ఇచ్చి; వారిని ప్రోత్సహించి; తరువాత వారి ప్రవర్తనలను
పర్యవేక్షించటం జరిగింది. ఈ పని నిర్వహించటానికి భౌద్ధ ధర్మాన్ని పాటించే రాజాధికారులు, మహా
మాత్రలు, తదితర అధికారులను అశోకుడు నియమించాడు.

తాను నమ్మిన బౌద్ధ ధర్మాన్ని కొంతమంది ప్రజలు అనుసరించనప్పుడు, తిరస్కరించినప్పుడు అశోకుడు వారిని హింసలకు బలి చేయటం కూడా జరిగింది. ఈ క్రమంలో నరమేధం భారీగానే జరి గింది. ఆయన కోపానికి ముఖ్యంగా అజీవికలు {(నాస్తికులు; విధిని మాత్రం నమ్మే, (కర్మను-నమ్మని) యాచ కులు)} బలి అయ్యారు. ఈ క్రమంలో సుమారు 18,000 అజీవికలు బలి అయ్యారు. అశోకుడి కోపానికి బలి అయి శిరచ్ఛేదన గావించబడిన వారిలో తన తమ్ముడు (జైన/జీన) మతస్థుడు, తన తల్లి రెండవ పుత్రుడు 'వితాశోక' (Vitasoka) ఒకరు. ఇది తెలిసిన తరువాత అశోకుడు అమితంగా దుఃఖించి తన ఆజ్ఞను ఉపసంహరించటం జరిగింది.

ఇది జరిగిన తరువాత తన అత్యంత హేయమైన పాలనను, అభిప్రాయాలను విసర్జించి దయా పూరిత పాలనను ప్రారంభించటం జరిగింది. అలా అని తన పరిపాలనలో మరణ శిక్ష పూర్తిగా విడ నాడలేదు. ఇది హంతకులకు, దొంగలకు, హేయమైన నేరాలకు పాల్పడినవారికి మాత్రమే పరిమిత మయింది. ఈ శిక్ష అమలు జరిపేముందు ఖైదీకి, అతని బంధువులకు 3 రోజులు వ్యవధిలో నిర్దోషిత్వం నిరూపించుకోవాలి. ఈ విరామం వల్ల ఖైదీ నిరపరాధి అయితే ఆవ్యక్తి మామూలు జీవితం గడపానికి వీలవుతుంది. ఒక వేళ అపరాధి అయితే మరణించే లోపల, దైవ చింతన, ప్రార్ధన, ఉపవాసం, మొద లగు వాటిని అమలుపరచుకోటానికి సమయం ఉంటుంది. ఇవి జరిపితే ఆవ్యక్తికి పైలోకంలో అంతా మంచి జరుగుతుందని నమ్మకం. మరణశిక్ష పట్ల అశోకుడికి చాలా సందిగ్ధత ఉన్నా, దానిని మాత్రం నిర్మూలించలేదు. కాని సుదీర్ఘ పాలనాకాలంలో 25 సందర్భాలలో మాత్రం ఆయన మృత్యుద్వారం వద్ద ఉన్న అనేకమంది ఖైదీలను విడుదల చేయటం, మరి కొందరికి శిక్ష తగ్గించటం జరిగింది.

పరిపాలనలో తనకు తన పితామహుడు, తండ్రికి మధ్య ఉన్న వ్యత్యాసం

అశోకుడు అందించిన అనేక శాసనాల ద్వారా గత పాలకులకు (తన పితామహుడు చంద్రగుప్త, తండ్రి బిందుసార) తనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అన్వేషించటం జరిగింది. వారు 'మానవులలో కేవలం 'నైతికత'ను పెంపొందిస్తే చాలు, వారు పురోభివృద్ధి సాధించగలరు' అనేది కాంక్షించారు. కాని వారు అనుకున్నంతగా సాధించలేకపోయారు.

దీనిని గమనించి, పరిశీలించి వారు ఎచ్చట విఫలం అయ్యారో తెలుసుకున్న తరువాత, తాను

ఏవిధంగా ప్రజల అభివృద్ధిని పెంపొందించగలనో అని ఆలోచించటం జరిగింది. దానికి అను గుణంగా తన ఆలోచనలను, సూచనలను, ఆజ్ఞలను, ఉత్తరువులను శిలా శాసనలద్వారా తెలియ జేసి, వాటి ఆచరణలను తన మంత్రులు, మహామాత్రులు, అధికారులను భాద్యులుగా చేయటం జరి గింది. విఫలాలను మూటగట్టుకున్న అధికారులకు దండనలు విధించటం కూడా జరిగింది.

## భూత దయ

తన ప్రజల యెడల ఎంతో కర్కశంగా ఉన్నా, లక్షలాది కళింగుల మరణానికి కారణమయి, తదుపరి పాలనలో వేలాది బౌద్ధేతర సన్యాసుల ప్రాణాలను హరించిన అశోకుడు జంతువులు, పక్షులు, మత్స్యాల (చేపల) యెడల అత్యధిక దయ చూపించి, వాటి సంరక్షణకు కొన్ని శిలా శాసనాలను ప్రవేశ పెట్టటం జరిగింది. ఇటువంటి శాసనాలు ఆకాలంలో ప్రపంచంలో ఏ రాజ్యంలోనూ, ఏ దేశంలోనూ లేవు. ఈ శిలా శాసనాల మేరకు జంతు బలి, జంతు వధ, నిషేధించబడింది; రాజ వంటశాలలో మాంసాహా

రం వండటం చాలావరకు తగ్గించబడింది; పశు వైద్యశాలలు నెలకొల్పబడ్డాయి; జంతువుల రవాణా కొరకు ప్రత్యేక సదుపాయాలు కలిగించబడ్డాయి. జంతువుల విషయంలో, మాంసాహారం యెడల అశో కుడి 2,270 ఏళ్ల క్రిందటి ఈ ఆలోచనలు, ప్రవర్తన గంగా పీఠభూమిలో ఈరోజుకు కూడా చెక్కు చెదర కుండా నిలబడ్డాయి!!

ఆ కాలంలో వివేకవంతులు, వృద్ధులు ఈ రాజ శాసనం సమస్త జంతు జాతికీ అన్వయించాలని కోరుకున్నారు. కాని అశోకుడు ఈ అభిప్రాయాన్ని సమర్ధించినా ఇది విజయవంతం అవటానికి కొన్ని మినహాయింపులు ఇవ్వటం తప్పనిసరి అని భావించి, కొన్ని సవరణలు చేయటం జరిగింది.

దీని గురించి ఆయన ఇచ్చిన రాజ శాసనం ఈ విధంగా ఉంది. "ఈ నా పాలనలో ***26***వ ఏట (క్రీ.పూ. ***252)*** కొన్ని జంతువుల విషయంలో హింస పూర్తిగా నిషేధం*.* అవి*:* చిలుకలు*,* గోరింకలు*,* ఎర్ర పెద్ద బాతులు*,* అడవి బాతులు*,* గండు చీమలు*,* గబ్బిలములు*,* తాబేళ్లు*,* ఎముకలులేని చేపలు*,* ముళ్ల పందులు*,* అడవి పందులు*,* తెల్ల పావురాలు*,* పెంచుకున్న పావురాలు*,* ఉడుతలు*,* ఎద్దులు*,* ఉడుము

లు*,* ఖడ్గమృగాలు*,* కొన్ని చతుష్పాద జంతువులు*,* మేకలు*,* గొర్రెలు*,* ఆడ గొర్రెలు*,* మగ కోళ్లు *(*పుంజులు*), **6*** నెలలు దాటని అన్ని రకాల జంతువులు*,* మానవ ప్రగతికి సంబంధించిన ఇతర జంతువుల రకాలు."

"జంతువుల శరీరాలపైన పెంకులను *(ఉదాహరణకు: తాబేళ్లు, ముళ్ల పందులు)* కాల్చకూడదు*;* అనవసరంగా*,* జంతువులను నాశనం చేయటానికి అడవులను కాల్చకూడదు*;* బ్రతికున్న జంతువు లకు ఇతర జీవించిఉన్న జంతువులను ఆహారంగా వినియోగించకూడదు. చేపలను పవిత్రమైన చాతుర్మాస్య కాలంలోను *(*జులై నుంచి అక్టోబర్: శ్రావణ*,* భాద్రపద*,* ఆశ్వీయుజ*,* కార్తీక మాసం చివరి వరకు*),* అమావాస్య చివరి రెండు రోజులు *(13–14),* పౌర్ణమి మొదటి రోజున*,* ప్రతి ఉపవాసం రోజున చేప లను పట్టకూడదు*,* భుజించకూడదు. ఎందుకంటే ఈ నాలుగు మాసాలు మత్స్య ఉత్పత్తి సమయం."

"ఈ పుణ్య కాలంలో*,* దినాలలో ఏ ఇతర జంతువుల జాతులను విధించకూడదు. ముఖ్యంగా గజ వనం *(elephant park),* మత్స్యకారుల సంరక్షరణలో ఉన్న చేపలను వధించకూడదు. పక్షం (రెండు వారాలు*)* లో అష్టమి రోజున*,* నెలలో *15* వ రోజున*,* పునర్వసు *(*ఇది అశోకుడి జన్మ నక్షత్రం*)* రోజున*,* చాతు ర్మాస్య రోజులలో*,* పండుగ రోజులలో ఎద్దులకు*,* గొర్రె పోతులకు*,* అడవి పందులకు*,* ఇతర మగ జంతు వులకు 'సుంతీ' *(*బీజ గ్రంధులు తొలగించటం చేయటం*)* నిషిద్ధం. అలాగే ఎద్దులకు వాతలు వేయ కూడదు."

అశోకుడి ఈ ఆదేశాలను అయన అధికారులు, రాష్ట్ర పాలకులు తీవ్రంగా పరిగణించి వీటిని అమలు పరచటానికి తగిన చర్యలు తీసుకొనటం జరిగింది. కాని అసలు అశోకుడు అసలు, సిసల యిన శాఖాహారా లేక శాఖాహార అభిమానియా అనేది నిర్ధారణగా తెలియదు!

ఆ కాలంలో ఉత్తర భారతావని లో ముఖ్యంగా ఉత్తర ప్రదేశంలోని ప్రజలలో అత్యధికులు పశు మాసం, ముఖ్యంగా గేదె మాంసం కు, ప్రాధాన్యత అచ్చేవారు. వీటి తరువాత గొర్రె, మేక మాంసం. వీరిలో కొందరు అడవి జంతువులలో లేడి, అడవి పంది, కొంగ, నెమలి, అడవి బర్రె మాసం కూడా తినేవారు. ఈ అలవాట్లు వల్ల ఆరోజులలో పశు-జంతు సంపద కాల క్రమేణా చాలా తగ్గిపోయింది. ఈ పరిస్థితి క్రీ.పూ. 600-400 నుంచి 400-200 మధ్య జరిగింది. ఈ మొదటి దశలో/కాలంలో 15 జంతు జాతులుంటే అవి రెండవ దశకు 9 జాతులకు దిగిపోయింది. ముఖ్యంగా మౌర్యుల కాలం వచ్చేటప్పటికి మత్స్య జాతి దాదాపు కనుమరుగు అయిపోయింది!

ఈ పరిస్థితిని గమనించే భూత దయామయుడయిన అశోకుడు మత్స్య జాతి, ఇతర జంతు సంపద అంతానికి అడ్డుకట్ట వేసి అహింసకు నాంది పలికినట్లయింది.

----------. . సశేషం ----------.

***వయస్సు మీదపడుతున్న అశోకుడి లో మానసిక ఆందోళన, వేదాంత ధోరణి,***

***రెండవ మహారాణి జోక్యం గురించి వచ్చే సంచికలో తెలుసుకుందాము.***

మీ అభిప్రాయాలు, స్పందన తెలియజేసేందుకు నా ఈ మెయిల్: dr_vs_rao@yahoo. com

# యోగా సాధన – మత్స్యాసనం

సంకలనం — RVR Yogies


**ఊపిరితిత్తులు శుభ్రం చేసే ఆసనం – మత్స్యాసనం**

కరోనా వచ్చిన తర్వాత ప్రజలంతా రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడం లో బిజీగా ఉన్నారు.. ఎప్పటి కప్పుడు వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు.. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ తమ డైట్లో కొన్ని మంచి ఆహార పదార్థాలు చేర్చుకుంటున్నారు.. మంచిదే, అయితే ఆహారం తోనే కాదు యోగాసనాలతో కూడా ఇమ్యూనిటీ పవర్ ను పెంచుకోవచ్చు. అందుకు మత్స్యాసనం ఒక ఉదాహరణ. ఊపిరితిత్తులను శుభ్రం చేస్తే (lungs cleansing).. వాటి సామర్థ్యం పెరుగుతుందని, కోవిడ్ వగైరా వైరస్ ల మూలంగా వచ్చి పడే లంగ్ ఇన్ఫ్లమేషన్ గణనీయంగా తగ్గతుందని పలు పరిశోధనల్లో తేలింది. ఊపిరితిత్తులను శుభ్రం చేయడానికి మన యోగాలో మత్స్యాసనం ఉండనే ఉంది కదా. మరైతే దాని గూర్చి ఈ డిసెంబర్ తెలుగువెలుగు సంచికలో తెలుగుకుందాం.



**మత్స్యాసనం చేయు విధము:**

ముందుగా వెల్లకిలా పడుకోవాలి. కాలు రెండు చాపి నేలపై ఉంచాలి, నడుము పైకెత్తి రెండు చేతులు బోర్లించి మీ పిరుదులు క్రింద ఉంచాలి. కాళ్లను, అరచేతులను అలాగే ఉంచి మోచేతులు ఆసరాగా తీసుకొని ఛాతీభాగాన్ని, తలను మోచేతుల భాగం దగ్గర నుంచి పైకిలేపాలి. తరువాత ఛాతీని బాగా వెనక్కి వంచి తల మాడు భాగం నేలకు ఆనేటట్లు ఉంచాలి. ఈ స్థితిలో నడుముగానీ, వీపుగాని నేలకు ఆనదు. పాదం వేళ్లు ముందుకు చూపాలి. తల మీద బరువు పడకుండా మోచేతుల మీద ఆధారపడాలి. ఈ ఆసన భంగిమలో సాధారణ శ్వాస తీసుకుంటూ ఉండాలి. కళ్లు మూసుకొని ప్రశాంతంగా ఉండాలి. నెమ్మదిగా తల పైకి లేపి, మోచేతులు ఆసరాగా వెనక్కి పడుకోవాలి. కాళ్లు మడచి నడుము పైకెత్తి చేతులు బయటకు తెచ్చుకుని ఆసనం నుంచి బయటకు రావచ్చు. మత్స్యాసనం బాగా వచ్చాక, ఇంకో పద్ధతిలో ఈ ఆసనం వేయవచ్చు. ముందుగా యోగా మ్యాట్ పై పద్మాసనం లో కూర్చోవాలి. పద్మాసనం వేయలేనివారు లేదా ఇబ్బంది గా ఉంటే సుఖాసనంలో కూర్చోవాలి. ఒక్కొక్క మోచేతిని ప్రక్కలకు నేలకు ఆనిస వెల్లకిల పడుకోవాలి. తల వెనుకవైపు భాగాన్ని నేలకు ఆనించి వీపును పైకి ఎత్తాలి. రెండు చేతులతో రెండు కాలి బొటన వ్రేళ్లను పటుకోవాలి. రెండు మోచేతుల్ని నేలకు ఆనించాలి. శ్వాస సామాన్య స్థితిలో ఉండాలి.




**మత్స్యాసనం లాభాలు:**

ఈ ఆసనం వల్ల స్పాండిలైటిస్, మెడ నొప్పులు, శ్వాసకు సంబంధించిన జబ్బులు తగుతాయి. ఊపిరి తిత్తులకు, ఉదర మందలి అవయవాలకు ప్రయోజనం కలుగుతుంది. అపాన వాయువు పోయి ఉదరం శుభ్రపడుతుంది. యోగా వలన శరీరం లోని శక్తి ఉత్తేజితమవుతుంది. ఆరోగ్యకరమైన కణాలను దెబ్బతీసే ఆక్సిడేటివ్ స్ట్రెస్ ను తగ్గిస్తుంది. ప్రాణాయామం కూడా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.  మత్స్యాసనం.. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీన్ని చేప భంగిమ అని కూడా

పిలుస్తారు. దీని వలన శరీరం లోని విషపదార్థాలు ను తొలగిస్తుంది. అదేవిధంగా రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. విపరీత కరణి ఆసనం.. తల, మెడ భుజాల మీద శరీర బరువు వేస్తూ కాళ్లు ఆకాశాన్ని చూస్తూ ఉండే ఈ ఆసనం వల్ల నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. అన్ని శరీర భాగాలకు రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది. ఈ ఆసనాన్ని ప్రతిరోజు వేయడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

“మెడకు, ఛాతికి శక్తి నిచ్చేది మత్స్యాసనం”, కావున పాఠక మిత్రులు మీకు అందుబాటులో ఉన్న యోగా గురువు సమక్షంలో మత్స్యాసనం నేర్చుకోవలసినదిగా విజ్ఞప్తి. స్వంత ప్రయోగాలు చేయడం ప్రమాదకరం సుమా!

★★★★★

# మన ఆరోగ్యం మన చేతుల్లో – మన ఆహారపు అలవాట్లు జీవన శైలి: 4వ భాగం

మధు బుడమగుంట

ఈ రోజు ప్రొద్దున మా అమ్మాయి వాళ్ళ స్కూల్ లో చచ్చిపడి ఉన్న ఒక గబ్బిలం కనపడింది. ఎంతో హడావుడి చేసి చివరకు హెల్త్ ఇన్స్పెక్టర్లు కూడా వచ్చి ఆ గబ్బిలాన్ని అన్ని శవ పరీక్షలు కూడా జరిపి ఏమీ ఇబ్బంది లేదని తేల్చారు. ఎవ్వరూ ఆ గబ్బిలాన్ని చేతితో తాకలేదని కూడా రూఢీ చేసుకొన్నారు. మన పెరట్లో తేనెటీగలు ఉంటే ఎవ్వరం అటువైపు వెళ్ళం. ఎందుకంటే అవి కుడతాయి. తేనెటీగల బారినపడి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే అవే గబ్బిలాలు పొలాలలో ముఖ్యంగా మొక్కజొన్న పంటల సమయంలో ఎంతో ఉన్నతమైన సేవను మనకు అందిస్తాయి. రాత్రిపూట సంచరించే క్రిమి కీటకాదులను ఈ గబ్బిలాలు తినేస్తున్నందున మొక్కజొన్న ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది. అదే పనిని మనుషుల చేత చేయించాలంటే ఎంతో ఖర్చు అవుతుంది. ఒకవిధంగా అది మనకు మిగిలినట్లే. అదేవిధంగా తేనెటీగలు పుప్పొడి రేణువులను తమతో తీసుకెళ్లి పరపరాగ సంపర్కానికి దోహదపడతాయి. ఆ విధంగా మంచి పండ్ల తోటలను పెంచి దిగుబడిని పొందవచ్చు. అయితే చైనాలో తేనెటీగలకు బదులు మనుషులతో ఆ పనిని చేయించే ప్రయోగాన్ని చేపడితే అది మంచి ఫలితాలనే అందించింది. కాకుంటే మానవ శ్రమకు వెచ్చించిన ఖర్చు కూడా ఎక్కువే అయ్యింది.

ప్రకృతిని సక్రమంగా వాడుకొని పర్యావరణ సమతుల్యాన్ని పాటిస్తూ స్వాభావిక సహజ ప్రక్రియల ద్వారా మనం సమాజానికి పనికివచ్చే ఎన్నో సిద్ధాంతాలను అలవర్చుకోవచ్చు. కృత్రిమ విధానాలు మంచి లాభాలను అందించవచ్చు కానీ వాటి వలన ఏర్పడే పర్యవసానాలు కూడా మన జీవితాలను ఎంతో ప్రభావితం చేస్తాయి. ప్రకృతి లో ఉన్న ప్రతి జీవ కణం ఏదో సందర్భంలో ఉపయోగపడుతుంది. మన జీవన ప్రమాణాలను పెంచుతుంది. మన శరీరంలో కూడా కోట్ల సంఖ్యలో ఉన్న జీవ కణాలలో మంచివి, చెడువి మిళితమై ఉంటాయి. మన DNA లో 2 శాతం మాత్రమే మన శరీరం లోని కణాల వృద్ధికి, మన జీవన ప్రక్రియలకు ఉపయోగపడుతుంది. మిగిలినదంతా మన పూర్వీకుల నుండి మనకు సంక్రమిస్తూవస్తుంది. అందులో ఎన్నో రకాల వ్యర్థ కణాలు, వైరస్ లు ఉంటాయి. అయితే అవి యాక్టివ్ గా, చైతన్యంతో ఉండవు. వాటిని నియంత్రించే సామర్థ్యం మన రోగనిరోధక శక్తికి ఉంటుంది. నేడు మనందరం క్రమంతప్పక తీసుకొంటున్న ఫ్లూ షాట్స్ కూడా ఆ ప్రక్రియలో భాగమే. కనుక మనలోని రోగనిరోధక సాంద్రతను స్థిరంగా నిలుపుకొంటే అదే మనలను కాపాడుతుంది. DNA సాంద్రత చెట్లలో మరియు జలచరాలలో మనిషి కన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇది నిజంగా ఆశ్చర్యమే.

మన శరీరం ఒక మహత్తరమైన అద్భుత ప్రపంచం అని మన పూర్వీకులు చెప్పారు. ప్రమాదాలు సంభవించినప్పుడు, శారీరక రుగ్మతలు ఏర్పడినప్పుడు ఏ విధంగా ప్రతిస్పందించాలో లేక రెస్పాండ్ అయ్యి స్థిరత్వాన్ని ఎలా సాధించాలో మన సిద్ధులు చెప్పినట్లే చేసి మనకు ఉపశమనం కలిగిస్తుంది. మనం చేయాల్సిందల్లా కొంచెం నొప్పిని భరించే ఓపిక, సామర్థ్యం

కలిగివుండటం. ప్రతి చిన్న ఇబ్బందికి మందులు ఉన్నాయని మింగుతూ వెళితే అదే పెద్ద ప్రమాదం. అట్లని పూర్తిగా మందులను మానకూడదు. అవసరమైనప్పుడు తప్పనిసరి అనిపించినపుడు వాడవచ్చు. అంతేకానీ చిన్న తలనొప్పికి లేక తలనొప్పి వస్తుందని ముందు జాగ్రత్తగా మందు బిళ్ళలు వాడటం మంచిది కాదని నా అభిప్రాయం. దీనికి ఒక చిన్న పోలిక చెప్పవచ్చు. ఏదైనా ప్రదేశంలో లేక ప్రాంతంలో ఒక చిన్న అసాంఘిక లేక అకృత్యాలు జరుగుతుంటే దానిని నియంత్రించుటకు ఆ ప్రాంత పోలీస్ ఫోర్సు చాలు. అట్లా కాదని మిలిటరీ ఫోర్సు ని దింపితే ఏమౌతుంది. నియంత్రణ సులభమౌతుంది. కానీ ఖర్చు ఆ పై ఇతర ఇబ్బందులు ఏర్పడతాయి. స్థానిక పోలీస్ ఫోర్సు లో కూడా ఒక విధమైన స్తబ్దత ఏర్పడుతుంది. అది మంచిది కాదు. ప్రతి చిన్న రుగ్మతకు లేక సాధారణ జలుబు, దగ్గు కు యాంటీబయాటిక్స్ వాడటం అంత మంచిది కాదు. డాక్టర్స్ కూడా అదే చెబుతున్నారు. మనమే వినకుండా యాంటీబయాటిక్స్ ప్రిస్కైబ్ చేయమని అడుగుతున్నాం. తద్వారా మన శరీరంలోని రోగనిరోధక శక్తిని మనమే తగ్గించుకుంటున్నాం. అయితే మనం ఒక్క విషయం ఇక్కడ ముఖ్యంగా గమనించాలి. ఒంట్లో నలత ఉన్నప్పుడే డాక్టర్ వద్దకు వెళ్ళాలి అనే ఆలోచన మాని, ఒక వయసుకు వచ్చిన తరువాత క్రమం తప్పక చెకప్ చేయించుకుంటే తరువాతి కాలంలో ఏర్పడే సడన్ సర్ప్రైజ్ లను తప్పించుకొనే అవకాశం మెండుగా ఉంటుంది. ఆరోగ్యశాస్త్రం లో నేడు చూస్తున్న అభివృద్ధిని, ఆధునికతను ఉపయోగించుకుంటూనే సంప్రదాయ సహజ పద్ధతులను కూడా అవలంబిస్తే మన ఆరోగ్యం నిజంగా మహా భాగ్యమౌతుంది.

. . . సశేషం

గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

# కథాకదంబం



# ఊహలలో రారాజు

శ్రీ పెయ్యేటి రంగారావు, నార్త్ కెరోలినా

నింగికెగసి విహరించు నా మది

ఱెక్కలున్న ఖగము పగిది ||

తారలతో ఊసులాడును ||

జాబిలితో ఆటలాడును ||

మురళినూదు మురారి కూడ

నా తలపుల నాట్యమాడు ||

కామవైరి హరుని జూడు

ప్రేమతోడ నిలచు తోడు ||

చదువులమ్మ కరుణ మిన్న

నాలుకపై నిలచునన్న ||

సిరులతల్లి వెన్ను వెలది

కలుములిడును ప్రేమ కొలది ||

శివునిజోడు లలిత జూడు

బాలగా నా నీడ నుండు ||

కోరికలిక నాకు లేవు

నా మది పరమాత్మ నెలవు ||

OOO

# మనోనిబ్బరం

శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ

కరుణ మనసు పరిపరివిధాలుగా ఆలోచిస్తోంది. తను వున్న పరిస్థితి తలుచుకుంటే అగమ్యగోచరంగా అనిపించింది. డాక్టర్ దగ్గిర్నించి ఫోన్ వస్తే వర్క్ నించి త్వరగా బైటపడింది. రెండురోజుల క్రితమే డాక్టర్ రాసిచ్చిన బ్లడ్ టెస్ట్ లన్నీ చేయించింది. ఒక ప్రక్క మనసులో ఏదో తెలియని భయం. డాక్టరు ఎందుకు రమ్మన్నట్టు? బ్లడ్ టెస్ట్ రిజల్ట్స్ లో ఏదైనా లోపముందా? తనకి తెలియకుండానే మనసులో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ఊహు....నా మనసులో వీలైనంత వరకు నెగెటివ్ ఆలోచనలు రాకుండా తరిమికొట్టాలి. ముందు డాక్టరు ఏమంటారో చూసి తరువాత ఒక నిర్ణయం తీసుకోవాలి. ఫలితం ఏది వచ్చినా గాని నేను మాత్రం మనోనిబ్బరంగా వుండాలి అనుకుంటూ మొబైల్ లో తనకి నచ్చిన సంగీతం బ్లూటూత్ హెడ్ ఫోన్స్ చెవులో పెట్టుకుని వింటూ హాస్పిటల్ కి చేరుకుంది. రిసెప్షన్ లో తన వివరాలు ఇచ్చింది. డాక్టర్ పిలుపు కోసం నిరీక్షిస్తూ అక్కడ ఉన్న హెల్త్ మ్యాగజైన్ పేజీలు తిప్పసాగింది. ఇంతలో డాక్టరు పిలిచారు.

'కరుణా! ఎలా వున్నారు? ఏమ్మా, మీతో ఎవరైనా వచ్చారా?'

'లేదండీ. మీ నుంచి ఫోను రాగానే వర్క్ నించి బయలుదేరి ఇలా వచ్చాను. ఐనా మా వారు వర్క్ లో ఆడిట్ తో బిజీగా వున్నారు. మీరు చెప్పండి డాక్టర్! ఏం చెప్పినా తట్టుకునే ధైర్యం నాలో వుంది.'

'కరుణా! మీ బ్లడ్ టెస్ట్ రిపోర్ట్ లు అన్నీ వచ్చాయి. కొన్ని టెస్ట్ లకు పాజిటివ్ రిజల్ట్ వచ్చింది.'

మనసులో కరుణ అనుకుంది, 'ఏమిటో! నా మనసు. నేను పాజిటివ్ ఆలోచనలతో నింపుకోవాలని అనుకుంటాను. టి.వి.లో ఏ అఘాయిత్యాలు చూసినా మనసు మళ్ళించుకుని, నా దేశం ఎంతో సుభిక్షంగా ఉంది, ఉంటుంది, ఉండబోతుంది అనుకుంటాను. కాని ఆ పాజిటివ్ నెస్ బ్లడ్ టెస్ట్ రిజల్ట్ విషయంలో ఉండకూడదని పాపం! నా పిచ్చి మనసుకి తెలియదు. అవును మరి! బ్లడ్ రిజల్ట్స్ ఎపుడూ నెగెటివ్ వస్తేనే హమ్మయ్య, ఫరవాలేదు, నాకే రోగమూ లేదు అనుకుని తృప్తి పడతాను. ఇక్కడ శరీరంలో భాగాలన్నిటికీ టెస్ట్ లకి వేలకి వేలు కుమ్మరించినా ఫరవాలేదు గాని, రిజల్ట్ మాత్రం నెగెటివ్ ఉండాలి. చిన్నప్పుడు తను లక్షలు కుమ్మరించి కోచింగ్ లకి వెళ్ళి, పరీక్షలో మంచి ఫలితాలతో నెగ్గుకుంటూ జీవితాన్ని ఇంతవరకూ నెట్టుకుంటూ వచ్చింది. చూద్దాం, ఇప్పుడు డాక్టరేం చెబుతారో? '

'కరుణా! మీరు నేను చెప్పే విషయాన్ని మనసు దిటవు చేసుకుని వినటానికి సిద్ధంగా వున్నారా? లేదంటే మీ ఆప్తమిత్రుడు లేదా బంధువు ఎవరైనా ఉంటే వారితో మాట్లాడతాను.'

కరుణ ఒకపక్క మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా, మనసులో మళ్ళీ అనుమానాల తుంపరలు. డాక్టర్ ఏ రోగం పేరు చెబుతాడో? డెంగ్యూ జ్వరం అంటాడా? లేక హార్మోన్స్ లోపం అని చెబుతాడా? ఒక సంధిగ్ధావస్థలో ఉద్విగ్నస్థితిలో వుంది. గతకొద్ది రోజులుగా ఆకలి మందగించడం, అకస్మాత్తుగా మూడు కేజీలు బరువు తగ్గటం, అలసటగా వుంటూ ఎక్కువగా నిద్రపోవడం – ఈ మార్పులు చూసి ఎందుకైనా మంచిది అని డాక్టర్ ని సంప్రదించగానే కొన్ని బ్లడ్ టెస్ట్ లు, మామ్మోగ్రాం చేయించుకోమన్నారు. డబ్బుకి వెనకాడకుండా, తు.చ. తప్పకుండా అన్ని టెస్ట్ లూ చేయించుకుంది. పాపం! ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది.

ఇటు డాక్టర్ దయానంద్ కరుణ హావభావాలను చదువుతూ ఆమెను తను చెప్పబోయే వార్తను విని తట్టుకునే శక్తి కలగడానికి సిద్ధం చేయాలని ప్రయత్నిస్తున్నాడు.

'కరుణా! ధైర్యంగా వుండి ట్రీట్ మెంట్, మెడికేషన్ తీసుకుంటే తప్పకుండా బైట పడగలరని భావిస్తున్నాను. మీకు బ్రెస్ట్ కేన్సర్ డయాగ్నైజ్ అయింది. డాక్టర్ గా మేము చేయవలసింది చేస్తాము.'

ఒక్కసారిగా కరుణ తన చెవులను తాను నమ్మలేకపోయింది. మళ్ళీ కన్ ఫర్మ్ చేసుకోడానికి అడిగింది, 'ఏమంటున్నారు మీరు? నాకు కేన్సరా? నిజంగానా? నమ్మలేకపోతున్నాను డాక్టర్!'

'కరుణా! తప్పదు ఈ నిజం చెప్పాలి. ఒకటికి పదిసార్లు నేను చెక్ చేసి మీకు కన్ఫర్మ్ చేస్తున్నాను. ఈ పరిస్థితిలో మీనించి పూర్తి సహకారం, బ్రతకగలననే ధైర్యం మీలో నింపుకుంటే మీరు ఈ మహమ్మారి నించి బయటపడగలరు. గతంలో నేను ట్రీట్ చేసిన పేషెంట్లు బయటపడిన వారు కూడా వున్నారు.'

వైద్యుడిని దేముడి తరవాత దేముడంటారు. కరుణ వైద్యుడిని తను పూజించే షిర్డి సాయిబాబాగా భావిస్తుంది. వైద్యుడి దగ్గిర ఏ విధమైన భేషజం లేకుండా రోగలక్షణాలు చెప్పాలి. మగ, ఆడ అన్న తేడా వైద్యుడిలో చూడకూడదు. ఆఖరికి ఎంత లేడీడాక్టర్ దగ్గిరకి అని వెళ్ళినా ఒక్కోసారి వాళ్ళు కొన్ని కేసులు రిజిస్ట్రార్ కి రిఫర్ చేయడం జరుగుతుంది. ఈ మధ్యకాలంలో చాలామటుకు గైనకాలజీలో మగడాక్టర్లు కూడా స్పెషలైజ్ చేస్తున్నారు.

కరుణ తనని తాను మామూలు స్థితిలో వుంచుకోటానికి ప్రయత్నిస్తూ అంది, 'డాక్టర్! ఇప్పుడేమిటి చెయ్యటం? ఈ నిజాన్ని నా భర్త తట్టుకోలేరు. నేను నా ఆప్తమిత్రుల సాయం తీసుకోవాల్సి వుంటుంది. నా భర్తకి మటుకు ఈ నిజం చెప్పను.'

'కరుణా! మీ బాధ నాకు అర్థం అయింది. నా మీద నమ్మకం వుంచండి. మీ ప్రైవసీకి ఏ విధమైన భంగం కలగదు. నా వంతు సహకారం మీకు ఎప్పుడూ వుంటుంది. మీరు చేయవలసిందల్లా కీమోథెరపీకి ఆస్పత్రిలో త్వరగా అడ్మిట్ అవాలి. దానికి తగ్గ డబ్బు మీరు డిపాజిట్ చెయ్యాల్సి వుంటుంది. మీకు తోడుగా ఎవరినైనా తెచ్చుకోవచ్చును.'

డాక్టర్! మీరు రిపోర్ట్ ఇస్తే వర్క్ లో సిక్ లీవ్ అప్లై చేసి డబ్బు సమకూర్చుకుంటాను. వెంట నా స్నేహితుడిని తీసుకువస్తాను. వాళ్ళకి మీరు విషయాలు ఎప్పటికప్పుడు అందజేయవచ్చు.'

'కరుణా! దటీజ్ ద స్పిరిట్! మీ పాజిటివ్ ఏటిట్యూడ్ నాకు నచ్చింది. నేను ఇప్పుడే డాక్యుమెంట్స్ మీ జాబ్ కి అవసరమైన వివరాలతో ఇస్తున్నాను. ఈ వ్యాధి ఎర్లీ స్టేజ్ లో వుండటం వల్ల సరైన సమయంలో ట్రీట్ మెంట్ తీసుకుంటే తప్పకుండా మీరు మామూలు మనిషి కాగలరు. ఆల్ ది బెస్ట్!'

కరుణ ఆస్పత్రి నించి బైటపడి పక్కనే వున్న కేంటీన్ లోకి అడుగులేసింది. వేడిగా ఒక టీ ఆర్డర్ చేసింది. చుట్టూ వున్న వ్యక్తుల్ని చూస్తూవుంటే వాళ్ళంతా ఎంత ఆనందంగా వున్నారో కదా అనిపించింది. తన పరిస్థితి చూస్తే తనకే జాలి వేసింది. ఇంతలో బేరర్ టీ తీసుకురాగానే కాసేపు ఆలోచనలని జోకొట్టి, వేడి వేడి టీని రంగు, రుచి, సువాసనలతో ఆస్వాదిస్తూ తాగింది. 'నిజంగా మస్తిష్కంలో జరిగే తర్జనభర్జనలకు ఈ తేనీరు ఎంత చక్కటి రిలీఫ్! మెదడులో పజిల్ గా ఉన్న చిక్కుముడులన్నింటికీ ఒక పరిష్కారాన్ని అందిస్తోంది నా ఈ మధురమైన చాయ్!'

కరుణ టీ తాగాక తను కూడా ఇప్పుడు మిగతా వారిలానే ఆనందంగా వున్న అనుభూతికి లోనయింది.

'నేను ఇప్పుడు ధైర్యంగా నాకొచ్చిన సమస్యను ఎదుర్కోగలను. ఏమైనా సరే పోరాడుతాను. క్రికెటర్ యువరాజ్ సింగ్, తనకిష్టమైన హీరోయిన్ మనీషా కొఇరాల వీళ్ళంతా ధైర్యంగా కేన్సర్ నుండి బయట పడ్డారు కదా. ఇక ఆపై భగవంతుడు, ఆ జగన్మాత నాకు తోడు ఉన్నారు.' అని తనకి తను ధైర్యం చెప్పుకుంది.
వచ్చిన చిక్కల్లా భర్త కు తెలీకుండా జాగ్రత్తగా మెనేజ్ చేయాలి. ఇపుడిపుడే తల్లి పోయిన బాధనుంచి తేరుకుంటున్నాడు. చాలా సున్నిత మనస్కుడు. దానికి తోడు ఉన్న ఒక్కగానొక్క కొడుకు పదవ తరగతి పరీక్షలకు ప్రిపేరవుతున్నాడు.
తన కొలీగ్ సూర్యానికి ఫోన్ చేసి తన ఆరోగ్య పరిస్థితి, ఇంట్లో పరిస్థితి గురించి వివరంగా చెప్పింది. సూర్యం చిన్ననాటి స్నేహితుడు మరియు వర్క్ లో వేరే డిపార్టుమెంట్ లో చేస్తున్నాడు. తనని సిస్టర్ అంటూ ఎంతో అభిమానంగా ఆదరించే మనిషి.
'కరుణా! ధైర్యంగా ఉండు. నీకేమి కాదు అని సూర్యం భరోసా ఇచ్చాడు.'
సూర్యంతో మాట్లాడాక కరుణకి పూర్తి భారం దిగినట్టుగా అనిపించింది.
ఇంట్లో వేళకి పనిమనిషి సత్తెమ్మ, వంటమనిషి రాజ్యం ఉన్నారు కాబట్టి ఈ ట్రీట్మెంట్ సమయంలో తను లేకపోయినా భర్తకి, కొడుకుకి ఇబ్బంది కలగదు అనుకుంది.
ఇంటికి వెళ్ళగానే తనకు అవసరమైన వస్తువులు,బట్టలు పెట్టెలో సర్దుకుంది.
భర్త ఆనంద్, కొడుకు కిరణ్ రాగానే తను 'ప్రోజెక్ట్ వర్క్ మీద కొన్నాళ్ళు ఫీల్డ్ వర్క్ కోసం మూడు నెలలు మీకు దూరంగా వెళ్ళాల్సి ఉంటుంది. నేను మీకు ఫోన్ లో దొరకను. పని కాగానే వచ్చేస్తాను. మీ ఇద్దరి సహకారం కావాలి నాకు ఈ విషయంలో' అని చెప్పింది. భర్త, కొడుకు మొదట్లో కాదన్నా, తరువాత ఒప్పుకున్నారు.
ఆ మరునాడే ఆఫీస్ కి వెళ్ళి పేపర్ వర్క్ పూర్తిచేసి, సిక్ లీవ్ తీసుకుంది. కావలసిన డబ్బు సమకూర్చుకుంది. తరువాతి రోజు సూర్యాన్ని నేరుగా హాస్పిటల్ కి రమ్మంది కరుణ.
డాక్టర్ కి సూర్యాన్ని పరిచయం చేసింది. హాస్పిటల్ లో అడ్మిట్ అయ్యింది అదే రోజు.
డాక్టర్ తో పాటు, ఇతర అసిస్టెంట్ డాక్టర్స్, క్లినికల్ నర్స్ కలిసి ట్రీట్మెంట్ విధానము, ఒక్కో స్టేజ్ కి ఎంత సమయం పడుతుంది అన్ని వివరంగా కరుణతో, సూర్యం తో చర్చించారు.
'మొదటగా ట్యూమర్ తీసివేయడానికి సర్జరీ చేస్తా ము. ఆ తరువాత రేడియేషన్ థెరపీ, మరియు డ్రగ్ థెరపీ ఇస్తాము. సుమారుగా మూడు నెలలు సమయం పడుతుంది.
'ప్రతి దశలోను, మీరు రెస్పాండ్ అయ్యే తీరు, మీ శరీరం ఎలా తట్టుకుంటోందో పరిశీలిస్తూ ఉంటాము. మిమ్మల్ని చూసుకోవడానికి క్లినికల్ నర్స్ సరోజను ఏర్పాటు చేసాము.'
సూర్యం అన్ని జాగ్రత్తగా విని, తన అవసరం ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు రావాలో తెలుసుకుని కరుణకు మానసికంగా ధైర్యాన్ని చెప్పాడు. మెల్లిగా కరుణను ఆపరేషన్ థియేటర్ కి తీసుకెళ్ళడానికి స్టాఫ్ రెడీ అవుతున్నారు.
కరుణ మనసు నిర్మలంగా ఉంచుకుంది. తనకు జన్మనిచ్చిన తల్లితండ్రులను, అత్త మామలు, భర్త, కొడుకు, ఇష్టదైవాన్ని తలుచుకుంది.

'నేను ఈ భూమిమీద జన్మ ఎత్తడం నేను చేసుకున్న పుణ్యం. నా బాధ్యతలు అన్ని పూర్తి చేసుకున్నాకనే నేను నా తనువును విడిచిపెట్టడం జరుగుతుంది. నేను చేయవలసిన సత్కార్యాలు ఎన్నో ఉన్నాయి. నాకు ఆ భగవంతుడి అనుగ్రహం ఉంది.' అని మనసులో అటో సజెషన్స్ ఇచ్చుకుంది.

సర్జరీ చేసి ట్యూమర్ ని తొలగించారు డాక్టర్లు. మెల్లిగా స్పృహలోకి వచ్చింది కరుణ. శరీరం అంతా తేలికగా, ఒక పెద్ద భారాన్ని తీసివేసినట్టుగా హాయిగా అనిపించింది. డాక్టర్లు, నర్సులు ఎప్పటికప్పుడు అబ్జర్వేషన్స్ చెక్ చేస్తున్నారు.

ఆ తరువాత ఆమెను రేడియేషన్ థెరపీకి సంసిద్ధం చేసారు.

తను ప్రతి నిత్యం అవలంబించే మెడిటేషన్ మహిమో ఏమో కాని, కరుణ నెమ్మది, నెమ్మదిగా నిశ్చల స్థితి లోకి వెడుతూ మరింత ధైర్యాన్ని పుంజుకుంది. రేడియేషన్ థెరపీ కావడానికి, పెయిన్ ఫుల్ ప్రొసీజర్ ఐనా కాని, భగవంతుని నామం నిరంతరం మనసులోనే జపించుకోసాగింది. ఆమె ఆత్మస్థైర్యానికి డాక్టర్లు,నర్సులు అబ్బురపడ్డారు.

ఈ రేడియేషన్ థెరపీ జరుగుతున్న సమయంలో కరుణ చక్కని నల్లని కురులను కోల్పోయింది. మనిషి సన్నబడిపోయింది. సూర్యం వీలు ఉన్నప్పుడల్లా కరుణను చూసి, బాగోగులు విచారించి వెడుతున్నాడు.

కరుణకు ఈ మధ్య పదే పదే భర్త, కొడుకు మనసులో మెదులుతున్నారు. డాక్టర్ దయానంద్ విజిట్ కి వచ్చినపుడు అడిగింది. 'ఎలా ఉంది డాక్టర్ ఇప్పుడు నాకు?'

'కరుణా! నిజంగా అనుకున్నదానికన్నా నువ్వు చాలా బాగా రికవరీ అవుతున్నావు. త్వరలోనే నువ్వు మామూలు మనిషి అవుతావన్న నమ్మకం నాకుంది. '

'ఐతే డాక్టర్ ఒకసారి నేను ఇంటికి వెళ్ళవచ్చా?'

'ప్రస్తుతం మేము వాడుతున్న మందులు ఆపి చూద్దామనుకుంటున్నాము. నువ్వు మళ్ళీ వారం రోజులలో రావాల్సి ఉంటుంది.'

'ఆ మాట చాలు డాక్టర్. ఐతే రేపే ఒకసారి నా భర్తను, అబ్బాయిని చూసుకోవడానికి వెడతాను.'

డాక్టర్ రిపోర్ట్స్ చెక్ చేసి, మరోసారి జాగ్రత్తలు చెప్పి వెళ్ళాడు.

కరుణ నర్స్ సాయం తీసుకుని, తలకు విగ్గు పెట్టుకుని ఒకసారి అద్దంలో తన మొహం చూసుకుంది. మనిషి చూడటానికి సన్నబడి, విగ్గు వల్ల కాస్త మోడ్రన్ గా కనబడుతోంది. భర్తకు ఏ మాత్రం అనుమానం రాదు అనుకుంది.

క్యాబ్ బుక్ చేసుకుని ఇంటికి బయలుదేరింది. ఇంటికి వెళ్ళగానే కాలింగ్ బెల్ కొట్టింది. ఆ సమయంలో భర్త టివి చూస్తున్నాడు. కొడుకు ఎసైన్మెంట్ వర్క్ చేసుకుంటున్నాడు.

ఆనంద్ మొదట కరుణను పోల్చుకోలేకపోయాడు.

'ఓ కరుణా? వస్తున్నట్టు ఫోన్ చేయలేదేమిటి? చాలా మారిపోయావ్?'

ఆనందంగా కన్నీళ్ళు పెట్టుకుంటు 'ఎలా ఉన్నారండి?' అంటూ వెళ్ళి కొడుకుని హత్తుకుంది.

ఇంతలో సూర్యం ఫోన్ చేసి 'క్షేమంగా చేరావా కరుణా? అని కనుక్కున్నాడు.

భర్త ఆనంద్ కాస్త ముభావంగా ఉండటం గమనించింది. 'భగవంతుడా! ఇంటికి అనవసరంగా వచ్చానా? ఈయన ఒక్క మాట మాట్లాడటం లేదేమిటి? ఇంట్లో నా స్థానాన్ని, గౌరవాన్ని కోల్పోయానా?' అనుకుంది.

ఆ రెండు రోజులు వారి మధ్య నిశ్శబ్దమేలింది.

కరుణ ట్రీట్మెంట్ ఐన తర్వాత నుండి మానసికంగా మరింత బలవంతురాలైంది. తను క్యాన్సర్ తో పోరాడిన మీదట, ఇప్పుడు జరిగిన సంఘటన చాలా చిన్న విషయంలా అనిపించింది.

ఏ బాధ, గాయం నయమవ్వాలన్నా కొంత సమయం, పెర్సనల్ స్పేస్ తీసుకుంటే మనిషి మళ్ళీ మామూలుగా అవ్వవచ్చు. ఆనంద్ విషయంలోను అదే జరిగింది. తల్లి పోయిన బాధనుంచి కోలుకున్నాడు గాని, ఆ స్థానంలో భార్య దూరంగా ఉండటంతో ఎన్నో సందేహాలు మొదలయ్యాయి.

'ఇన్నాళ్ళూ నిజంగా కరుణ జాబ్ కోసమే వెళ్ళిందా? ఒకసారి ఆఫీస్ కు ఫోన్ చేస్తే లీవ్ లో ఉందన్నారు. ఇప్పుడు ఆమె అవతారం చూస్తుంటే ఏమిటి నల్ల జుట్టు బాబ్ హెయిర్ కట్? ఏ సందర్భం లేకుండా ఏమిటి కొత్త అవతారం?

ఇంటిపని మీద కూడ ఈ రెండు రోజులు ధ్యాస పెట్టడం లేదు. వచ్చిందన్న మాటే గాని హాయిగా ఏమి పట్టనట్టు నిద్రపోతోంది. కనీసం నాకు కోపం వచ్చిందా, దగ్గరకొచ్చి అనునయించే ప్రయత్నం కూడా చేయడం లేదు.

ప్రేమించి తనను పెళ్ళి చేసుకున్నాను. ఇద్దరి మధ్య ఏ రహస్యాలు లేవని నమ్మాను.

నాతో అన్నివేళలా స్నేహితురాలి లా, ప్రియురాలిలా జీవితాన్ని పంచుకున్న నా కరుణ ఇప్పుడు ఎందుకు ఇలా ప్రవర్తిస్తోంది? ఈ మౌన పోరాటం నా వల్ల కాదు. పొద్దున్నే అడిగేస్తాను' అని మనసులో ధృఢంగా అనుకున్నాడు.

కరుణ లేవగానే సత్తెమ్మ, రాజ్యం తో కబుర్లు చెప్పింది. కొడుకు చదువు గురించి పరీక్షలు ఎలా రాస్తున్నాడో అడిగి తెలుసుకుంది.

భర్త కోపం వస్తే వెంటనే మాట్లాడడని తెలుసు. అందుకే ఆనంద్ ను పలుకరించలేదు.

'ఏమండీ! నేను ప్రోజెక్ట్ వర్క్ మీద మళ్ళీ వెళ్ళాలి రేపు.'

'నిజంగా నువ్వు ఆఫీస్ పనిమీదే వెడుతున్నావా?'

'అవును, నేను వెళ్ళడం చాలా అవసరం'

'నువ్వు వెళ్ళకుండా వుండడం నాకు చాలా అవసరం.'

'ఏమండీ, ఈ ఒక్కసారికీ నన్ను వెళ్ళనివ్వండి.'

ఆనంద్ లో ఆవేశం ఒక్కసారిగా ఎగదన్నుకు వచ్చింది. 'ఇంక ఈ నాటకాలు కట్టిపెట్టు కరుణా! నేను నీకు ఉల్లి చవటలా కనిపిస్తున్నానా? ఇంక నావల్ల కాదు. ఇపుడిపుడే అమ్మ పోయిన బాధను దిగమింగుకుని మామూలు మనిషిని కావడానికి ప్రయత్నిస్తున్నాను . నాకు వ్యవధి లేకుండా నీ నుంచి ఈ దెబ్బ ఏమిటి?

కరుణ బిత్తరపోయింది. 'ఏమండీ! ఏమిటి, అలా మాట్లాడుతున్నారు?'

ఆనంద్ గట్టిగా అరిచాడు, 'ఇంకెలా మాట్లాడమంటావు? నేను నిన్ను అనుమానించేంత హీనుడను కాను. నువ్వే నా సర్వస్వమని నమ్మాను. నీకు నాకు మధ్య ఇప్పుడు ఒక అగాధము ఏర్పడింది. నాకు ఏంజరుగుతోందో, నిజమేమిటో తెలియాలి. ఏమిటి అర్థం, పర్థం లేని ఈ కొత్త అవతారం? ఎవరా సూర్యం? అసలేం జరుగుతోంది?

వారం రోజుల క్రితం మీ ఆఫీసుకు ఫోన్ చేసాను. నువ్వు సెలవులో ఉన్నావని, కొన్నాళ్ళ నించి ఆఫీసుకు రావటల్లేదని చెప్పారు. ఇన్నాళ్ళూ ఎక్కడికెళ్ళావో నాకు తెలీదు. దేనికి వెళ్ళావో అది కూడా తెలీదు. ఇంటికొచ్చినట్లే లేదు. అప్పుడే మళ్ళీ ఏదో ప్రాజెక్ట్ వర్కు ఉందంటూ మళ్ళీ ఎక్కడికో వెళిపోతున్నావు. నన్ను మోసం చెయ్యాలని నీకెలా అనిపించింది కరుణా?'

'ఏమండీ, నేను మిమ్మల్ని మోసం చెయ్యటల్లేదండి.'

'మరి ఈ అబద్ధాలన్నీ ఏమిటి? మన మధ్య ప్రేమ వుంది, స్నేహం వుంది. మనం ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం బాగా అర్థం చేసుకున్నామన్న భావనలో నేను వున్నాను. అటువంటిది ఈ రోజున నా నుంచి నువ్వు ఏదో దాస్తున్నావు. మన మధ్య కూడా చెప్పుకోకూడని రహస్యాలు, దాపరికాలు వున్నాయా కరుణా?

నాకు నిజం చెపుతావా, ఏ ఏట్లొనో దూకమంటావా? '

మీరు ఇంత మాటఅన్నాక, ఇంత దూరమొచ్చాక నాలో దాచుకున్న ఈ అగ్నిగుండాన్ని బయట పెట్టాలి. దాన్ని తట్టుకునే ధైర్యం మీకుందా? మీకు తట్టుకునే ధైర్యం, శక్తి ఉంటే నేను చెప్పగలను.

'ప్రతి రోజు నిజమేమిటో తెలియకుండా, ఛస్తూ బతికే కన్నా అసలు విషయమేమిటో తెలియడమే మంచిది.

కరుణ కళ్ళనుంచి కన్నీరు ఉబికి వచ్చింది. అది దుఃఖంగా మారి వెక్కి వెక్కి ఏడవసాగింది.

ఆనంద్ కొంచెం చల్లబడ్డాడు. 'కరుణా! నిన్ను నేను అనుమానించటల్లేదు. నేను నీ భర్తగా కాదు, స్నేహితుడిగా అడుగుతున్నాను. ఏమిటి నీ సమస్య? అసలేం జరుగుతోంది? రహస్యంగా బ్రతకాల్సిన అవసరం నీకేమొచ్చింది? నాతో చెబుతే నేను నీకేమన్నా సాయపడతానుగా?'

'మీకు చెప్పకూడదనే అనుకున్నానండి. కాని ఇవాళ ఇలా నిలదీసి అడుగుతూంటే, ఇంక మీ నుంచి ఏదీ దాచాలనిపించటల్లేదు. మీరు, బాబు నాకు భగవంతుడు ప్రసాదించిన వరం. మీ ఇద్దరికీ నేను దూరం కాలేనండి.'

'కరుణా! ప్లీజ్! కాస్త వివరంగా చెప్పు.'

'కొంచెం నలతగా వుంటోందని డాక్టరు దగ్గిరకి వెళ్ళాను. డాక్టరు నాకొక భయంకరమైన నిజం చెప్పాడు. నాకు... నాకు బ్రెస్ట్ క్యాన్సర్. మీకు దూరం కాకూడదనే ఎదురొడ్డి పోరాడుతున్నాను. ఈ నిజం మీకు తెలిస్తే ఏ మౌతారో అని నాలో నేనే కుమిలిపోయాను.

చెప్పండి, అసలే బాధలో ఉన్న మీకు ఈ విషయం చెప్పితే మీరు తట్టుకోగలరా? నాకు మెంటల్ సపోర్ట్ ఎవరిస్తారు?

'అవునండీ. విధినే ఎదిరించాలనుకుంటున్నాను. ఆత్మవిశ్వాసంతో ఆస్పత్రిలో చేరి గత కొద్దిరోజులుగా ట్రీట్ మెంట్ తీసుకుంటున్నాను. జుట్టు ఊడిపోయింది. అందుకే విగ్గు పెట్టుకుని వచ్చాను. నాకు అన్నలాంటి సూర్యం చేదోడు వాదోడుగా ఉంటూ నాకు ఈ మూడు నెలలు సహకరించాడు.'

ఆనంద్ నిర్ఘాంతపోయాడు. 'కరుణా! ఏమిటి నువ్వంటున్నది? నువ్వు నా ప్రాణంలో ప్రాణానివి, నువ్వు నాకు దూరమౌతున్నావనే బాధతో ఇలా మాట్లాడాను. ఇన్నాళ్ళూ అమ్మ పోయిన బాధతో నువ్వు ఎలా ఉన్నావో కూడా చూడలేకపోయాను. నీ మనసును బాధ పెడితే నన్ను క్షమించు. నా అతి సున్నిత స్వభావంతో ఇన్నాళ్ళు నిన్ను సరిగా అర్థం చేసుకోలేకపోయాను.'

'ఇప్పుడు మళ్ళీ ఆస్పత్రిలో చేరడానికే వెళుతున్నాను. నాకు ఆత్మవిశ్వాసం వుంది. బలమైన నమ్మకం ఉంది. నా ఆత్మవిశ్వాసం, నా చెరిగిపోని ధైర్యం నన్ను తప్పక బ్రతికిస్తాయన్న నమ్మకంతోనే తిరిగి ఆస్పత్రికి వెళ్తున్నాను. నన్ను నమ్మండి. నేను ఖచ్చితంగా సంపూర్ణారోగ్యంతో తిరిగి వస్తాను.'

'కరుణా! నీకేమి కాదు. నీకు పూర్తిగా నయమవుతుంది.పద! మిగతా ట్రీట్మెంట్ కి వెడదాం.నీ వెంట నేనున్నాను.'

ఇపుడు ఆమె మనసు దూదిపింజంలా తేలికగా ఐపాయింది. తనను ఏ వ్యాధి ఏమి చేయలేదు. అన్నిటిని దాటుకుంటు వచ్చేసాను. నా భర్త తోడు నాకుంది. నేను బ్రతకాలనుకున్నంత కాలం ఆనందంగా బ్రతికేస్తాను.

అవును! నాకు బ్రతకాలనుంది! అని ఆనందగా అనుకుంటూ భర్తతో మనోనిబ్బరంతో హాస్పిటల్ కి బయలుదేరింది.

**(జాగృతి వారపత్రిక డిశెంబర్ 2, 2019 సంచికలో ఈ కథ ప్రచురితమైనది)**

గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

# కవితాకదంబం



# చేయెత్తి "జై" కొట్టి చెప్పు తెలుగువాడా! – వచన కవిత

..వెంపటి హేమ

ఇంటింటా ఉంటాయి ఇంగ్లీషు డిక్షనరీలు, కానీ

తెలుగు నిఘంటువు కావాలంటేమాత్రం వెతకాలి!

కన్నతల్లిని కసిరికొట్టి, సవతి తల్లిని సాకుతున్నావు!

"అమ్మా" అనడం అపచారం, "నాన్నా" అంటే నామోషీ–

"మమ్మీ!, డాడీ!" అన్న పిలుపులే మహా పసందౌతాయి!

ఆంగ్లపదం రాకుండా అరవాక్యమైనా పలుకలేవు కదా!

తల్లిభాష మాటాడే తరుణము రాదాయె నీకు!

ప్రాచీన గ్రాంథిక మసలు పనికిరాదు పొమ్మంటివి,

శిష్టవ్యవహారిక మెపుడో శంకరగిరి మన్యాలు పట్టె!

మాండలికాలు సొంతం మరచిపోయి కూర్చుంటివి.

నేటి వ్యావహారిక భాష మొత్తం ఆంగరేజీ సంకరం!

తీయనైన తెలుగుభాష తీరే మారిపోయింది,

ఇకనైనా కళ్లుతెరిచి ఇంటిపరువు నిలబెట్టుకో –

అక్షర రమ్యత కలిగిన అందమైన భాష మనది,

తేనెలోని మధురిమలు తెలుగుభాషకే స్వంతం,

అచ్చుల శబ్దంతో పదం ముగియు అరుదైన భాష!

"ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అంటూ మన భాషను

పర భాషతో పోల్చి ఎవరో వచ్చి మనకు చెప్పాలా?

అదీ తెలియని అయోమయంలో మన మున్నామా?

"దేశభాషలందు తెలుగు లెస్స"ని చెప్పె మహారాజు!

"లెస్స"న్నది కూడా తెలుగేనని లెస్సగ వివరించి,

ఇకనైనా, చేయెత్తి "జై" కొట్టి చెప్పు తెలుగువాడా,

గతమందు ఘనమైన కీర్తి కలిగున్న మగధీరా!

**(ఈ కవితను గతంలో కలకత్తా తెలుగు ప్రవాసీ సంఘం వారు ప్రచురించారు)**

# జాగ్రత్త వహించాలి

.. దినవహి సత్యవతి

నీలిమేఘాలనుండి, మంచుకొండల నుండి,

భూగర్భమునుండి నిత్యమూ ఉద్భవించి,

ధరను సస్యశ్యామలం చేసి హరితవర్ణాన్నిచ్చి

జీవకోటి మనుగడకి మూలాధారమయియున్నది!

భానుడి ప్రకోపానికి గురియై నెలవులలో క్షీణిస్తూ,

బోరుబావులు తోడివేయ భూగర్భాన ఇంకిపోతూ,

భువిని నా నెలవులు దురాక్రమణకు గురియౌతూ

ధరణిలో నిలువ నెలవు కరువై సాగరాల చేరుతూ,

భూతలాన క్రమేపీ ఉనికిని కోల్పోతున్నది!!

చెరువులు పూడిక తీసీ, ఇంకుడు గుంటలు నిర్మించీ,

నదులను అనుసంధానించీ నీటి నెలవులు సంరక్షించీ,

దాహార్తికి కడివెడు నీరు కొనడం కోసం రూకలిచ్చే దుస్థితి

రానీయక నీటిని పరిరక్షించుకొమ్మని హెచ్చరిస్తున్నది!!!

ఓ మానవుడా!

నీటికై అంతర్యుద్ధాలు చెలరేగే దుస్థితి రానీయవద్దు!

భావితరాల మనుగడకై నీటిని మిగుల్చుకోవాలి!

సమయం మించిపోక మునుపే మేలుకోవాలి!

జల ఘోష శ్రద్ధగా ఆలకించి జాగ్రత్త వహించాలి!

OOO


గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం
TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO
A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

# బాలకదంబం



# పిల్లల కోసం ఒక పుస్తకం

G. S. S. కళ్యాణి




హలో పిల్లలూ. . . !

మీకు కథలంటే ఇష్టం కదూ? శాక్రమెంటోలో ఉంటున్న ఎనిమిదేళ్ల శ్రీరామ్ కి కూడా కథలంటే చాలా ఇష్టం. కొత్తకొత్త కథలను ఊహించి చెప్పడం నాలుగేళ్ల వయసులోనే మొదలుపెట్టాడు శ్రీరామ్. గత ఏడాది శ్రీరామ్ రాసిన పది చిట్టి చిట్టి కథలను 'Ten Stories For Kids' అనే పేరుతో ఒక పుస్తకంగా ప్రచురించడం జరిగింది. ఈ కథలలో కొన్ని మిమ్మల్ని నవ్విస్తాయి. మరికొన్ని మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఇంకొన్ని మీకు మంచి సందేశాలను ఇస్తాయి. 'Ten Stories For Kids'

పుస్తకం ఇప్పుడు BN. Com website ద్వారా e-book ఫార్మాట్లో అందరికీ అందుబాటులో ఉంది. మీరు ఈ పుస్తకంలోని కథలు చదివి మీ అభిప్రాయాన్ని రచయితతో పంచుకుని, మరిన్ని కథలు రాయడానికి చిన్నారి శ్రీరామ్ కు చక్కటి ప్రోత్సాహాన్ని ఇస్తారని ఆశిస్తున్నాను.

**పుస్తకం పేరు : Ten Stories For Kids**

**రచయిత పేరు : శ్రీరామ్ వి. గుండమరాజు**

**వెల : $ 0. 99**

**లంకె :**


https://www. barnesandnoble. com/w/ten-stories-for-kids-sriram-gundamaraju/1142507282?ean=2940186775621

**లేదా** https://tinyurl. com/GundamarajuBook

**మరిన్ని వివరాలకు సంప్రదించండి:** SriramGundamaraju@gmail. com

# శాక్రమెంటోలో మనబడి తరగతులు

**--నాగ్ దొండపాటి**



శాక్రమెంటో పరిసరప్రాంతాలలో ఉన్న మనబడి సెంటర్లకు తోడు ఎల్క్ గ్రోవ్ నగరంలో మరో మనబడి సెంటర్ నెలకొల్పాలని మనబడి కార్యవర్గం వారు కృషి చేస్తున్నారు. మనందరం తలో చెయ్యి వేసి వారికి సాయపడదామా?



2021-2022 వ విద్య సంవత్సరానికి శాక్రమెంటో పరిసర నగరాల లో మనబడి బాలబడి, ప్రవేశం, ప్రసూనాం, ప్రకాశం, ప్రమోదం, ప్రభాసం తరగతుల్లో పిల్లలను చేర్పించదలచుకున్నవారు మరింత సమాచారం కోసం ఇక్కడ తమ పేరు నమోదు చేసుకోగలరు: http://tinyurl. com/manabadi123. టాగ్స్ సమన్వయకర్త నాగ్ దొండపాటిని ఇ-మెయిలు telugusac. manabadi@gmail. com లో సంప్రదించగలరు.

# సిలికానాంధ్ర మనబడి

భాషాసేవయే భావితరాల సేవ




సిలికానాంధ్ర మనబడి తెలుగును తరగతులలోనే కాకుండా పిల్లలకు తెలుగు మరింత దగ్గరయ్యేందుకు, బాలానందం రేడియో, “తెలుగు మాట్లాట” ఆటల పోటీలు, పిల్లల పండుగ, నాటకోత్సవాలు, ఇలా ఎన్నో కార్యక్రమాలు చేబడుతోంది. శాక్రమెంటో లో సెప్టెంబర్ 8, 2021 నుంచి ప్రారంభమయ్యే 2021-2022 విద్యాసంవత్సరంలో పిల్లలను http://manabadi. siliconandhra. org/ ద్వారా నమోదు చేసుకోవచ్చు. సిలికానాంధ్ర మనబడి ఒక దశాబ్ది ప్రయాణంలో తెలుగును ప్రాచీన భాష నుంచి ప్రపంచ భాష చెయ్యడంలో తనవంతు కృషి చేస్తోంది. ఈ సందర్భంగా భాషాసేవయే భావితరాల సేవ అన్న నినాదంతో శాక్రమెంటో లో ఉన్న తెలుగు వారినందరినీ చెయ్యి కలపమని టాగ్స్ అహ్వానిస్తోంది.

ooo

# ప్రతిభావంతులైన స్థానిక పిల్లలు 2023

కరోనా నేపధ్యంలో 2021-22 సంవత్సరానికి ప్రతిభావంతులైన పిల్లలను పురస్కారాలతో ప్రోత్సహించే సంప్రదాయాన్ని టాగ్స్ వాయిదావేయక తప్పలేదు. సంక్రాంతి 2023 సంబరాల సందర్భంగా ప్రతిభావంతులైన స్థానిక పిల్లలు - 2023 గూర్చి ఒక ప్రకటన టాగ్స్ నుండి డిసెంబర్ నెలలో వచ్చే అవకాశం ఉంది. కాబట్టి పిల్లలూ, పెద్దలు టాగ్స్ ప్రకటన కోసం వేచి ఉండండి!

--మనోహర్ మందడి.

★★★★★

# జ్ఞానానందమయం - 10

శ్రీ శేష కళ్యాణి గుండమరాజు

**తప్పు – ఒప్పు**

ఒక ఆదివారం సాయంత్రం పెరట్లో కూర్చుని చిక్కుడుకాయలు వలుస్తోంది ప్రసూనాంబ. అక్కడే ఆడుకుంటున్న కృష్ణానందకు ఒక చిలుక అరుపు వినపడింది. చిలుక కోసం చుట్టూ చూశాడు కృష్ణానంద. ఆ చిలుక తమ పెరట్లోని జామచెట్టు కొమ్మ మీద కూర్చుని కనపడింది కృష్ణానందకు!

చూడటానికి ఎంతో ముద్దుగా, అందంగా ఉన్న ఆ చిలుకను చూసి,"బామ్మా! అదిగో! ఆ చిలుకను చూడు!! ఎంత బాగుందో!", అన్నాడు కృష్ణానంద.

"అవునురా! నిజమే. ఈ మధ్య మన జామచెట్టు మీద చిలుకలు బాగానే వాలుతున్నాయి!", అంది ప్రసూనాంబ.

"బామ్మా! బామ్మా! నాకు ఆ చిలుకను పెంచుకోవాలని ఉంది. ఈ సారి అది చెట్టు మీద వాలినప్పుడు దాన్ని వలతో పట్టుకుందాం!", అన్నాడు కృష్ణానంద.

"తప్పురా! అలా చెయ్యకూడదు. మనం చిలుకను పట్టుకుంటే అప్పుడది భయంతో చచ్చిపోతుంది! పైగా దానిని హింసించినందుకు మనకు పాపం చుట్టుకుంటుంది!", చెప్పింది ప్రసూనాంబ.

ఆ సమాధానం విన్న కృష్ణానంద చిన్నబుచ్చుకుని, "ఏం కాదు బామ్మా! నేను ఆ చిలుకను బాగా చూసుకుంటా. దానికి మూడుపూట్లా ఆహారం పెడతా. ప్రతిరోజూ దానితో బోలెడు కబుర్లు చెప్పి ఆడుకుంటా!", అన్నాడు.

అప్పుడు ప్రసూనాంబ కృష్ణానందను దగ్గరకు తీసుకుని, "అదికాదురా నాన్నా! చిలుకలు ప్రకృతిలో స్వేచ్ఛగా తిరుగుతూ జీవించే పక్షులు. వాటిని చిన్న పంజరంలో బంధించి నువ్వు ఎంత బాగా చూసుకున్నా అవి సంతోషంగా ఉండలేవు. ఆ బాధతో అవి త్వరగా చచ్చిపోతాయి. ప్రకృతిలో ఉండే పక్షులనూ, జంతువులనూ చూసి ఆనందించాలే కానీ సొంతం చేసుకోవాలని అనుకోకూడదు. చూస్తూ ఉండు! మరో రెండు వారాల్లో కొన్ని చిలుకలు మన జామచెట్టు పైన గూడు కట్టుకుని గుడ్లు పెడతాయి. అప్పుడు ఆ గుడ్లనుంచీ బుల్లి చిలుకలు పుట్టి, అవి పెద్దవై మన జామచెట్టు కొమ్మల మధ్యన అటూ ఇటూ ఎగురుతూ ఉంటే నువ్వు వాటిని చూస్తూ ఎంతసేపైనా ఆనందంగా గడపచ్చు!", అంది.

ప్రసూనాంబ చెప్పినది కృష్ణానందకు నిజమేనని అనిపించింది.

"సరే బామ్మా!", అని వేరే ఆటలో పడిపోయాడు కృష్ణానంద.

కొద్దిరోజులు గడిచాయి. మళ్ళీ ఆదివారం వచ్చింది. కృష్ణానంద పెరట్లో ఆడుకుంటున్న సమయంలో అక్కడవున్న ఒక మొక్క మొదట్లో ఒక చిలుక పడిపోయింది. ఆ చిలుక ఎంతకీ కదలకపోవడంతో వెంటనే పరుగు పరుగున ప్రసూనాంబ వద్దకు వెళ్లి చిలుక విషయం ఆమెకు చెప్పాడు కృష్ణానంద. ప్రసూనాంబ చేతిలో ఉన్న పనిని వదిలిపెట్టి పెరట్లోకి వచ్చి చిలుకను పరీక్షగా చూసింది. ఆ చిలుక కొనప్రాణంతో ఉంది. ప్రసూనాంబ ఒక పాత గుడ్డను పట్టుకొచ్చి చిలుకను అందులో జాగ్రత్తగా చుట్టి తమ ఇంట్లోకి తీసుకుని వెళ్లి, ఆ చిలుకను తడి బట్టతో తుడిచి, దానికి కొన్ని నీళ్లు తాగించి దాని శరీరమంతా చేతి వేళ్ళతో నెమ్మదిగా నిమిరింది. కాసేపటికి చిలుక తేరుకుంది. చిలుక మెల్లిగా లేచి నిలబడి ఎగిరే ప్రయత్నం చేసింది కానీ ఎగరడం దానివల్ల కాలేదు. ప్రసూనాంబ చిలుకను ఒక చిల్లుల బుట్టలో పెట్టి, కొన్ని పళ్ళను ముక్కలుగా కోసి వాటిని ఆ చిలుక పక్కన ఉంచి, ఆ బుట్టకు మూత పెట్టి దానిని గదిలో ఒక పక్కగా ఉంచింది. కృష్ణానంద చిలుక వంకా ప్రసూనాంబ వంకా మార్చి మార్చి చూస్తున్నాడు.

అది గమనించిన ప్రసూనాంబ, "ఏమిట్రా ఆనందూ? ఏదో సందేహమొచ్చినట్లుంది నీకూ?? అడుగుమరీ!", అంది నవ్వుతూ.

"బామ్మా! నీకు పాపం వస్తుంది!", అన్నాడు కృష్ణానంద చిరు కోపంతో.

"ఎందుకురా?", కంగారుగా అడిగింది ప్రసూనాంబ.

"ఎందుకంటే నువ్వు చిలుకను బుట్టలో పెట్టి బంధించావు కదా? అందుకు!", చెప్పాడు కృష్ణానంద అన్నీ తెలిసినవాడిలా.


"లేదులేరా కృష్ణా! వస్తే పుణ్యం వస్తుందేమో కానీ పాపం రాదులే!", ధీమాగా చెప్పింది ప్రసూనాంబ.

"అదెట్లా? ఆ రోజు నేను చిలుకను పెంచుకుంటానంటే ఇలా బంధించడం తప్పనీ మనకు పాపం వస్తుందనీ చెప్పావు కదా?", అయోమయంలో పడ్డట్టుగా అడిగాడు కృష్ణానంద.

"ఓ! అదా నీ సందేహం. చూడు కృష్ణా! సందర్భాన్ని బట్టి, మామూలుగా తప్పైన పని ఒక్కొక్కప్పుడు ఒప్పుగా మారచ్చు! నువ్వు బయట స్వేచ్ఛగా ఎగురుతున్న చిలుకను తెచ్చి బంధిస్తే అది తప్పు. కానీ ఇప్పుడు ఈ చిలుకకు దెబ్బ తగిలి ఎగరలేని స్థితిలో ఉంది. మరి ఈ చిలుకను బయట వదిలేస్తే ఆకలితోనో లేక ఏ పిల్లో తినేయడం వల్లనో అది చచ్చిపోతుంది! ఈ ప్రకృతి అంతా పరమాత్ముడే. ప్రకృతిలో ఉండే అన్ని జీవుల ప్రాణమూ విలువైనదే. సాటి ప్రాణి కష్టంలో ఉందని తెలిసినప్పుడు దానికి మనకు చేతనైన సహాయం చేసి దాని ప్రాణాలు కాపాడే ప్రయత్నం మనం చెయ్యాలి. ఈ భూమి మీద జీవిస్తున్నందుకు అన్ని ప్రాణుల సుఖం కోరడం మన ధర్మం!", వివరంగా చెప్పింది ప్రసూనాంబ.

"బామ్మా! చూడు! ఆ చిలుక నువ్వు ఇచ్చిన పళ్ళ ముక్కలను తింటోంది!", ఆనందంతో చప్పట్లు చరుస్తూ చెప్పాడు కృష్ణానంద.

"ఊఁ! అంటే ఆ చిలుక బాధనుండీ తేరుకుంటోందన్నమాట!", అంది ప్రసూనాంబ.



మర్నాడు తెల్లవారుఝామున ప్రసూనాంబ కృష్ణానందను పిలిచి చిలుక ఉన్న బుట్టను పెరట్లోకి తీసుకెళ్లి ఆ బుట్ట మూతను తెరిచింది. చిలుక రివ్వున గాల్లోకి ఎగిరి జామచెట్టు మీద వాలింది.

అది చూసి కృష్ణానంద,"ఆయ్! భలే భలే! చిలుకకు నొప్పి తగ్గిపోయింది!", అంటూ గెంతులు వేశాడు.

చిలుక 'కీ!కీ!", అని అరిచి అక్కడే గాల్లో రెండు చక్కర్లు కొట్టి ఎగురుతూ ఎటో వెళ్ళిపోయింది.

"ఆ చిలుక నీకు కృతజ్ఞతలు చెప్పినట్లుంది బామ్మా! నువ్వన్నది నిజమే. ఆ చిలుకను బయటే వదిలేసి ఉంటే దాని ప్రాణాలు దక్కేవి కాదేమో! దాని విషయంలో మనం చేసింది తప్పు కాదు ఒప్పే!", అంటూ బడికి తయారవ్వడానికి హుషారుగా ఇంట్లోకి పరిగెత్తాడు కృష్ణానంద.

*****

గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

# చిత్ర కదంబం



1.నీలి సంద్రం లా కనిపిస్తున్న సరస్సు – G.S.S. కళ్యాణి (శాక్రమెంటో) తీసిన చిత్రం



2. పుడమికి శిశిర ఋతువు నుండి వచ్చిన బహుమతి చిత్రం – ఉమా



3.చెట్టు కొమ్మల్లో దాగున్న భానుడి చిత్రం – ఉమా



9

గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

# ప్రత్యేక శీర్షికలు



# తెలుగు తేజాలు – అవధాని శిరోమణి "కాశీ కృష్ణాచార్యులు"

శ్యామసుందర్ అంబడిపూడి



సంస్కృతాంధ్ర భాషా వాఙ్మయ రంగాలలో, సంగీతం, వీణ, వేణువు, వయోలిన్ మృదంగాది వాద్యాలు, వడ్రంగం, కుమ్మరం, నేత, ఈత, వంట వ్యాయామం, కుస్తి, గారడీ మొదలైన చతుష్షష్టి కళలలో అపార వైదుష్యాన్ని ప్రావీణ్యాన్నికలిగిన మేధావులు చాలా అరుదు, అటువంటి వారిని వ్రేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు, అటువంటి వారిలో సమున్నత స్థానము ఆక్రమించిన వారు శ్రీ కాశీ కృష్ణాచార్య్లులు గారు. పసితనములోనే తన ప్రతిభను కనబరిచి నూనూగు మీసాల వయస్సులోనే అవధాన ప్రక్రియ చేపట్టి అనతికాలంలోనే అవధాన శిరోమణి బిరుదు అందుకున్న మహనీయుడు కృష్ణాచార్యులు గారు. వీరి మొదటి అష్టావధానం వినుకొండలో జరిగింది. ఆ తరువాత వీరు వాడరేవు, పర్లాకిమిడి, పొదిలి, పామూరు మొదలైన చోట్ల సంస్కృతాంధ్రాలలో అష్టావధానాలు, మక్థల, ఉడిపి, కాశీ మొదలైన చోట్ల సంస్కృతావధానాలు, బందరులో శతావధానము, గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, వేంకటగిరి, పిఠాపురం, నూజివీడు, శ్రీకాళహస్తి, విజయనగరం మొదలైన సంస్థానాలలో అవధానాలు, ఆశుకవితా ప్రదర్శనలు నిర్వహించారు. వీరు సమస్యా పూరణములలో కష్టముగా నున్నట్లు తోచినప్పుడు, హయగ్రీవస్వామిని ప్రార్థించెడివారట. అట్టి ఒక పద్యము– "భావమునందు నిన్నెపుడు బాసి యెఱుంగని వాడనయ్య, యో పావన నామధేయ, నను బాలను ముంచిన నీట ముంచినన్ నీవ గదయ్య, దిక్కితరునిన్ మఱి వేడగబోవ నో హయ- గ్రీ వవధాన వార్ధి నను రేవును జేర్పుము నీకు మ్రొక్కెదన్" వీరు ప్రతి ప్రదర్శనమునకు ముందు, ఉపన్యాసమునకు ముందు అశ్వధాటి వృత్తములో హయగ్రీవ స్వామిని స్తుతించే వారట కృష్ణాచార్యులు గారు. కృష్ణా జిల్లా మచిలీపట్నములో ఒక సాంప్రదాయ కుటుంబములో 1872 సంవత్సరములో లక్ష్మణాచార్యులు, అక్కి పిచ్చమాంబ దంపతులకు జన్మించారు. కానీ గుంటూరు లో గల రామచంద్ర

అగ్రహార వాస్తవ్యులు కాశీ కృష్ణంబ, వేద వ్యాస దంపతులకు దత్తతగా వచ్చారు. బాల్యములోనే విద్యార్జనకు అయన చూపించిన శ్రద్ధాసక్తులు అమోఘమైనవి. గుంటూరులో అధరాపురపు శ్రీనివాసాచార్యులు గారి వద్ద సంస్కృత, ఆంధ్ర భాషల సాహిత్యాలను అధ్యాయనము చేసాడు. అంతటితో అయన విజ్ఞాన పిపాస తీరక కాలి నడకన విజయనగరం చేరి అక్కడ మహీశుర భీమాచార్యుల వద్ద శిష్యుడు గా చేరి తర్కశాస్త్రములో ప్రావీణ్యము సంపాదించాడు. ఆ తరువాత పెరి వెంకట శాస్త్రి గారి వద్ద పాణీనీయ పాండిత్యాన్నిఆర్జించాడు. ఆ తరువాత గోదావరి తీరంలోని కాకరపర్తి లో గల గుమ్మలూరి సంగమేశ్వర శాస్త్రిగారి వద్ద శిష్యుడు గా చేరి తర్క శాస్త్ర నైపుణ్యాన్ని సొంతము చేసుకున్నాడు ఆ సమయములోనే వేదాంత శాస్త్రాన్నికూడా అధ్యయనము చేసాడు.

ఆ విధముగా సాహిత్య, తర్క, వేదాంత, శాస్త్ర అధ్యయనము, పాణీనీయ పాండిత్యముతో అవధాన కవిత్వముతో, ఆశుకవిత్వముతో, ప్రావీణ్యము సంపాదించినప్పటికీ తృప్తి చెందలేదు. అయన తనకు రాని విద్య అంటూ ఏది ఉండకూడదు అన్నతపనతో అనేక విద్యలు నేర్చుకున్నాడు. విజయనగరంలో అయన పాండిత్యాన్ని గుర్తించి ఆయనకు "సర్వకళా ప్రపూర్ణ" అనే బిరుదును ఇచ్చారు. ఇరవై సంవత్సరాల యువ కవి పండితుడుగా గుంటూరులో అవధానం ఆరంభించారు. 1911 లో డిశంబర్ 1 వ తేదీన అయన బందరులో అయన నిర్వహించిన శతావధానము గణనీయమైనది వ్యక్తిగత విషయాలకు వస్తే ఆయనకు ఆనాటి సాంప్రదాయాలకు అనుగుణముగా పదకొండేళ్ల వయస్సులోనే కుంభారీ లక్ష్మి నరసాంబతో వివాహము జరిపించారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు. కృష్ణాచార్యులు గారు 20 సంవత్సరాలు. గుంటూరు టౌన్ హైస్కూలు లోను గుడివాడ హైస్కూలు లోను సంస్కృత, ఆంధ్ర అధ్యాపక వృత్తిలో ఉన్నారు. వీరు పండితులు మాత్రమే కాదు, అవధానులు, సంగీత విద్వాంసులు కూడ. వీరి శిష్యులు పండ్రంగి రామారావు ఎఫ్. ఎ. చదువుతూ శతావధానాన్ని నిర్వహించడం వీరి చలవే. 1961లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థానకవి పదవిని చేపట్టి 1967లో మరణించే వరకు ఆ పదవిని అలంకరించారు. అనేక సంస్థానాలలో ఆయనకు సన్మానాలు జరిగినాయి. 1965లో ఆంధ్ర విశ్వవిద్యాలయము వీరిని కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. అయన అవధాన పద్యాలూ ఆశుకవితలు ఉన్నత సాహిత్య ప్రమాణాలతో శ్రోతలను రంజింపచేశాయి. వీరు సంస్కృత భాషా బోధనకు, ప్రచారానికి జీవితాంతం పాటుపడిన వ్యక్తి. ఈ ఆశయ సాధనకు అయన 1917 , జనవరి 18న మాతృ భాష సమాజాన్ని స్థాపించి మాతృ భాష పేరిట ఒక పత్రికను నెలకొల్పారు. సంస్కృత భాష ప్రచారము కోసము కృష్ణచార్యులు గారు మూడు భాగాల బాలబోధినులు, క్రియదర్శనము, ఆంధ్ర సంస్కృత నిఘంటువు, వంటి గ్రంధాలను రచించారు అలాగే అత్యంత మధుర మనోహర శైలిలో అనేక అష్టకాలను దండకాలను శతకాలను స్తోత్రాలను రచించారు. ఒక సందర్భాన నెల్లూరులో అయన ఆశువుగా అరగంటలో సంస్కృత భాషలో రంగనాయక శతకాన్ని వినిపించి శ్రోతలను అలరించారు. అయన సంస్కృత భాషకు చేసిన సేవలను గుర్తించిన భారత రాష్ట్రపతి 1960 ఆగస్టు 15 న అధికార లాంఛనాలతో ఘనముగా సన్మానించారు. గుంటూరు ప్రజలు 1961 ఫిబ్రవరి 15, 16 తేదీలలో ఆయనను ఘనముగా సన్మానించి సంస్కృత సామ్రాజ్య పట్టాభిషిక్తుని కావించి రత్నకనక కిరీటాన్ని సమర్పించారు. సంస్కృతాంధ్ర సరస్వతికి అమూల్యాభరణాలను సమర్పించి సాహిత్య సమారాధన నిర్వహించిన కాశీ కృష్ణాచార్యులు గారు తన తొంబై ఆరవ ఏట 1967లో పరమపదించారు.

# ఆధ్యాత్మికం - త్రిమూర్తి రూపుడు శ్రీ గురు దత్తుడు

G.S.S. కళ్యాణి



సమస్త ప్రాణికోటిలో మానవజాతి సర్వోత్తమమైనది. ఒక్క మానవుడు మాత్రమే ఆధ్యాత్మిక సాధన చేసి తానే దైవంగా మారగలడు. సరైన మార్గంలో చేసే సాధన త్వరగా ఫలిస్తుంది. ఆ మార్గం చూపించేది సద్గురువు. మాసములలో 'మార్గ' శీర్షం తానే అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో తెలిపాడు. అట్టి పవిత్రమాసంలో, చంద్రుడు పదహారు కళలతో ప్రకాశించే పున్నమి వేళ, సృష్టి, స్థితి, లయ కారకులైన త్రిమూర్తులు ఒక్కరూపమై, తపస్సంపన్నుడైన అత్రి మహర్షికీ, అనసూయా మాతకూ తనయుడిగా, శ్రీ దత్తాత్రేయుడిగా అవతరించారు. అదే శ్రీ దత్త జయంతి.

ఒక సద్గురువు, తానే బ్రహ్మ అయి తన శిష్యులలో జ్ఞానజ్యోతిని వెలిగించి, తానే విష్ణువై వారి జ్ఞానాన్ని పెంచుతూ, తానే మహేశ్వరుడై వారి అజ్ఞానాన్ని నశింపచేస్తాడు. అటువంటి సద్గురువులకు గురువు శ్రీ దత్తాత్రేయుడు. ఆయన రూపం భగవంతుడి త్రిగుణాత్మక స్వరూపాన్ని తెలియజేస్తుంది. మూడు ముఖములు, ఆరు చేతులతో దిగంబరుడై, పంచ భూతాలకు ప్రతీకలుగా ఉన్న సుదర్శన చక్రం(అగ్ని), కమండలం(భూమి), డమరుకం(ఆకాశం), శంఖం(వాయువు, జలం) చేతులలో ధరించి, ధర్మానికి సంకేతమైన గోవుతో, పాదాల వద్ద చతుర్వేదాలకు ప్రతీకగా ఉన్న శునకాలతో, తన భక్తుల

పాపములను(అఘములను) తొలగించే అనఘాదేవి సమేతుడై, నిత్యమూ పదహారేళ్ళ ప్రాయంలో ఉన్న యోగిగా, అవధూతగా దర్శనమిస్తాడు శ్రీ దత్తాత్రేయుడు. ఈయన రూపాలు పదహారు. మనము దర్శించుకోదగ్గ దత్త క్షేత్రాలూ పదహారు. వీటిలో గాణగాపురం ఎంతో పవిత్రమైనదిగా, మహామహిమాన్వితమైనదిగా భావిస్తారు దత్త భక్తులు. మానవులకు వచ్చే మానసిక రోగాలు సైతం ఈ క్షేత్రదర్శనంతో నయమవుతాయని భక్తుల నమ్మకం.

లోకంలో మానవుల కష్టాలు తొలగించి, వారిలో జ్ఞానాన్ని కలిగించి, వారి చేత ఆధ్యాత్మిక సాధన చేయించి, వారిని తనంతటి వారిగా తీర్చిదిద్దటమే శ్రీ దత్తావతార లక్ష్యం. కుల, మత భేదాలు కానీ, పేద, ధనిక తేడాలు కానీ లేకుండా అందరినీ సమ దృష్టితో చూడటం, సమస్త ప్రాణికోటికీ సహాయం చెయ్యడం దత్తభక్తుల విధి. శ్రీ దత్తాత్రేయుడు అనేక అవతారాలు ధరించి ఆయా కాలాలకు అనుగుణంగా తన దివ్య బోధలు సాగించాడు. సాగిస్తున్నాడు. శ్రీ దత్తాత్రేయుడి అవతారానికి పరిసమాప్తి లేదు. ఆయన నేటికీ సహ్యాద్రి పర్వతాలలో సంచరిస్తూ, తన భక్తులను అనుగ్రహిస్తూ ఉంటాడట! ఎంత పెద్దవారైనా, చదువు సంధ్యలు లేనివారైనా దత్తావతారుల్ని ఆశ్రయించి, వారి యొక్క ఇహలోక కష్టాలు తీర్చుకుంటూనే ఉత్తమ జన్మకి సాధన చేసుకోగలగటం శ్రీ దత్త ఆరాధనలో విశిష్టత.

మన సంతానం సుఖంగా సంతోషంగా ఉండాలని మనం కోరుకుంటాం. వారి వలన మనం కూడా బాగుండాలని కోరుకుంటాం. అలాగే మన సంతానం వల్ల ప్రపంచమంతా బాగుపడాలి. అందుకు త్యాగబుద్ధి, సత్ప్రవర్తన, సదాచారం వారికి అలవడాలి. ఇవి మనకు దత్త ఆరాధనవల్ల లభిస్తాయి. శ్రీ దత్తాత్రేయుడు, తన భక్తులను అనుగ్రహించడానికన్నా ముందు, వారికి కఠినమైన పరీక్షలను పెడతాడని అంటారు కొందరు. కానీ ఆ దత్తాత్రేయుడినే 'స్మతృగామి' అంటోంది శాస్త్రం. అంటే ఎవరైతే దత్తుడి నామాన్ని స్మరిస్తారో వారి వద్దకు శ్రీ దత్తాత్రేయుడు వెళ్లి, వారితో ఎల్లవేళలా ఉంటూ, వారిని అనుగ్రహిస్తాడు అని అర్థం. కేవలం స్మరణ మాత్రం చేత ప్రసన్నుడై మనకు కావలసిన ఇహ పర జ్ఞానాన్ని ప్రసాదించే ఆ శ్రీ దత్తాత్రేయుడి దివ్య చరణాలను శరణు వేడి ఆయన కరుణకు పాత్రులమవుదాం.

(ఈ శీర్షికకు ఆధారం: చిన్నప్పుడు పెద్దలు నాకు నేర్పిన విషయాలు, అంతర్జాలంలో లభ్యమైన వివరాలు, మరియు శ్రీమతి B.N.L. నాంచారమ్మ గారు అందించిన సమాచారం)

# సరదాగా కాసేపు

**సంకలనం – ఉమా**

## 1. నా పొట్ట, నా ఇష్టం




కొత్త వింత పాత రోత చందాన్ని అందరికంటే ముందు మన ప్రవాసులే బాగా వంటబట్టించుకుంటారు. ఎవరికైనా సందేహం ఉంటే, అమెరికాలో కొత్తగా వెలసిన ఏ రెస్టారెంట్ కైనా శుక్ర, శని, ఆది వారాలలో సాయంత్రం వెళ్లి చూడండి, జనాలతో కిటకిటలాడకపోతే నన్నడగండి. ఆ మాటకొస్తే, 2000 ఏడులో సిలికాన్ వాలీ లో వెలసిన "కోమల విలాస్" రెస్టారెంట్ బయట కొండవీటి చేంతాడంత లైను నా కళ్లారా చూశానంటే నమ్మండి. రాజమండ్రి నగరంలో "నా పొట్ట, నా ఇష్టం" రెస్టారెంట్ ఈ మధ్యనే వెలసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టింగులు చక్కర్లు కొడుతున్నాయి. రేపు మీ నగరంలో కూడా ఇలాంటి రెస్టారెంట్ ఒకటి రావచ్చు! సరే రాజమండ్రి లేదా మీరుండే నగరంలో వెలసిన "నా పొట్ట, నా ఇష్టం" రెస్టారెంట్ కి వెళ్లి, రెచ్చిపోయి పొట్టదాటి ఆపై పీకలదాకా తినాలని మీరు తీర్మానించుకుంటే తీర్మానించుకున్నారు గాక, కానీ ముందు సదరు  రెస్టారెంట్ వాడు మీ పొట్టకు ఇన్స్యూరెన్స్ ఇస్తాడేమో కనుక్కోండి బ్రదర్! ఎందుకన్నా మంచిది!

మరేంలేదు ... వినాయకుడు – ఉండ్రాళ్ళు – చంద్రుడు కథ ఎందుకో గుర్తుకువస్తుంది నాకు! నోటికి తినే పనిచెప్పినప్పుడు "చిన్న నా బొజ్జ కు శ్రీరాముడి రక్ష" అని పూర్తిగా వదిలెయ్యకుండా, మన ప్రయత్నం మనం చెయ్యాలి గదా!

## 2. అనగనగా ఒక సీసా, సీసాలో...



అనగనగా ఒక సీసా, సీసా అంటే సీసా కాదు, మందు సీసా మరి. ఫోటోలో కనిపిస్తుందిగా అది, ఈ మందు సీసా కథేమిటో తెలుసుకుందాం!


స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్ ప్రాంతంలో ఓ ఇంటిలో మరమ్మతులు చేస్తున్నారు. పీటర్ అలన్ అనే 50ఏళ్ల వ్యక్తి ప్లంబర్ పైప్‌వర్క్‌ను గుర్తించడానికి ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపాడు. తొవ్వుతుండగా .. విస్కీ బాటిల్ కనిపించింది. దానిలో లేఖ ఉన్నట్లు గుర్తించాడు. ఈ విషయాన్ని వెంటనే యాజమానికి వివరించాడు. యాజమాని ఎలిద్ స్టింప్సన్, ఆమె ఇద్దరు పిల్లలు కలిసి ఆ లేఖను బయటకు తీసి చదివారు. 135ఏళ్ల నాటి లేఖ అది. విస్కీ బాటిల్‌లో భద్రపర్చిన ఈ లేఖ విక్టోరియన్ కాలం నాటిదిగా గుర్తించారు. సీసాలోని లేఖను బయటకు తీసేందుకు ప్రయత్నించగా సాధ్యం కాకపోవటంతో ఇంటి యాజమానులు సీసాను పగలగొట్టి అందులోని లేఖను తీసి చదవారు. ఆ లేఖలో ఇద్దరు మగ వ్యక్తుల సంతకాలు చేసి ఉంది. 1887 సంవత్సరం తేదీ వేసి ఉంది.

1887 అక్టోబర్ 6 కాలంనాటి లెటర్‌గా గుర్తించారు. అందులో ఇద్దరు మగ వ్యక్తులు జేమ్స్ రిట్చీ, జాన్ గ్రీన్ అనే వ్యక్తులు ఈ లెటర్ పై సంతకం చేసినట్లు ఉంది. నోట్‌ను చదవగా ఇలా వ్రాసి ఉంది.. "జేమ్స్ రిట్చీ మరియు జాన్ గ్రీవ్ ఈ అంతస్తును వేశారు, కానీ వారు విస్కీని తాగలేదు. ఎవరైనా ఈ బాటిల్‌ను కనుగొంటే మన దుమ్ము రోడ్డుపై ఎగిరిపోతోందని

అనుకోవచ్చు." అని ఉంది. ఆ తరువాత ఎలిద్ బాటిల్, నోట్ మొక్క చిత్రాన్ని ఫేస్‌బుక్‌లో పోస్టు చేసింది. దీంతో ఆ పురాతన కాలంనాటి లేఖ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

లేఖ లో చెప్పినట్లు జేమ్స్ రిట్చీ మరియు జాన్ గ్రీవ్ మహానుభావులు విస్కీని తాగలేదు అని మాటవరసకు అనుకుందాం, కానీ బాటిల్ లో చుక్క విస్కీ కూడా లేదు, మరి ఫుల్ బాటిల్ విస్కీ ఎక్కడికిపోయినట్లు చెప్మా ! ఇదేదో విక్రమార్క – భేతాళ ప్రశ్న లా ఉంది కదండీ? ముక్తాయింపుగా, ఖాళీ విస్కీ సీసా లో నోట్ రాసి పెట్టినవాళ్ల చతురతను అభినందించకుండా ఉండలేము కదా! మరి మీరు ఖాళీ సీసాలలో సందేశం పెట్టి ఏ సముద్రం లోనో లేదా నేలపై పాతిపెట్టే ప్రయత్నం చేయాలనుకుంటున్నారా? చేయండి, తప్పులేదు, రేపు మీ మనవాళ్ళు లేదా ముని మనవాళ్లకు మీ సందేశం చేరే అవకాశం ఉంది.

## 3.కిటికీ



మెకానికల్ డిపార్ట్మెంట్ కంప్రెసర్ డైనమిక్స్ లాబ్ వైవా జరుగుతోంది .... ఓ స్టూడెంట్ లోపలికి వెళ్ళాడు.

ఎక్స్ టర్నల్ (ఎగ్జామినర్) : " నువ్వు ట్రైన్ లో వెళ్తుండగా, సడెన్ గా నీకు వేడిగా ఉంది, ఉక్కపోత అనిపిస్తే ఏం చేస్తావు ? "

స్టూడెంట్ నవ్వుతూ " సింపుల్, కిటికీ తెరుస్తాను సర్ "

ఎక్స్ టర్నల్: " గ్రేట్! సపోజ్ .. ఆ కిటికీ వైశాల్యం 1.5sq.m, కంపార్ట్మెంట్ ఘనపరిమాణము 12m3, ట్రైన్ 80km వేగంతో పశ్చిమ దిశగా ప్రయాణిస్తోంది. దక్షిణ దిశగా 5m/s వేగంతో గాలి వీస్తోంది. మరి ఆ కంపార్ట్మెంట్ చల్లబడడానికి ఎంత సమయం పడుతుంది ?"

స్టూడెంట్ ... ఆన్సర్ చెప్పలేక బిక్క మొహం వేశాడు.

ఫెయిల్ అయినట్లు ఎక్స్ టర్నల్ మార్క్ చేశారు.

ఆ స్టూడెంట్ బయటికి వచ్చి, లోపల అడిగిన ప్రశ్న గురించి బయట వున్న స్టూడెంట్స్ అందరికీ చెప్పాడు. నా బతుకు బస్టాండ్ అయిందిరా మామ, మీరైనా జాగ్రత్తపడండి అని చెప్పాడు ఆ స్టూడెంట్.

నెక్స్ట్ స్టూడెంట్ లోపలికి వెళ్ళాడు. వైవా స్టార్ట్ అయింది ...

ఎక్స్ టర్నల్ : " నువ్వు ఒక ట్రైన్ లో వెళ్తుండగా, సడెన్ గా నీకు వేడిగా, ఉక్కపోత అనిపిస్తే ఏం చేస్తావు ?

స్టూడెంట్ ' " నే వేసుకున్న కోట్ విప్పేస్తాను సర్ "

ఎక్స్ టర్నల్ : " అయినా ఇంకా వేడిగా వుంది. మరి అపుడు "

స్టూడెంట్ ' " నేను షర్ట్ విప్పేస్తాను సర్ "

ఎక్స్ టర్నల్ (కాస్త చిరాకుగా) : " అయినా ఇంకా వేడిగా వుంది. మరి ? "

స్టూడెంట్- ' " నేను బనియన్ తీసేస్తాను సర్ "

ఎక్స్ టర్నల్ (కోపంగా) : " అయినా ఇంకా భరించలేనంత వేడిగా వుంది అనుకో. మరి అప్పుడు ? "

స్టూడెంట్- ' " నేను ప్యాంట్ విప్పేస్తాను సర్ "

ఎక్స్ టర్నల్ (పట్టలేనంత కోపంతో) : " అయినా ఇంకా చచ్చేంత వేడిగా వుంది. అపుడు ఎమ్ చేస్తావు ? "

స్టూడెంట్ -' " అంతే సార్, నేను చస్తే చచ్చాను గానీ ... ఆ కిటికీ మాత్రం అస్సలు తెరవను సర్, అంతే.

## 4.మాయం – మయం

🌸క్లర్కులు మాయం

🌸కూలీలు మాయం

🌸కోడళ్ళ పనితనం మాయం

🌸అత్తమామల మాటసాయం మాయం

🌷అల్లుళ్ళ గౌరవ హోదా మాయం

🌞పోస్టుమాన్ మాయం

🌸ఆసాంతం వినే వైద్యుడు మాయం

చీర రవిక మాయం

పుస్తక పఠనం మాయం

రేడియోకి శ్రోతలు మాయం

పెరడు అక్కడ బావి మాయం

సైకిలు మాయం

ఎండావకాయ మాయం

కుంపటిపై దిబ్బరొట్టి మాయం

మట్టి వాసన మాయం

పిడతకింద పప్పు బండి మాయం

వందరోజులాడే సినిమాలు మాయం

అర్ధరాత్రయినా నిశ్శబ్దత లేని నిశిరాత్రులు మాయం

ఉపాధ్యాయుడు మాయం

కుంకుడుకాయ సీకాకాయ మాయం

టెస్టు క్రికటర్ మాయం

వాకిట పూలమొక్కలు మాయం

పిచ్చుక, సీతాకోకచిలుక మాయం

సత్తుగిన్నె చారు మాయం

స్కూల్లో మైదానం మాయం

సంఘంలో నిదానం మాయం

తరవాణి దబ్బాకు వాము పప్పునూనె మాయం

వానపాము మాయం

చెరువుల్లో ఆటలు మాయం

కోతికొమ్మచ్చి కబడ్డీ మాయం

చివరికి గోచీ కూడా మాయం

అంతా టెక్నాలజీ మయం

ధూళి లేని గాలి మాయం

పాళీ ఉన్న పెన్ను మాయం

ఖాళీ ఉన్న స్నేహితుడు మాయం

నిలకడగా కురిసే వాన మాయం

నిర్మానుష్యమైన ఏకాంతం మాయం

కంటికి నిద్ర మాయం

వెన్నెల చూడాలనే కన్నులు మాయం

పట్టుమని పదినిమిషాల ఏకాగ్రత మాయం

హారన్ మోత లేని వీధి మాయం

దోమలు లేని పార్కులు మాయం

తోటమాలి కొలువే మాయం

దాచుకుందామంటే వడ్డీరేటు మాయం

'ఒక అల్లం పెసర' అని కేక వేసే అయ్యర్ – పాక హోటల్ మాయం

వన్ బై టూ టీ మాయం

నిఖార్సయిన చేగోడీ, వడియం, అప్పడం మాయం

ప్రేమ ప్రకటించే పొందిక మారి ప్రేమలేఖలే మాయం

బ్రేకప్ వార్తలే వార్తలై సాధారణత మాయం

ఎవరి మొబైల్ లోకి వాళ్ళు మాయం

అంతా టెక్నాలజీ మయం

చివరకి నాణ్యమైన విబూది మాయం!

ooo

# జాతిని మేల్కొల్పిన తెలుగు పాట – తెలుగువీర లేవరా (అల్లూరి సీతారామరాజు)

సంకలనం : ఉమా

**తెలుగువీర లేవరా...దీక్షబూని సాగరా...దేశమాత స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా**
**కవనం:  శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీ శ్రీ)**
**చిత్రం: అల్లూరి సీతారామరాజు**
**గానం: ఘంటసాల వెంకటేశ్వరరావు, విస్సంరాజు రామకృష్ణ**
**సంగీతం: పెనుపాత్రుని ఆదినారాయణరావు**

తెలుగువీర లేవరా, దీక్షబూని సాగరా
దేశమాత స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా

దారుణ మారణకాండకు తల్లడిల్లవద్దురా
నీతిలేని శాసనాలు నేటినుండి రద్దురా
నిదురవద్దు బెదరవద్దు నింగి నీకు హద్దురా

ఎవడువాడు ఎచటివాడు ఇటువచ్చిన తెల్లవాడు
కండబలం కొండబలం కబళించే దుండగీడు
మానధనం ప్రాణధనం దోచుకునే దొంగవాడు
తగినశాస్తి చెయ్యరా తరిమితరిమి కొట్టరా

ఈదేశం ఈరాజ్యం నాదే అని చాటించి
ప్రతిమనిషీ తొడలుగొట్టి శృంఖలాలు పగులగొట్టి
చురకత్తులు పదునుపట్టి తుదిసమరం మొదలుపెట్టి
సింహాలై గర్జించాలి సంహారం సాగించాలి


కృష్ణ సమర్పించు
PADMALAYA PICTURES
పద్మాలయా పిక్చర్స్
కృష్ణ నటించిన 100వ, చిత్రం
అల్లూరి సీతారామరాజు
సినిమాస్కోప్ & ఈస్ట్మన్ కలర్
నిర్మాత: జి.హనుమంతరావు
నిర్వహణ: జి.ఆదిశేషగిరిరావు B.Sc.
దర్శకత్వం: వి.రామచంద్రరావు B.A.(HONS)
తారకరామా ఫిలింస్

వందేమాతరం వందేమాతరం

స్వాతంత్ర్య వీరుడా స్వరాజ్య భానుడా అల్లూరి సీతారామరాజా
అందుకో మా పూజలందుకో రాజ అల్లూరి సీతారామరాజా

తెల్లవాడి గుండెల్లో నిదురించినవాడా
మా నిదురించిన పౌరుషాగ్ని రగిలించినవాడా
త్యాగాలే వరిస్తాం, కష్టాలే భరిస్తాం
నిశ్చయముగ నిర్భయముగ నీ వెంటనె నడుస్తాం

కృష్ణ 100వ చిత్రమైన అల్లూరి సీతారామరాజు 1974లో విడుదలైంది. అల్లూరి సీతారామరాజు సినిమాలో అల్లూరి పాత్రలో చేసిన నటనకు 1974లో ఉత్తమ నటునిగా నంది పురస్కారం కృష్ణ అందుకున్నారు. అల్లూరి సీతారామరాజు తెలుగులో ఫుల్‌స్కోప్ సినిమాల్లో మొదటిది. బాక్సాఫీస్ రికార్డుల పరంగా చూస్తే, హైదరాబాద్ నగరంలో ఏడాది పాటు ఆడిన తొలి తెలుగు సినిమాగా అల్లూరి సీతారామరాజు నిలిచిపోయింది. అల్లూరి సీతారామరాజు దర్శకుడు వి.రామచంద్రరావు ఆ సినిమా చిత్రీకరణ ప్రారంభం అయిన కొన్నాళ్ళకే అనారోగ్యంతో మరణించడంతో, సినిమాను కృష్ణ స్వయంగా దర్శకత్వం వహించి పూర్తిచేసినా ఘోస్ట్ డైరెక్టరుగానే ఉండిపోయి దర్శకుడిగా వి.రామచంద్రరావు పేరే వేశారు. 1974లో స్వంత బ్యానర్‌పై అల్లూరి సీతారామరాజు సినిమా ఆయన తీశారు. ప్రముఖ బ్రిటీష్ వ్యతిరేక విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు జీవితం ఆధారంగా తీసిన అల్లూరి సీతారామరాజు సినిమా కృష్ణ కెరీర్‌లో పెద్ద మైలురాయి అని చెప్పవచ్చు.

అల్లూరి సీతారామరాజు జీవితాన్ని "విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు" పేరిట సినిమాగా తీస్తానని 1957లోనే ప్రకటించి, తర్వాత స్క్రిప్టును పక్కన పెట్టి ఎన్.టి.రామారావు తీయకుండా తాత్సారం చేస్తూండడంతో కృష్ణ ముందుకు వెళ్లి కథ, మాటల రచయితగా తన ఆస్థాన రచయితా మహారథి సహకారంతో "అల్లూరి సీతారామరాజు" సినిమాను నిర్మించారు. ఎన్.టి.రామారావు కృష్ణను ఆ సబ్జెక్టు ప్రజాదరణ పొందలేదని, తీయవద్దని వారించినా వినలేదు. అయితే ఆ అంశంపై వారిద్దరి నడుమ అభిప్రాయ భేదాలు తలెత్తాయి. అయితే పిదప "అల్లూరి సీతారామరాజు" సినిమాను తిలకించి స్వయంగా ఎన్.టి.రామారావు కృష్ణను అభినందించినట్లు సినీ పరిశీలకులు పేర్కొన్నారు. ఈ సినిమా నిర్మాణమవుతూండగా పలువురు పరిశ్రమ పెద్దలు ఈ సినిమా కృష్ణను, పద్మాలయా ప్రొడక్షన్స్‌ను నష్టాల్లో ముంచేస్తాయని చెప్పిన జోస్యాలు వమ్మయ్యేలా అనూహ్య విజయాలు సాధించింది ఈ సినిమా. దటీజ్ సూపర్ స్టార్ కృష్ణ!

ఈ దేశం,ఈ రాజ్యం మనదే,మనమే కాపాడుకోవాలి..రాబోవు యువ తరానికి మంచి సమాజాన్ని అందిద్దాం అనే సందేశాన్ని మనకు అల్లూరి సీతారామరాజు సినిమాలో శ్రీ శ్రీ కలం ద్వారా మనకు కృష్ణ గారు అందించారు. ఘంటసాల

గారి పాట అయిన రామకృష్ణ గారు పాడిన చివరి చరణం వీక్షకులకు కన్నీళ్లు తెప్పించింది. అద్భుతమైన ఓ విప్లవ కావ్యం ఈ సినిమా. కృష్ణ గారి పై పూలు కురిపిస్తూ ఆ మన్నెం వీరులు త్యాగాలకు సిద్ధం అనే సన్నివేశం ప్రేక్షకులను కదిలించింది. తెలుగు ప్రజలకు ఆల్ టైమ్ ఫేవరెట్ హీరో అల్లూరి సీతారామరాజు. అద్భుతమైన ఈ పాట వింటే జన్మ జన్మల కూడా మర్చిపోము మనం, మహాకవి శ్రీ శ్రీ గారి అద్భుతమైన సాహిత్యం. ఈ పాట విన్నప్పుడు శ్రోతలకు, వీక్షకులకు రోమాలు నిక్కబొడుచుకుంటాయి. "తెలుగు వీర లేవరా" పాటకై శ్రీశ్రీ జాతీయ ఉత్తమ సినీ గీత రచయితగా పురస్కారం అందుకున్నారు. జాతిని మేల్కొల్పిన తెలుగు పాట గా అల్లూరి సీతారామరాజు సినిమాలోని "తెలుగువీర లేవరా" నిలిచిపోయింది.

ఈ పాట ఈ క్రింది యూ ట్యూబ్ లంకె నొక్కి మీరు వీక్షించవచ్చు.

https://www.youtube.com/watch?v=8oTbzver_c0

లేదా

https://tinyurl.com/TagsSong32

పాట మరో ముగ్గురికి పంచుకోండి సుమా!

★★★★★

# పోషకులు/స్పాన్సర్స్ కు విజ్ఞప్తి

శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రికలో మీ వ్యాపార ప్రకటనలకు లేదా యాడ్ ల కొరకు లేదా తదితర వివరాలకు సంపాదక బృందాన్ని ఈ-మెయిలు sactags@gmail. com కు సంప్రదించండి.

**Request to All Sponsors**

We welcome you to place your business advt in Sacramento Telugu Velugu Patrika,

In this regards we request you to contact us at sactags@gmail. com

# స్పందన

**నవంబరు 2022 సంచికకు సంబంధించి పాఠకుల స్పందనను ఈ క్రింద అందిస్తున్నాము:**

## 1. Visalakshi Damaraju (భారత్)

Sent Date: Wed, Nov 9, 2022 at 5:31 PM PST

Subject: Re: "శాక్రమెంటో తెలుగు వెలుగు" పత్రిక – నవంబర్ 2022 సంచిక

నవనవోన్మేషమై నవంబరు సంచిక నయనానందంగా ఉంది. ఎడిటోరియల్ బాగుంది. అక్షర సత్యాలు చెప్పారు. పత్రికను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వారందరికీ హృదయపూర్వక అభినందనలు.

## 2. డా.మైలవరపు లలితకుమారి (ఇండియా)

Sent: 10/31/2022 2:47

మీ పత్రిక తెలుగుభాషకు ఎనలేని సేవచేయటమేకాక రచయితలకు ప్రోత్సాహాన్నిస్తున్నది.

## 3. డాక్టర్ పొదిలి నాగరాజు (కుప్పం)

Sent: 11/1/2022 17:09

నేను రాయలసీమ నవలా సాహిత్యం మీద పరిశోధన చేశాను.. పాలకొల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించి పుస్తకాన్ని తీసుకుని వచ్చాను.అగ్ని శిల్పం అనే కవిత సంపుటిని ఇటీవలే వెలువరించాను. ఇవి కాకుండా ఎన్నో కవితలు రాశాను. విమర్శ వ్యాసాలు, చారిత్రక వ్యాసాలు, పరిశోధనాత్మక వ్యాసాలు రాశాను. దాదాపు 30 సెమినార్లలో (జాతీయ అంతర్జాతీయ) పత్ర సమర్పణ చేశాను. ప్రస్తుతం కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాను. శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక మంచి పత్రిక. ధన్యవాదాలు.

## 4. బులుసు సరోజినిదేవి (విశాఖపట్నం)

Sent: 11/1/2022 18:41

మీ తెలుగు వెలుగు ద్వారా " మోపు" అనే కథ కు నాకు మంచి గుర్తింపు లభించింది. శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక నవంబరు సంచిక చాలా బాగుంది.

# పాఠకులకు విజ్ఞప్తి



పాఠకుల నుండి, కొత్త కలాలనుండి, అలాగే అనుభవజ్ఞులైన రచయితలనుండి కూడా ఒక అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి మేము పూనుకొన్నాము. ఇప్పటికే ఈ అభిప్రాయ సేకరణలో పాల్గొని మీ అభిప్రాయాలు తెలియజేసినవారందరికీ మా కృతజ్ఞతలు. అభిప్రాయ సేకరణలో ఇంకా పాల్గొననివారు చెయ్యవలసిందల్లా, ఒక్క ఐదు నిమిషాలు ఈ పనికి కేటాయించి ఈ క్రింది లంకెను నొక్కి మీ అభిప్రాయాలను, ప్రాధాన్యతలను మాకూ తెలియజెయ్యడమే.



https://tinyurl.com/TagsTeluguVeluguSurvey2022

ధన్యవాదాలు

